SAMAYAM

epaper.samayamdaily.net APTEL/2006/18267

# సమయం

మన గొంతుక.. మన పత్రిక తెలుగు దినపత్రిక

సమయం

విలేకరులు కావలెను

ఫోన్ నెం : 99483 13985/ 89789 80131

సంపుటి: 19 | సంచిక: 55 | ఎడిటర్ : విక్రం కుమార్ | శనివారం 6 డిసెంబర్ 2025 | ప్రచురణ : హైదరాబాద్ | పేజీలు: 12 | వెల:రూ.5 |

# మార్చిలో లక్ష ఇండ్లు



- జూన్ నాటికి మరో 2 లక్షలు ఇండ్లు
- ఏప్రిల్ నుంచి రెండో విడత మంజూరు
- త్వరలో అర్బన్ హౌసింగ్ పాలసీ
- హిల్ట్ పాలసీపై కేటీఆర్‌వి అర్థం లేని విమర్శలు
- మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి వెల్లడి

'వచ్చే మూడేళ్లలో అర్బన్ ప్రాంతాల్లోనూ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తాం. ఇక్కడ జీ ప్లస్ త్రీ, జీ ప్లస్ ఫోర్ విధానంలో నిర్మిస్తాం. మధ్య తరగతి వర్గాలకూ మంజూరయ్యేలా చర్యలు చేపట్టాం. ప్రస్తుతం 3.82 లక్షల ఇళ్ల నిర్మాణం జరుగుతోంది" అని పొంగులేటి తెలిపారు.

**హైదరాబాద్, డిసెంబర్ 5:** తమ ప్రభుత్వం వచ్చాక పేదలకు అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపట్టామని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. అర్హులైన పేదలందరికీ ఇళ్లు ఇవ్వాలన్నది తమ ప్రభుత్వ లక్ష్యమని వెల్లడించారు. ఇందిరమ్మ ఇళ్ల అంశంపై నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇల్లు కేటాయించే బాధ్యత తీసుకున్నట్లు పేర్కొన్నారు. వచ్చే మూడేళ్లలో అర్బన్ ప్రాంతాల్లోనూ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తాం. ఇక్కడ జీ ప్లస్ త్రీ, జీ ప్లస్ ఫోర్ విధానంలో నిర్మిస్తాం. మధ్యతరగతి వర్గాలకూ మంజూరయ్యేలా చర్యలు చేపట్టాం. ప్రస్తుతం 3.82లక్షల ఇళ్ల నిర్మాణం జరుగుతోందని పొంగులేటి తెలిపారు. రాష్ట్రంలో మూడు లక్షల ఇందిరమ్మ

మిగతా 2 లో

"టెర్రరిజానికి వ్యతిరేకంగా జరుగుతున్న పోరాటంలో భారత్‌తో కలిసి నడుస్తామని రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ అన్నారు. టెర్రరిజాన్ని పూర్తిగా నాశనం చేసేందుకు భారత్‌కు అండగా ఉంటామని స్పష్టం చేశారు. శుక్రవారం ఢిల్లీలోని హైదరాబాద్ హౌస్‌లో ద్వైపాక్షిక శిఖరాగ్ర సమావేశంలో ప్రధాని మోదీ, పుతిన్‌లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పుతిన్ మాట్లాడుతూ.. 'మోదీతో నిర్మాణాత్మక చర్చలు జరిగాయి. భారత్ ఆతిథ్యం ఎంతో సంతోషాన్నిచ్చింది. అనేక అంశాల్లో ఇరుదేశాల మధ్య అవగాహన కుదిరింది. విభిన్న అంశాలపై పరస్పరం అభిప్రాయాలు పంచుకున్నాం. భారత్-రష్యా మధ్య 64 బిలియన్ డాలర్ల వ్యాపారం జరిగింది. ఇరుదేశాల మధ్య ట్రేడ్ మరింత పెంచేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి."



# భారత్‌తో బంధం మరింత బలోపేతం

- భారత్-రష్యా మధ్య 64 బిలియన్ డాలర్ల వ్యాపారం
- ఇరుదేశాల మధ్య మరింత వాణిజ్య సహకారం
- అమెరికా ఆంక్షలు ఉన్నా చమురు రవాణా ఆగదు
- సొంత కరెన్సీలతో వ్యాపారానికి చేరువగా ఉన్నాం
- ఉగ్రవాదంపై పోరులో భారత్‌తో కలిసి నడుస్తాం
- మోదీతో భేటీలో మీడియా సమావేశంలో పుతిన్

## భారత్ ఎల్లప్పుడూ శాంతిపక్షమే

పుతిన్‌తో భేటీలో ప్రధాని మోదీ స్పష్టీకరణ 2

**న్యూఢిల్లీ, డిసెంబర్ 5:** 'ఆయిల్ సహా అన్ని రంగాల్లో సహకారం అందిస్తాం. ఉమ్మడి ప్రాజెక్టులు, సాంకేతిక అంశాల్లో పరస్పర సహకారం ఉంటుంది. సొంత కరెన్సీల్లో ఇరుదేశాల మధ్య వాణిజ్యం జరుగుతోంది. కొడంకుళం అణువిద్యుత్ ప్రాజెక్టుకు సహకరిస్తాం. విద్యుత్ రంగంలో ఖర్చు తగ్గింపునకు సాయం అందిస్తాం. భారత్‌తో కీలక ఒప్పందాలపై సంతకాలు జరిగాయి. భారత్‌కు నిరంతరంగా ఇంధనాన్ని సరఫరా చేయడానికి సిద్ధంగా ఉన్నాం' పుతిన్ అని అన్నారు. భారతదేశం బ్రిక్స్ అధ్యక్ష పదవిని చేపడుతుందని అధ్యక్షుడు పుతిన్ తెలిపారు. వచ్చే ఏడాది భారతదేశం బ్రిక్స్ అధ్యక్ష పదవిని చేపడుతుందన్నారు. భారత్‌కు అవసరమైన అన్ని రకాల సహాయాన్ని అందిస్తామన్నారు. ఉక్రెయిన్‌తో జరుగుతున్న యుద్ధాన్ని ఆపటానికి ప్రధాని మోదీ ఎంతో ప్రయత్నిస్తున్నారని చెప్పారు. యుద్ధం ఆపే ప్లాన్ గురించి తనకు వివరించి చెప్పారని అన్నారు. అమెరికా లాంటి దేశాల నుంచి వాణిజ్య ఒత్తిడులు ఎదురైతున్నప్పటికీ .. భారత్– రష్యా మధ్య ఇంధన సరఫరా

మిగతా 2 లో



02

## సారీ మై లార్డ్!

హైకోర్టుకు హైడ్రా కమిషనర్ క్షమాపణలు

న్యాయస్థానం ఎదుట హాజరైన ఏవీ రంగనాథ్



## కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు హైకోర్టు నోటీసులు

హిల్ట్ పాలసీపై కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశం

తదుపరి విచారణ 29కి వాయిదా 02

## 92 ఇండిగో ఫ్లయిట్ల రద్దు



### రంగంలోకి కేంద్రం

ఇండిగో సంక్షోభంపై దర్యాప్తునకు ఆదేశం

సర్వీసుల పునరుద్ధరణకు తక్షణ చర్యలు 04

- శంషాబాద్ విమానాశ్రయంలో పోర్ట్‌లో ప్రయాణికుల ఆందోళన
- ఇండిగో విమానాల రద్దుతో ప్రయాణికుల ఆగ్రహం
- ఏపీ మంత్రి పార్థసారథి చొరవతో అయ్యప్ప భక్తులకు ప్రత్యేక విమానం

04



## సీఎం నిర్ణయంపైనే రాజీనామా ఆధారం

ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ వ్యాఖ్యలు 02

## సాయి ఈశ్వర్ మరణానికి ప్రభుత్వానిదే బాధ్యత



03

- బీసీ రిజర్వేషన్లతో మోసం వల్లే అతను ఆత్మహత్య
- కుటుంబానికి 50 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలి
- బీఆర్ఎస్ నేతలు కేటీఆర్, హరీష్‌రావు డిమాండ్

మిగతా

## పదేండ్లు దోచుకున్న వాళ్ల పవర్ కట్ అయ్యింది

అభివృద్ధి కోసం ఎవరినైనా కలుస్తా.. ఎవరితోనైనా మాట్లాడుతా

- వారి పాలనలో వేలకోట్లు దోచుకున్నరు
- పాలనను గాలికి వదిలేశారు
- వరి వేస్తే ఉరి అని బెదిరించారు
- ఉచిత విద్యుత్ పేటెంట్ కాంగ్రెస్‌దే
- నిరుద్యోగులు పోటీ పరీక్షలకు సిద్ధంకండి
- త్వరలోనే ఉద్యోగ నోటిఫికేషన్ఇస్తాం
- రాజకీయాలో జీవితాలు నాశనం చేసుకోవద్దు
- నర్సంపేట సభలో సీఎం రేవంత్‌రెడ్డి

03



**వరంగల్, డిసెంబర్ 5:** బీఆర్ఎస్ నేతలు అధికారంలో ఉండగా పదేళ్లలో భారీగా ఆస్తులు సంపాదించారు.. కానీ ఈ ప్రాంతం అభివృద్ధిని గాలికి వదిలేశారని సీఎం రేవంత్ రెడ్డి మండిపడ్డారు. కేసీఆర్ ఆనాడు వరి వేసుకుంటే ఉరి వేసుకున్నట్లేనని అన్నారు.. కానీ, కాంగ్రెస్ ప్రభుత్వం.. వ్యవసాయాన్ని లాభసాటిగా మారుస్తూ.. వరికి ప్రోత్సాహకాలిచ్చామని తెలిపారు. సన్న వడ్లు పండిస్తే 500 బోనస్ ఇస్తున్నామని అన్నారు. ఉచిత విద్యుత్ పేటెంట్ మా పార్టీదని రేవంత్‌రెడ్డి తెలిపారు. గత పాలకులు ఫాంహౌస్‌లు కట్టుకున్నారు, విమానాలు కొన్నారు.. ఉద్యమగడ్డ వరంగల్ కు మాత్రం ఏమీ ఇవ్వలేదని ఘాటు విమర్శలు చేశారు. గత పాలకులు రైతు రుణమాఫీ చేయలేదు.. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు రైతు రుణమాఫీ చేసింది.. రాష్ట్రంలో కోటి 10 లక్షల రేషన్ కార్డులు ఇచ్చాం.. 3 కోట్ల 10 లక్షల మందికి ఈ ప్రభుత్వం సన్న బియ్యం

మిగతా 3 లో




# కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు హైకోర్టు నోటీసులు

### హిల్ట్ పాలసీపై కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశం

### తదుపరి విచారణ 29కి వాయిదా

**హైదరాబాద్, డిసెంబర్ 5:** హిల్ట్ పాలసీపై తెలంగాణ హైకోర్టులో శుక్రవారం విచారణ జరిగింది. హిల్ట్ పాలసీపై ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్ పిటిషన్లు దాఖలు చేశారు. 9,292 ఎకరాల భూ కేటాయింపుల విషయంలో రూపొందించిన జీఓ నిబంధనలకు విరుద్ధంగా ఉందని హైకోర్టుకు ఆయన తెలిపారు. దీనిపై సీబీఐ లేదా ఈడీ దర్యాప్తు చేయించాలని పిటిషనర్ విజ్ఞప్తి చేశారు. ఇప్పటివరకు ఉన్న రికార్డులను సీజ్ చేసి ఫోరెన్సిక్ ఆడిట్ చేయించాలని కోర్టుకు విన్నవించారు. పిటిషనర్ వాదనలు విన్న ధర్మాసనం.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు నోటీసులు జారీ చేసింది. వెంటనే రిప్లై ఫైల్ దాఖలు చేయాలని న్యాయస్థానం ఆదేశించింది. తదుపరి విచారణను డిసెంబర్ 29వ తేదీకి వాయిదా వేసింది హైకోర్టు.

## మరో బాలుడిపై వీధికుక్క దాడి

**హైదరాబాద్, డిసెంబర్ 5:** హైదరాబాద్‌లో మరో బాలుడిపై వీధి కుక్కలు దాడికి తెగబడ్డాయి. యూసుఫ్‌గూడ పరిధిలోని శ్రీలక్ష్మీనరసింహనగర్‌లో ఇంటి ముందు ఆడుకుంటున్న మాన్విత్ నందన్ అనే రెండేళ్ల చిన్నారిపై వీధి కుక్క దాడికి దిగింది. చిన్నారి చేతిని కరిచే ప్రయత్నం చేసింది. అక్కడే ఉన్న బాలుడి తాత అప్రమత్తమై కర్రతో కొట్టడంతో వీధికుక్క అక్కడి నుంచి వెళ్లిపోయింది. అనంతరం గాయాలపాలైన బాలుడిని కుటుంబసభ్యులు చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. దీనికి సంబంధించిన వీడియో ఇప్పుడు సోషల్‌మీడియాలో వైరల్‌గా మారింది. కాగా, వీధికుక్కల విజృంభణపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నగరంలో వీధి కుక్కల దాడులు జరుగుతున్నా, ప్రభుత్వం, జీహెచ్ఎంసీ ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని మండిపడ్డారు.

## కాళోజీ వర్సిటీ ఇన్‌చార్జ్ వీసీగా రమేష్



**హైదరాబాద్, డిసెంబర్ 5:** కాళోజీ నారాయణరావు యూనివర్సిటీ ఆఫ్ హెల్త్ సైన్సెస్ ఇన్‌చార్జ్ వీసీగా డా. రమేష్ రెడ్డిని ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ కార్యదర్శి క్రిస్టినా ఉత్తర్వులు జారీ చేశారు. రమేష్ రెడ్డి ప్రస్తుతం యాదాద్రి భువనగిరి ప్రభుత్వ మెడికల్ కాలేజీకి ప్రిన్సిపల్‌గా పని చేస్తున్నారు.గతంలో డీఎంఈగా పని చేసిన విషయం తెలిసిందే. కాగా,అక్రమమార్గంలో విద్యార్థులను పాస్ చేశారని ఆరోపణలు రావడంతో విజిలెన్స్ విచారణ కొనసాగుతున్న క్రమంలో నందకుమార్‌రెడ్డి వీసీ పదవికి రాజీనామా చేశారు. ఐదుగురు విద్యార్థులు అక్రమ మార్గంలో పాస్ అయ్యారని వచ్చిన ఆరోపణలపై విజిలెన్స్ విచారణ కొనసాగుతున్నది. ఇలాంటి నాటకీయ పరిణామాల మధ్య డాక్టర్ రమేష్ రెడ్డిని ఈ నియామకం జరగడం ప్రాధాన్యత సంతరించుకుంది.

## కారులో తరలిస్తున్న 4కోట్లు స్వాధీనం



**హైదరాబాద్, డిసెంబర్ 5:** కారులో తరలిస్తున్న హవాలా డబ్బును పోలీసులు ఛేజ్ చేసి పట్టుకున్నారు. నగరంలోని శామీర్‌పేటలో కారులో భారీగా హవాలా నగదు లభ్యమైంది. టైర్లు, సీట్ల కింద రూ.4 కోట్ల నగదును పోలీసులు గుర్తించారు. హవాలా మార్గంలో తరలిస్తున్నట్లు సమాచారం అందడంతో బోయిన్‌పల్లి క్రైమ్ పోలీసులు తనిఖీలు చేపట్టారు. హవాలా డబ్బు కేసులో 2024లో ఓ వ్యక్తి పరారయ్యాడు. ఇవాళ ఆ వ్యక్తి భారీ మొత్తంలో నగదుతో నిజామాబాద్ నుంచి వస్తున్నట్లు టాస్క్‌ఫోర్స్ పోలీసులకు సమాచారం అందింది. ఈ నేపథ్యంలో తనిఖీలు నిర్వహించిన పోలీసులు శామీర్‌పేట ఔటర్ రింగ్ రోడ్డు వద్ద నిందితుడిని అదుపులోకి తీసుకొని, డబ్బును స్వాధీనం చేసుకున్నారు.

## గ్లోబల్ సమ్మిట్ విజయవంతం కావాలి

### సందేశం పంపిన సోనియాగాంధీ



**న్యూఢిల్లీ,డిసెంబర్5:** తెలంగాణ అభివృద్ధిలో రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ కీలక పాత్ర పోషించ నుందని కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ ఛైర్‌పర్సన్ సోనియాగాంధీ పేర్కొన్నారు. తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ విజయవంతం కావాలని ఆకాంక్షిస్తూ సోనియాగాంధీ సందేశం పంపించారు. డిసెంబర్ 8,9 తేదీల్లో సమ్మిట్ జరుగనుంది. ఇటీవలే సిఎం రేవత్ కాంగ్రెస్ అగ్రనేతలకు ఆహ్వానాలు అందించారు. ఈ క్రమంలో సోనియా శుభాకాంక్షలు తెలుపుతూ సందేశం పంపడం విశేషం. రాష్ట్రాభివృద్ధికి సంబంధించిన కీలక ప్రాజెక్టులు, ప్రణాళికల్లో భాగస్వాములు కావాలనుకునే వారికి ఈ సదస్సు వేదికగా నిలుస్తుందన్నారు. అర్బన్, సెమీ అర్బన్, గ్రామీణ వ్యవసాయాభివృద్ధి ప్రాజెక్టులకు సమ ప్రాధాన్యం ఇచ్చేలా మూడంచెల వ్యూహంతో తెలంగాణ ముందుకు సాగుతోందని సోనియా తన సందేశంలో పేర్కొన్నారు. తెలంగాణలోని మానవ, సహజ వనరులు, ప్రజల వ్యాపార, సాంకేతిక నైపుణ్యాలు, అంతర్జాతీయ ప్రతిభ అభివృద్ధికి సమ్మిట్ మరింత తోడ్పడుతుందని పేర్కొన్నారు. ఈ నెల 8, 9వ తేదీల్లో తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ నిర్వహించనున్నందుకు... ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి సోనియాగాంధీ అభినందనలు తెలిపారు. రాష్ట్రాభివృద్ధికి సీఎం చేస్తున్న కృషి విజయవంతం కావాలని ఆమె ఆకాంక్షించారు. సదస్సులో పాల్గొననున్న వారందరికీ శుభాకాంక్షలు తెలిపారు.

# భారత్‌తో బంధం మరింత బలోపేతం

మొదటి పేజీ తరువాయి

కొనసాగుతుందని స్పష్టం చేశారు. పశ్చిమ దేశాల నుంచి వస్తున్న ఒత్తిడుల కారణంగా కొంతకాలంగా చమురు దిగుమతులను భారత్ తగ్గించినప్పటికీ.. ఆ దేశాభివృద్ధికి సహకరించడం కోసం సరఫరాను పెంచేందుకు చర్యలు చేపడతామని పేర్కొన్నారు. గతేడాది భారత్-రష్యా మధ్య ద్వైపాక్షిక వాణిజ్యం 12 శాతం పెరిగి.. రికార్డు సృష్టించిందని రష్యా అధ్యక్షుడు అన్నారు. ఈ ఏడాది కూడా ఇదే స్థాయిలో పెరుగుదల ఉంటుందని విశ్వాసం వ్యక్తం చేశారు. ఇరు దేశాల ద్వైపాక్షిక వాణిజ్యం 2030 నాటికి 100 బిలియన్ డాలర్లకు చేరుతుందని పుతిన్ ఆశాభావం వ్యక్తం చేశారు. రక్షణ సహకారాన్ని కూడా మరింత విస్తరిస్తామని తెలిపారు. రష్యా దృష్టి పెట్టాల్సిన కీలక సవాళ్ల గురించి మోదీ తనతో చర్చించారని.. భారత్- యురేషియా ఆర్థిక సంఘం మధ్య




స్వేచ్ఛా వాణిజ్య మండలాన్ని సృష్టించడం వంటి వాణిజ్య సంబంధాలను బలోపేతం చేయడానికి ప్రయత్నాలు కొనసాగుతున్నాయన్నారు. అంతే కాకుండా భారత్-రష్యా క్రమంగా చెల్లింపుల కోసం తమ జాతీయ కరెన్సీలను ఉపయోగించే దిశగా కదులు తున్నాయని.. దాదాపు 96 శాతం వాణిజ్య చెల్లింపులు జాతీయ కరెన్సీలలోనే జరుగుతున్నాయన్నారు.మీడియా సమావేశంలో మోదీ మాట్లాడుతూ.. ఉగ్రవాదంపై పోరుకు భారత్- రష్యా కలిసి నడుస్తాయన్నారు. ఇటీవల పహల్గాంలో జరిగిన దాడికి, గతేడాది రష్యా రాజధాని మాస్కో లోని క్రాకస్ సిటీ కాన్సర్ట్ హాల్‌లో జరిగిన దాడికి మూల కారణం ఉగ్రవాదమేనని అన్నారు. మానవత్వ విలువలపై చేస్తున్న ఈ ప్రత్యక్ష దాడులకు వ్యతిరేకంగా ఉగ్రవాదంపై పోరుకు ఇరుదేశాలు ఏకమైనట్లు తెలిపారు. భారత్, రష్యా, యూఎన్, జీ20, బ్రిక్స్ వేదికలు సన్నిహిత సహకారాన్ని కలిగి ఉన్నాయని.. ఈ వేదికలన్నింటిలో ఉగ్రవాదానికి వ్యతిరేకంగా సహకారాన్ని కొనసాగిస్తామన్నారు.

# భారత్ ఎల్లప్పుడూ శాంతిపక్షమే

- భారత్,రష్యాల శాంతిమార్గం
- దైత్యంతోనే రష్యా, ఉక్రెయిన్‌లు విభేదాల పరిష్కారం
- పుతిన్‌తో భేటీలో మోడీ స్పష్టీకరణ

**న్యూఢిల్లీ, డిసెంబర్ 5:** శాంతిపక్షానే భారత్ నిలుస్తుందని, ఉక్రెయిన్ సంక్షోభాన్ని శాంతియుతంగా, చర్చల ద్వారా పరిష్కరించుకునేందుకు సహకరిస్తుందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. న్యూఢిల్లీలోని హైదరాబాద్ హౌస్‌లో రష్యా అధ్యక్షుడు పుతిన్‌తో శుక్రవారం జరిగిన ఉన్నత స్థాయి సమావేశంలో ప్రధాని పాల్గొన్నారు. అనంతరం ప్రధాని మాట్లాడుతూ, దేశాల సంక్షేమం శాంతి మార్గంలోనే ఉందని, దౌత్యం ద్వారానే రష్యా, ఉక్రెయిన్‌లు విభేదాలను పరిష్కరించుకుంటారనే నమ్మకం తనకు ఉందని చెప్పారు. భారత్, రష్యా కలిసి ప్రపంచాన్ని శాంతి మార్గంలో నడిపిద్దామని పుతిన్‌తో అన్నారు. ఉక్రెయిన్ సంక్షోభం మొదలైనప్పటి నుంచి పుతిన్ ప్రభుత్వం భారత్‌పై విశ్వాసం ఉంచి ప్రతి విషయాన్ని తమతో పంచుకుందని మోదీ అన్నారు. ఇరుదేశాల మధ్య నమ్మకం అనేది గొప్ప బలమని, ఇదే విషయాన్ని తాము పదేపదే చెబుతూ వచ్చామని, ప్రపంచానికి కూడా తెలియజేశామని అన్నారు. ఇటీవల కాలంలో గ్లోబల్ నేతలతో తాను ఎప్పుడు మాట్లాడినా ఇండియా తటస్థం కాదనీ, ఇండియాకు స్పష్టమైన వైఖరి ఉందని, శాంతియుతంగా జరిగే ఏ పరిష్కారానికైనా తమ మద్దతు ఉంటుందని చాలా స్పష్టంగా చెప్పామని మోదీ తెలిపారు. భారత్-రష్యా మధ్య భాగస్వామ్యానికి ఇంధన భద్రత అనేది బలమైన



స్తంభం వంటిందని, పరస్పర లాభదాయక సహకారాన్ని తాము కొనసాగిస్తామని మోదీ చెప్పారు. సివిల్ న్యూక్లియర్ ఎనర్జీలో తమ భాగస్వామ్యం దశాబ్దాల నాటిదని, క్రిటికల్ మినిరల్స్ అంశంలోనూ పరస్పర సహకారం తప్పనిసరని అన్నారు. ఆర్థిక సహకారం పెంపునకు విజన్ 2023 డాక్యుమెంట్‌పై ఉభయదేశాలు సంతకం చేసినట్టు చెప్పారు. ఇండియా-రష్యా బిజినెస్ ఫోరంలోనూ ఈరోజు తామిరువురూ పాల్గొంటామని, ఇరుదేశాల మధ్య వాణిజ్య సంబంధాలను పటిష్టం చేసేందుకు ఇది వేదిక అవుతుందని తాము బలంగా నమ్ముతున్నామని చెప్పారు. కాగా, ఉక్రెయిన్‌తో శాంతియుత పరిష్కారానికి తాము పని చేస్తున్నట్టు పుతిన్ కూడా ప్రధాని మోదీకి తెలిపారు. కాగా, దీనికి ముందు పుతిన్‌కు రాష్ట్రపతి భవన్‌లో ఘన స్వాగతం పలికారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధాని మోదీ, ఇతర ప్రముఖులు హాజరయ్యారు. తన పర్యటనలో భాగంగా రాజ్‌ఘాట్‌లోని మహాత్మాగాంధీ విగ్రహానికి పుతిన్ నివాళులర్పించారు. మోడ్రన్ ఇండియా వ్యవస్థాపకుల్లో ఒకరిగా, గొప్ప ఫిలాసఫర్‌గా, మానవతావాదిగా మహాత్మాగాంధీ నిలిచారని, ప్రపంచ శాంతికి ఎనలేని కృషి చేశారని పుతిన్ అక్కడి విజిటర్స్ బుక్‌లో రాశారు. స్వేచ్ఛ, మంచితనం, మానవత్వంపై మహాత్మాగాంధీ ఆలోచన నేటికీ నిత్య నూతనమని గుర్తుచేసుకున్నారు.

# మార్చిలోగా లక్ష ఇండ్లు

మొదటి పేజీ తరువాయి

ఇళ్లు వివిధ దశల్లో నిర్మాణంలో ఉన్నాయని మంత్రి పొంగులేటి వ్యాఖ్యానించారు. త్వరలో లక్ష ఇళ్లు గృహప్రవేశానికి సిద్ధం అవుతాయని పేర్కొన్నారు. వచ్చే ఏడాది మార్చి నాటికి మూడు లక్షల ఇళ్లకు గృహప్రవేశం పూర్తి అవుతుందని వివరించారు. వచ్చే ఏప్రిల్ నాటికి రెండో విడత ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం ప్రారంభం అవుతుందని చెప్పుకొచ్చారు. కోర్ అర్బన్ ప్రాంతాల్లో ఇందిరమ్మ ఇళ్ల కోసం కూడా ప్రణాళిక సిద్ధమైందని వెల్లడించారు. గ్రౌండ్ ప్లస్ ఫోర్ బిల్డింగ్ నిర్మించి పేదలకు ఇచ్చే ప్రణాళికలు చేస్తున్నామని చెప్పుకొచ్చారు. త్వరలో అర్బన్ ప్రణాళిక ప్రకటిస్తామని స్పష్టం చేశారు. ఓ ఆర్ ఆర్‌కు ఆనుకుని నలువైపులా ఉన్న స్థలాల్లో ఇళ్లు నిర్మిస్తామని తెలిపారు. ఒక్కో చోట 10వేల ఇళ్లు నిర్మించి నో ప్రాఫిట్, నో లాస్ కింద మధ్యతరగతి ప్రజలకు ఇస్తామని వివరించారు. గ్లోబల్ సమ్మిట్‌లో ప్రణాళికలు ప్రకటిస్తామని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. గత కేసీఆర్ ప్రభుత్వం హౌసింగ్ శాఖను నిర్వీర్యం చేసిందని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. హౌసింగ్ శాఖను తిరిగి తాము బలోపేతం చేశామని వివరించారు. గతంలో నిర్మించి మధ్యలో వదిలేసిన ఇళ్లకు కూడా ఇందిరమ్మ పథకం వర్తింపజేయాలని తాము ఆలోచిస్తున్నామని చెప్పుకొచ్చారు. రూరల్‌లో, అర్బన్‌లో ఇళ్ల స్థలం లేని నిరుపేదలకు కూడా త్వరలో శుభవార్త చెబుతామని పేర్కొన్నారు. ఒక విడతలోనే ఇళ్లు ఇచ్చి తాము చేతులు దులుపుకోమని చెప్పుకొచ్చారు. హిల్ట్‌పాలసీపై మాజీ మంత్రి కేటీఆర్ చేసిన వాఖ్యలపై మంత్రి



పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పందించారు. హిల్ట్ పాలసీపై కేటీఆర్ అడ్డగోలుగా మాట్లాడుతున్నారని ధ్వజమెత్తారు. కేసీఆర్ అధికారంలోకి వస్తే హిల్ట్ పాలసీ రద్దు చేస్తామని అంటున్నారని... నోటికొచ్చినట్లుగా కేటీఆర్ మాట్లాడటం సరికాదని హితవు పలికారు. బీఆర్ఎస్ ప్రాంతీయ పార్టీ అని.. వారి హయాంలో ఇష్టం వచ్చినట్లుగా చేశారని ఫైర్ అయ్యారు. తమ ప్రభుత్వం చాలా వినూత్న నిర్ణయాలు తీసుకుంటుందని.. కేసీఆర్ హయాంలో లాగా తాము చేయమని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు.

# సీఎం నిర్ణయంపైనే రాజీనామా ఆధారం

### ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం వ్యాఖ్యలు

**హైదరాబాద్, డిసెంబర్ 5:** రాజీనామాపై ఎమ్మెల్యే దానం నాగేందర్ సంచలన వ్యాఖ్యలు చేశారు. తన రాజీనామా అంశాన్ని సీఎం నిర్ణయంతో ముడిపెట్టాడు. సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశిస్తే రాజీనామా చేయమని వెనకాడనన్నారు. తాజాగా మీడియాతో మాట్లాడుతూ.. ఎన్నికల్లో ఫైట్ చేయడం, గెలవడం తన రక్తంలోనే ఉందని ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ అన్నారు. నియోజకవర్గ పరిధిలోని హిమాయత్‌నగర్, నారాయణగూడలో రూ.1.40కోట్లతో చేపట్టనున్న డ్రైనేజీ, రోడ్ల పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. అనంతరం అనర్హత వేటు అంశంపై దానం స్పందించారు. రాజీనామా ప్రస్తావన ఇంకా రాలేదు. సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశిస్తే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసేందుకు సిద్ధంగా ఉన్నాను. నాకు ఎన్నికలు కొత్త కాదు.. ఇప్పటికి 11 సార్లు కొట్లాడిన చరిత్ర ఉంది. అనర్హత అంశంపై సుప్రీంకోర్టులో విచారణ జరుగుతోంది. నా వాదనలు వినిపిస్తానని అన్నారు. రేవంత్‌రెడ్డి మరో పదేళ్లు సీఎంగా కొనసాగితేనే రాష్ట్రం అభివృద్ధి పథంలో దూసుకెళ్తుంది. రైజింగ్ తెలంగాణ కోసం తలపెట్టిన గ్లోబల్ సమ్మిట్‌ను రాష్ట్ర ప్రభుత్వం విజయవంతంగా నిర్వహిస్తుందని దానం నాగేందర్ అన్నారు.అనర్హత అంశంపై సుప్రీంకోర్టులో విచారణ జరుతుందని గుర్తు చేశారు. 'సుప్రీంకోర్టులో అప్పీల్ చేశా.. కేసు కోర్టులో పెండింగ్ ఉంది.. స్పీకర్ దగ్గర కూడా అనర్హత పిటిషన్ పెండింగ్‌లో ఉంది.. సుప్రీంకోర్టులో నా వైపు నుంచి వాదనలు వినిపిస్తా.. సందర్భాన్ని బట్టి రాజీనామాపై నిర్ణయం తీసుకుంటా.. సీఎం ఎలాంటి నిర్ణయం తీసుకుంటే దానికి కట్టుబడి ఉంటా.. ఎన్నికలు ఎదుర్కోవడం నాకు కొత్తేం కాదు.. ఎన్నో ఎన్నికలు చూశా.. 11 సార్లు కొట్లాడిన చరిత్ర నాది. రేవంత్ రెడ్డి మరో పదేళ్ల పాటు సీఎంగా కొనసాగితేనే రాష్ట్రం అభివృద్ధి పథంలో దూసుకెళ్తుందని వ్యాఖ్యానించారు.

# ఐ యామ్ సారీ!

**హైదరాబాద్, డిసెంబర్ 5: హైడ్రా** కమిషనర్ రంగనాథ్ తెలంగాణ హైకోర్టుకు హాజరై క్షమాపణ చెప్పారు. బతుకమ్మకుంట కేసు విచారణలో భాగంగా ఆయన హాజరయ్యారు. ఈ కేసులో హైడ్రాపై సుధాకర్‌రెడ్డి అనే వ్యక్తి కోర్టు ధిక్కరణ పిటిషన్ వేశారు. ఈక్రమంలో న్యాయస్థానం ఆదేశాలతో రంగనాథ్ శుక్రవారం కోర్టుకు వచ్చారు. గతంలోనే హాజరు కావాల్సి ఉండగా హాజరు కాలేదు. దీంతో హైకోర్టు తీవ్రంగా పరిగణించి ఆదేశాలు జారీచేసింది. దీంతో ఆయన హాజరయ్యారు. హైదరాబాద్ బతుకమ్మకుంట పరిధిలోని ప్రైవేటు స్థలానికి సంబంధించి యథాతథస్థితిని కొనసాగించాలని జూన్ 12న ఇచ్చిన ఉత్తర్వులను ఉల్లంఘించిన హైడ్రా కమిషనర్ రంగనాథ్‌పై కోర్టు ధిక్కరణ కింద చర్యలు తీసుకోవాలంటూ సుధాకర్‌రెడ్డి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై అక్టోబరు 31న విచారించిన హైకోర్టు.. కోర్టు ధిక్కరణ చర్యలు ఎందుకు తీసుకోరాదో నవంబరు 27న వ్యక్తిగతంగా హాజరై వివరణ ఇవ్వాలంటూ కమిషనర్‌కు ఆదేశాలు జారీ చేసింది. అయితే బాచుపల్లిలో అత్యవసర పనులు ఉన్నందున హాజరుకాలేకపోతున్నానని.. మినహాయింపు కోరుతూ రంగనాథ్ మధ్యంతర పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై జస్టిస్ మౌసమి భట్టాచార్య, జస్టిస్ మధుసూదన్‌రావు ధర్మాసనం నవంబర్ 27న విచారణ చేపట్టింది. ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది స్వరూప్ ఊరిళ్ల వాదనలు వినిపిస్తూ తప్పనిసరి అధికారిక విధులతోపాటు, తన హాజరుతో కోర్టును ఇబ్బంది పెట్టరాదన్న కారణంగా మినహాయింపు కోరుతున్నారనగా ధర్మాసనం తీవ్రంగా స్పందిస్తూ ఆయన కోర్టు పట్ల చూపిన దయకు అభినందనలు తెలియజేస్తున్నామని వ్యాఖ్యానించింది. కోర్టు తలచుకుంటే ధిక్కరణను ఎదుర్కొంటున్న కమిషనర్‌ను ఉదయం నుంచి సాయంత్రం వరకు కోర్టులో నిలబెట్టగలదన్న విషయాన్ని గుర్తుంచుకోవాలని హెచ్చరించింది. హాజరు మినహాయింపునకు నిరాకరిస్తూ కమిషనర్ దాఖలు చేసిన మధ్యంతర పిటిషన్‌ను కొట్టివేసింది. ఈక్రమంలో శుక్రవారం హైడ్రా కమిషనర్ రంగనాథ్ తాజాగా హైకోర్టు ఎదుట హాజరై క్షమాపణలు చెప్పారు.

# పదేండ్లు దోచుకున్న వాళ్ల పవర్ కట్ అయ్యింది

మొదటి పేజీ తరువాయి

ఇస్తోందని సీఎం రేవంత్ రెడ్డి వెల్లడించారు. వరంగల్ విమానాశ్రయం కోసం గత సీఎం కేసీఆర్ ఏనాడూ ప్రయత్నించలేదు. పదేళ్ల రాష్ట్రాన్ని పాలించి కొత్తగా ఒక్క ఎయిర్‌పోర్టు ను కూడా సాధించలేదని సీఎం రేవంత్‌రెడ్డి విమర్శించారు. ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శుక్రవారం వరంగల్ జిల్లా నర్సంపేటలో పర్యటించారు. రూ.532 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన అనంతరం నర్సంపేటలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ప్రసంగించారు. వరంగల్ గడ్డకు చెందిన ఎందరో వీరులు తమ పరాక్రమాన్ని ప్రపంచానికి చూపారు. కాకతీయ యూనివర్సిటీ పోరాటాలు ఎప్పుడూ స్ఫూర్తినిస్తాయి. తెలంగాణ వస్తే.. సమస్యలు పరిష్కారం అవుతాయని ఈ జిల్లా ప్రజలు ఆశించారు. కుర్చీలో కూర్చున్న వారి ఆస్తులు పెరిగాయి కానీ, ప్రజల జీవితాలు మారలేదు. మీ ఓటునే ఆయుధంగా మార్చి.. గడీల పాలనను కూల్చారు. ప్రజాపాలనకు రెండేళ్లు పూర్తవుతోంది. వరి వేస్తే.. ఉరి వేసుకున్నట్టే అని ఆనాటి సీఎం కేసీఆర్ అన్నారు. ఈ ప్రభుత్వం మాత్రం.. రైతు పండించిన చివరి గింజ వరకు కొంటోంది. కాంగ్రెస్ వస్తే.. కరెంట్ ఉండదని ఆనాటి సీఎం దుష్ప్రచారం చేశారు. రైతు బంధు బంద్ అవుతుందని ప్రజలను బెదిరించారు. కాంగ్రెస్ పవర్‌లోకి వచ్చాక.. రాష్ట్రాన్ని దోచుకున్న వారి పవర్ మాత్రమ్ కట్ అయ్యింది. వ్యవసాయానికి ఉచిత విద్యుత్‌పై పేటెంట్ హక్కు ఉన్నది కాంగ్రెస్‌కు మాత్రమే. గత సీజన్‌లో 9 రోజుల్లోనే రూ.9వేల కోట్లను రైతు భరోసా కింద ఇచ్చాం. ఈ దేశంలో వరి అత్యధికంగా పండిస్తున్న రాష్ట్రం తెలంగాణ మాత్రమే. సన్న వడ్లకు క్వింటాకు రూ.500 బోనస్ ఇస్తున్నాం. గత ప్రభుత్వం



పదేళ్లపాటు పేదలకు కొత్తగా ఒక్క రేషన్ కార్డు కూడా ఇవ్వలేదు. రాష్ట్రంలో 1.10 కోట్ల రేషన్ కార్డుల ద్వారా.. 3.10 కోట్ల మంది లబ్దిదారులకు సన్నబియ్యం ఇస్తున్నాం. రేషన్ కార్డుల్లో కొత్తవారికి చేర్పులు, మార్పులకు అవకాశం కల్పించాం. సన్నబియ్యం ద్వారా పేదల ఆకలి తీరుస్తున్నాం అని సీఎం అన్నారు. రేవంత్ తో సహా వచ్చిన మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి. వరంగల్ ఎమ్మెల్యేలు, నాయకులు, అధికారులు సీఎం రేవంత్ కు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా నర్సంపేటపై వరాల జల్లు కురిపించారు సీఎం రేవంత్. రూ.532.24 కోట్లతో నర్సంపేటలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు సీఎం. రూ.200 కోట్లతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ ఏర్పాటుకు శంకుస్థాపన చేశారు. 130 కోట్లతో ప్రభుత్వ వైద్య కళాశాల, వసతి గృహాల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. 82.56 కోట్లతో హన్మకొండ-నర్సంపేట- మహబూబాబాద్ రోడ్డు విస్తరణ, మరమ్మతు పనులకు శంకుస్థాపన చేశారు. ÷ఔ.17.28 కోట్లతో నర్సంపేట- పాఖాల రోడ్డు విస్తరణ పనులకు శంకుస్థాపన చేశారు. రూ. 56.40 కోట్లతో నర్సంపేట నుంచి నెక్కొండ రోడ్డు విస్తరణ పనులకు శంకుస్థాపన చేశారు. రూ.26 కోట్లతో ప్రభుత్వ నర్సింగ్ కాలేజీ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. రూ. 20 కోట్లతో నర్సంపేట పట్టణంలో వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. వైఎస్ హయాంలో 25 లక్షల ఇందిరమ్మ ఇళ్లు కట్టించి పేదవాళ్లకు ఇచ్చారు.. పదేళ్లు సీఎంగా ఉన్న కేసీఆర్.. డబుల్ బెడ్ రూం ఇళ్లు ఇస్తానని హామీ ఇచ్చి పేదల్ని మోసం చేశారు.. పేదల ఆత్మ గౌరవం పెంచేందుకు ఇందిరమ్మ ఇళ్లు ఇస్తున్నాం.. 4 లక్షల 50 వేల ఇందిరమ్మ ఇళ్లను కాంగ్రెస్ ప్రభుత్వం పేదలకు అందిస్తోందని సీఎం రేవంత్ రెడ్డి వెల్లడించారు. హైదరాబాద్ కు ఏమేమి ఉన్నాయో వరంగల్ కు కూడా అవే తీసుకు వచ్చే ప్రయత్నం చేస్తున్నామని తెలిపారు. మార్చి 31 లోపల వరంగల్ లో ఎయిర్ పోర్టును ప్రారంభించుకుంటామన్నారు. వరంగల్ లో అండర్ డ్రైనేజ్, ఔటర్ రింగ్ రోడ్డును నిర్మించుకుంటాం.. సౌర విద్యుత్ ని ఉత్పత్తి చేసే బాధ్యతను మహిళలకు అప్పగించామని సీఎం రేవంత్ రెడ్డి వెల్లడించారు.

# పోటీపరీక్షలకు సిద్ధం కండి

**త్వరలోనే ఉద్యోగ నోటిఫికేషన్ ఇస్తాం**

**రాజకీయాలతో జీవితాలు నాశనం చేసుకోవద్దు**

**నిరుద్యోగులకు సిఎం రేవంత్ కీలక సూచన**

**వరంగల్, డిసెంబర్ 5:** నిరుద్యోగులకు సీఎం రేవంత్ రెడ్డి కీలక సూచన చేశారు. నిరుద్యోగులు పోటీ పరీక్షలకు సిద్ధం కావాలని.. త్వరలోనే నోటిఫికేషన్ ఇవ్వబోతున్నామని చెప్పారు. పంచాయితీ ఎన్నికల కోసం చదువుకున్న యువత సమయం వృధా చేసుకోవద్దని సూచించారు. రాజకీయాలు ఎప్పుడైనా చేయొచ్చని.. వయోపరిమితి దాటితే ప్రభుత్వ ఉద్యోగాలకు అనర్హులు అవుతారని హెచ్చరించారు. తల్లిదండ్రులు పిల్లలను బాగా చదివించుకోవాలని.. చదువుకుంటేనే మీ పిల్లలు.. కుటుంబాలు బాగుపడతాయని అన్నారు. ప్రజా పాలన విజయోత్సవాలలో భాగంగా శుక్రవారం నర్సంపేటలో సీఎం రేవంత్ రెడ్డి పర్యటించారు. ఈ సందర్భంగా రూ.508 కోట్లతో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం బహిరంగ సభలో పాల్గొని ఆయన మాట్లాడారు. వరంగల్ పర్యటనకు వస్తే స్ఫూర్తి కలుగుతుందన్నారు. పోరాట యోధుల స్ఫూర్తితో పాలన కొనసాగిస్తున్నామని.. కానీ గత పాలకులు ఫామ్ హౌస్‌లు నిర్మించుకున్నరు.. కార్లు కొన్నారు.. పదేండ్లు పాలించిన వాళ్లే ఆస్తులు పెంచుకున్నారని ఆరోపించారు. ఈ ప్రాంత ప్రజలకు పదేండ్లలో ఏమీ రాలేదన్నారు. వరి వేస్తే ఉరి అని ఆనాడు కేసీఆర్ అన్నారు.. కానీ మేం సన్న వడ్లకు బోనస్ ఇస్తున్నామని తెలిపారు. దుక్కిదున్నే ప్రతి రైతుకు 24 గంటల కరెంటు ఇస్తున్నామని.. ఉచిత కరెంట్ పేటెంట్ హక్కు కాంగ్రెస్‌దేనని స్పష్టం చేశారు. రెండేండ్ల క్రితం గడీలను కూల్చి ప్రజాప్రభుత్వాన్ని ఏర్పాటు చేశామని.. పదేండ్లు దోచుకున్న వారి గడీలకు కరెంటు పీకేశామన్నారు. మార్చి 31లోపు వరంగల్ ఎయిర్ పోర్టు పనులు స్టార్ట్ చేస్తామని తెలిపారు. ఈ నెలాఖరులోపు మమునూరు ఎయిర్ పోర్టు భూసేకరణ పూర్తి అవుతుందని



చెప్పారు. పదేళ్లలో కేసీఆర్ ఒక్కరోజైనా వరంగల్ ఎయిర్ పోర్టు గురించి ఆలోచించాడా అని ప్రశ్నించారు. విదేశాలలో చదువుకున్నామని పొడుగుపోడుగు మాటలు చెప్పే వాళ్లకు తెలంగాణలో రెండవ ఎయిర్ పోర్టు తేవాలనే సోయి ఎందుకు లేదని నిలదీశారు.

# సాయి ఈశ్వర్ మరణానికి ప్రభుత్వానిదే బాధ్యత

- బీసీ రిజర్వేషన్లతో మోసం వల్లే అతను ఆత్మహత్య
- అతని కుటుంబానికి 50 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలి
- బీఆర్ఎస్ నేతలు కేటీఆర్, హరీష్‌రావు డిమాండ్



**హైదరాబాద్, డిసెంబర్ 5:** సాయిఈశ్వర్ మరణానికి ప్రభుత్వానిదే బాధ్యతని బీఆర్ఎస్ ఆరోపించింది. బీసీ రిజర్వేషన్ల పేరుతో మోసం చేయడం వల్లనే అతను ఆత్మహత్యకు పాల్పడ్డాడని విమర్శించింది. బీసీ రిజర్వేషన్ల పేరిట సీఎం రేవంత్ రెడ్డి చేసిన దారుణమైన మోసానికి సాయి ఈశ్వర్ అనే యువకుడి నిండు ప్రాణం బలైందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామన్న హామీకి కాంగ్రెస్ సర్కారు తూట్లు పొడవడాన్ని తట్టుకోలేకే ఈశ్వర్ ఆత్మాహుతి చేసుకున్నాడని తెలిపారు. పంచాయతీ ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లు కేవలం 17 శాతానికే కుదించిన ముఖ్యమంత్రి రాష్ట్రంలోని వెనుకబడిన వర్గాలకు వెన్నుపోటు పొడిచారని కేటీఆర్ మండిపడ్డారు. ఇది ముమ్మాటికి కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన హత్యేనని ఆరోపించారు. సీఎం రేవంత్ రెడ్డితో పాటు కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ కూడా సాయి ఈశ్వర్ మరణానికి బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. కులగణనను మొదలుకుని న్యాయస్థానాల్లో నిలబడని జీవోల దాకా కాంగ్రెస్ ఏమాత్రం చిత్తశుద్ధి లేకుండా కామారెడ్డి డిక్లరేషన్‌కు సమాధి కట్టిందని కేటీఆర్ అన్నారు. బాధితుడి కుటుంబానికి ప్రభుత్వం 50 లక్షల ఎక్స్ గ్రేషియా ప్రకటించి ఆ కుటుంబాన్ని ఆదుకోవాలని డిమాండ్ చేశారు. బీసీ రిజర్వేషన్ల పేరిట సీఎం రేవంత్ రెడ్డి ఆడిన రాక్షస రాజకీయ క్రీడలో తమ్ముడు సాయి ఈశ్వర్ బలైపోవడం తనను తీవ్రంగా కలిచివేసిందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీశ్‌రావు అన్నారు. బీసీ బిడ్డ ఆత్మబలిదానానికి కారణమైన కాంగ్రెస్ ప్రభుత్వాన్ని బీసీ సమాజం ఎన్నటికీ క్షమించదని తెలిపారు. ఇది ముమ్మాటికి కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన హత్య అని స్పష్టం చేశారు. రేవంత్ రెడ్డి అధికార దాహానికి బలైన ప్రాణం ఇది అని పేర్కొన్నారు. సాయి ఈశ్వర్ ఆత్మకు శాంతి కూరాలని ఆ దేవుడిని హరీశ్‌రావు ప్రార్థించారు. బాధితుడి కుటుంబానికి ప్రభుత్వం అండగా నిలవాలని, రూ. 50 లక్షల ఎక్స్ గ్రేషియా ప్రకటించి ఆ కుటుంబాన్ని ఆదుకోవాలని బీఆర్ఎస్ పక్షాన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయకుండా కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేస్తుందని సాయి ఈశ్వర్ ఇటీవల ఆవేదన వ్యక్తం చేశారు. ఈ క్రమంలోనే తీన్మార్ మల్లన్నను కలవడానికి వెళ్లిన సాయిఈశ్వర్ గురువారం సాయంత్రం.. ఆయన ఆఫీసు ముందు పెట్రోల్ పోసుకుని నిప్పటించుకున్నాడు. ఇది గమనించిన స్థానికుల్గ ÷రిరజన్, పోలీసులకు సమాచారం అందించాడు. దీంతో హుటాహుటిన ఘటనాస్థలికి చేరుకున్న వారు మంటలను ఆర్పివేసి సాయిఈశ్వర్‌ను గాంధీ ఆస్పత్రికి తరలించారు. అక్కడే పరిస్థితి విషమించడంతో శుక్రవారం సాయిఈశ్వర్ ప్రాణాలు కోల్పోయాడు.

# పాన్ మసాలా తయారీ యూనిట్లపై సెస్సు

**బిల్లును ఆమోదించిన లోక్‌సభ**

**న్యూఢిల్లీ, డిసెంబర్ 5:** పాన్ మసాలా తయారీ యూనిట్లపై సెస్సు విధించేందుకు ఉద్దేశించిన బిల్లుకు లోక్‌సభ శుక్రవారం ఆమోదం తెలిపింది. గురువారం ఈ బిల్లును లోక్‌సభలో ఆర్థికమంత్రి నిర్మలాసీతారామన్ ప్రవేశ పెట్టారు. ఈ సెస్సు ద్వారా సమకూరిన నిధులను జాతీయ భద్రత, ప్రజారోగ్యానికి వినియోగించనున్నారు. 'హెల్త్ సెక్యూరిటీ సే నేషనల్ సెక్యూరిటీ సెస్సు బిల్లు, 2025'పై చర్చ సందర్భంగా ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ మాట్లాడారు. ఈ సెస్సు ద్వారా సమకూరిన నిధులను రాష్ట్రాలతో పంచుకుంటామని వెల్లడించారు. అనంతరం ఈ బిల్లు మజువాణి ఓటుతో లోక్‌సభలో ఆమోదం పొందింది. పాన్ మసాలా, ఈ తరహా ఉత్పత్తులను తయారు చేసే యూనిట్లకు ఈ సెస్సు విధిస్తారు. జాతీయ ఆరోగ్యం, జాతీయ భద్రత వంటి అంశాలకు ఈ నిధులను వినియోగిస్తామని నిర్మలా సీతారామన్ తెలిపారు. ప్రస్తుతం పాన్ మసాలాపై జీఎస్టీలో గరిష్ఠ శ్లాబు అయిన 40 శాతం విధిస్తున్నట్లు చెప్పారు. సెస్సు వల్ల జీఎస్టీ రెవెన్యూపై ఎలాంటి ప్రభవమూ పడబోదని వివరించారు. తయారీ సామర్థ్యం ఆధారంగా ఈ సెస్సును విధించనున్నట్లు తెలిపారు. 2010-2014 మధ్య సెస్సుల రూపంలో ప్రభుత్వానికి వచ్చే ఆదాయం 7 శాతంగా ఉండగా.. ప్రస్తుత ఆర్థికసంవత్సరంలో ఆ మొత్తం 6.1 శాతానికి తగ్గిందని పేర్కొన్నారు.



# ఎమిరేట్స్ విమానానికి బాంబు బెదిరింపులు

**శంషాబాద్‌లో సురక్షితంగా ల్యాండ్**

**హైదరాబాద్, డిసెంబర్ 5:** హైదరాబాద్‌కు వచ్చే విమానాలే లక్ష్యంగా వరుసగా బాంబు బెదిరింపులు రావడం తీవ్ర కలకలం సృష్టిస్తోంది. శుక్రవారం దుబాయ్ నుంచి హైదరాబాద్ వస్తోన్న ఎమిరేట్స్ విమానానికి బాంబు బెదిరింపులు వచ్చాయి. ఈ క్రమంలో విమానాన్ని సురక్షితంగా ల్యాండ్ చేశారు. ఈకే526 విమానం దుబాయ్ నుంచి హైదరాబాద్ కు వస్తోంది. ఈ క్రమంలో విమానాన్ని పేల్చేస్తామంటూ రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయానికి సంబంధించి ఎయిర్‌పోర్ట్ కస్టమర్ సపోర్ట్ కేంద్రానికి ఇ-మెయిల్ వచ్చింది. దీంతో అప్రమత్తమైన అధికారులు ఎయిర్‌పోర్టులో ఆ విమానాన్ని సురక్షితంగా ల్యాండ్ చేశారు. ప్రయాణికులందరినీ సురక్షితంగా కిందికి దింపారు. ఆ తర్వాత విమానాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ఇప్పటివరకు ఎలాంటి అనుమానాస్పద వస్తువులు లభించలేదు. కాగా.. గురువారం కూడా హైదరాబాద్‌కు వచ్చే విమానాలు లక్ష్యంగా బాంబు బెదిరింపులు వచ్చాయి. సౌదీ అరేబియాలోని మదీనా నుంచి హైదరాబాద్‌కు వస్తున్న విమానంలో బాంబు పెట్టినట్లు మెయిల్ రావడంతో అధికారులు అప్రమత్తమయ్యారు. విమానాన్ని అహ్మదాబాద్ విమానాశ్రయంలో అత్యవసరంగా ల్యాండ్ చేసి.. తనిఖీలు చేశారు. షార్జా నుంచి హైదరాబాద్ వస్తున్న మరో విమానానికి కూడా ఇలాంటి బెదిరింపులే వచ్చాయి. ఈ క్రమంలో దాన్ని శంషాబాద్ విమానాశ్రయంలో సురక్షితంగా ల్యాండ్ చేశారు.

# హిడ్మాను విజయవాడలో పట్టుకెళ్లి కాల్చారు

**కలప వ్యాపారులే సమాచారం ఇచ్చారు**

**దేవ్‌జీ, మల్లా రాజిరెడ్డి మాతోనే ఉన్నారు**

**వికల్ప్ పేరుతో మరో లేఖ విడుదల**



**విశాఖపట్టణం,డిసెంబర్ 5:** మావోయిస్టు పార్టీ దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ కార్యదర్శి వికల్ప్ పేరుతో మరో సంచలన లేఖ విడుదల చేసింది. ఇటీవల పోలీసులు హిడ్మాను ఎన్‌కౌంటర్ చేసిన విషయం తెలిసిందే. హిడ్మా ఆచూకీ గురించి దేవ్‌జీ పోలీసులకు చెప్పి ఉంటారనే వార్తలు పార్టీ ఖండించింది. 'దేవ్ జీతో పాటు మల్లా రాజిరెడ్డి మాతోనే ఉన్నారు.. లొంగిపోవటానికి వారు ఎలాంటి ఒప్పందము కుదుర్చుకోలేదు.. హిడ్మా సమాచారాన్ని దేవ్ జీ పోలీసులకు చెప్పాడు అనేది పూర్తిగా అవాస్తవం.. హిడ్మా హత్యకు నలుగురు వ్యక్తులే కారణం.. అడవి నుంచి బయటికి వచ్చిన కోసాల్ అనే వ్యక్తి హిడ్మా హత్యకు ప్రధాన కారణం.. విజయవాడకు చెందిన కలప వ్యాపారితోపాటు ఫర్నిచర్ వ్యాపారి, మరో కాంట్రాక్టర్ కారకులు.. అక్టోబర్ 27న చికిత్స కోసం కలప వ్యాపారి ద్వారా హిడ్మా విజయవాడకు వెళ్ళాడు.. ఆ సమాచారాన్ని పోలీసులకు చేరవేయడంతోనే 13 మందిని పట్టుకొని హత్య చేశారు.. హత్యను కప్పిపుచ్చేందుకు మారేడుమల్లి రంపచోడవరం ఎన్కౌంటర్లు కట్టు కథ అల్లారు.. హిడ్మా హత్య ఒక ఏపీ పోలీసులు చేసిన ఆపరేషన్ కాదు.. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి చేసిన జాయింట్ ఆపరేషన్ ఇది.. వారి ఆశయాలను ముందుకు తీసుకెళ్తామని శపథం చేస్తున్నాం..' అని లేఖలో పేర్కొన్నారు.

# అమెరికాలో అగ్నిప్రమాదం

**ఇద్దరు హైదరాబాద్ విద్యార్థుల మృతి**



**హైదరాబాద్, డిసెంబర్ 5:** అమెరికాలోని బర్మింగ్‌హామ్‌లో భారీ అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. అపార్ట్‌మెంట్ కంప్లెక్స్‌లో భారీ అగ్నిప్రమాదం సంభవించింది. ఈ ప్రమాదంలో ఇద్దరు తెలుగు విద్యార్థులు మృతిచెందారు. బర్మింగ్‌హామ్ లోని అపార్ట్‌మెంట్ కాంప్లెక్స్‌లో పదిమంది తెలుగు విద్యార్థులు నివసిస్తున్నట్లు సమాచారం. హఠాత్తుగా చెలరేగిన మంటలతో ఉక్కిరిబిక్కిరైనా విద్యార్థులు.. అపార్ట్‌మెంట్‌లో ఫైర్ ప్రారంభమైన కాసేపటిలోనే ఘాటైన పొగ వెలువడడంతో విద్యార్థులు శ్వాస తీసుకోలేక భయంతో కేకలు వేశారు. ప్రాణ భయంతో వణికిపోయారు. పోలీసులకు సమాచారం అందించడంతో పోలీసులు ఘటనా స్థలికి చేరుకున్నారు.లోపల చిక్కుకుపోయిన 13 మంది విద్యార్థులను అగ్నిమాపక సిబ్బంది బయటకు తీసుకొని వచ్చారు. ఇద్దరు విద్యార్థులకు తీవ్ర గాయాలు కావడంతో ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ హైదరాబాద్ చెందిన ఇద్దరు తెలుగు విద్యార్థులు మృతి చెందారు. మృతి చెందిన వారిలో ఉడుముల సహజ రెడ్డి, కూకట్ పల్లికి చెందిన మరొక విద్యార్థి ఉన్నట్లు సమాచారం. అలబామా యూనివర్సిటీలో ఉన్నత విద్య చదువుతున్న విద్యార్థులుగా గుర్తించారు. మృతుల కుటుంబాల్లో తీవ్ర విషాదఛాయలు అలుముకున్నాయి.

## సోమాజిగూడ రెస్టారెంట్‌లో స్వల్ప అగ్నిప్రమాదం

**హైదరాబాద్, డిసెంబర్ 5** :సోమాజిగూడ లోని శ్రీకన్య కంఫర్ట్ రెస్టారెంట్ లో అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. రెస్టారెంట్ కిచెన్ నుండి దట్టంగా పొగలు వెలువడ్డాయి. బిల్డింగ్ అయిదవ అంతస్తులో రెస్టారెంట్ ఉంది. భవనం నాలుగో అంతస్తులో ఉఖి జ్యూవెలర్స్ ఉంది. అయిదవ అంతస్తులో ఉన్న రెస్టారెంట్ నుండి పొగలు వెలువడ్డాయి. దీంతో అంతా భయాందోళనకు గురయ్యారు. ఉద్యోగులు, ఇతర పనులకు వెళ్లిన వారు ఇళ్లకు వెళ్లే సమయం కావడంతో అగ్నిప్రమాదం ఆందోళన కలిగించింది. స్థానికులు పోలీసులకు సమాచారం అందించడంతో ఘటన స్థలానిక్గ ÷ర్, డిజార్డర్ సిబ్బంది చేరుకున్నారు. వెంటనే సహాయక చర్యలు ప్రారంభించి భవనం లోపల ఉన్న వారిని బయటికి తరలించారు. అగ్ని ప్రమాదానికి గల కారణాలు తెలియాల్సి ఉంది.



**సంపాదకీయం**

# ఓట్ల రాజకీయంలో కుదేలవుతున్న ఆర్థిక వ్యవస్థ!

సమాజాం ఎదుర్కొంటున్న అనేకానేక సమస్యలను ప్రభుత్వాలు అస్సలు పట్టించుకోవడం లేదు. ఏదైనా ఘోరం జరినప్పుడు సంతాపం తెలియచేయడం..తరవాత మర్చిపోవడం షరమామూలుగా మారింది. ముఖ్యంగా తెలుగు రాష్ట్రాల్లో పాలనలో కొత్తదనం కనిపించడంలేదు. భవిష్యత్ నిర్మాణం దిశగా వారి ఆలోచనలు లేవు. అధికారం ఉందికదాని ప్రజాధానం వృధాగా ఖర్చు చేస్తున్నారు. లక్షల కోట్లు అప్పులు చేసి కుప్పలు పెడుతున్నారు. కెసిఆర్, జగన్ బాటలోనే రేవంత్, చంద్రబాబు నాయుడుల పాలన సాగుతోంది. ఉట్టి కెగరలేనమ్మ ఆకాశానికి ఎగిరిందన్న రీతిలో పాలకుల తీరు ఉంది. తెలంగాణలో స్థానిక ఎన్నికలు జరుగుతున్నాయి. ఇక్కడ గ్రామాల్లో ప్రధానంగా కోతల బెడద విపరీతంగా ఉంది. గత సిఎం కెసిఆర్ కోతులు వాపస్ పోవాలె అని నినాదం ఇచ్చారు. అది అక్కడికే ఆగిపోయింది. కోతులుకూడా కెసిఆర్‌వి కోతలే అనుకున్నాయేమో గ్రామాలు వదలడం లేదు. గ్రామాలు మొదలుకుని పట్టణాల వరకు వీధి కుక్కల బెడద తీవ్రంగా ఉంది. మొన్నటికి మొన్న వీధి కుక్కల బారిన పడి ఓ మూగబాలుడు ఆస్పత్రి పాలయ్యాడు. వీటిని నిరోధించే కార్యక్రమం చేపట్టడం లేదు. కోతుల కారణంగా తెలంగాణ పల్లెల్లో జనజీవనం తీవ్ర ప్రభావం చూపుతోంది. పంటలు నాశనం అవుతున్నాయి. ఇళ్లన్నీ ధ్వంసం అవుతున్నాయి. ప్రజలపై పడి రక్కుతున్నాయి. దీంతో ప్రతి ఇల్లూ ఓ జైలులాగా తయారయ్యింది. ఇంటికి గేట్లు పెట్టుకుని ప్రజలు తాళాలు వేసుకుంటున్నారు. తినడానికి గతిలేని వారు కూడా ఇంటికో గేటు పెట్టుకోవడం తప్పనిసరి అయ్యింది. తాజాగా ఈ విషయాన్ని చేవెళ్ల ఎంపి కొండా విశ్వేశ్వర్ రెడ్డి లోక్‌సభలో ప్రస్తావించారు. తెలంగాణతో పాటు దేశం యావత్తూ సమస్య ఉందన్నారు. దీనిపై జాతీయ విధానం తీసుకోవాలని, కోతుల నిర్మూలన చర్యలు తీసుకోవాలని కోరారు. కానీ ఆయన అధికారపార్టీ ఎంపి అయినా చెవిటివాడి ముందు శంఖం పూరించినట్లే. దీనిపై స్పందిస్తారని అనుకోవడానికి లేదు. ఎందుకంటే పార్లమెంట్ ఆవరణలోకి కుక్కతో వచ్చారని కాంగ్రెస్ ఎంపి రేణుకా చౌదరిపై అధికార పార్టీ ఎంపి జగదాంబికాపాల్ రచ్చ చేశారు. ఇలాంటివి చేయడం సులభమే కానీ..వీధి కుక్కల బెడదను తప్పించే ప్రయత్నం మాత్రం చేయరు. ఇక ఉభయ తెలుగు రాష్ట్రాల్లో ఉచిత బస్సు పేరుతో వందలకోట్లు తగలేస్తున్నారు. ఉచిత బస్సు బదులు టిక్కెట్ల రేట్లు తగ్గించి, రోడ్లు వేసి, బస్ సర్వీసులను పెంచితే ప్రజలందరికీ ఉపయోగం. ఇవన్నీ ఎందుకు చర్చించాల్సి వస్తోందంటే సామాజిక సమస్యలపై ప్రభుత్వాలు పూర్తిగా నిర్లక్ష్యంగా ఉంటున్నాయి. గ్రామాల్లో కోతులు నిర్మూలించే వారికే ఓటు వేస్తామని పలు గ్రామాల్లో ప్రకటనలు చేస్తున్నారు. పోస్టర్లు అంటిస్తున్నారు. ఇది ప్రభుత్వానికి సిగ్గుచేటు. దీనిగురించి ఆలోచించాలి. ఇదొక్కటే కాదు..ఉచితాలపై ఆలోచించాలి. సమాజాన్ని నిర్వీర్యం చేస్తున్న ఉచిత పథకాలపై ఆలోచన చేయాలి. లేకుంటే దేశం అధోగతి పాలు కాగలదు. ఉభయ తెలుగు రాష్ట్రాలలో పోటీపడి అమలు చేసే ఉచిత పథకాల వల్ల అభివృద్ధి కుంటు పడుతుందని గుర్తించాలి. అప్పులు చేసి ఉచిత పథకాలను అమలు చేయడం మంచిది కాదని వీరు గుర్తించడం లేదు. ఉచిత బియ్యం, ఉచిత విద్యుత్, ఉచిత బస్సు ఇలా చెప్పుకుంటూ పోతే అనేకం ఉన్నాయి. ఇవే కాకుండా దండగమారి ఖర్చు లు కూడా తగ్గించాలి. హెలికాప్టర్లు, ప్రత్యేక విమానాల ఖర్చులు కూడా వేలకోట్లల్లో ఉంటున్నాయి. రాజకీయ నాయకులు తమ పర్యటనలు, వ్యక్తిగత ఖర్చులు చూస్తే గుండె గుభేల్ మంటోంది. మాజీ సిఎం కెసిఆర్ ఐటి రిటర్న్ కూడా ప్రభుత్వ డబ్బులతోనే వెళ్లదీసారు. అసెంబ్లీకి రాకున్నా జగన్, కెసిఆర్ లక్షల్లో జీతాలు పొందుతున్నారు. నిజానికి ఇవన్నీ తగ్గించుకోవాల్సిందే. ప్రజలనుకూడా ఉచిత పథకాలతో సోమరిపోతులను తయారు చేయడం తప్ప మరోటి కాదు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం అభివృద్ధికి సూచిక కానేకాదు. ఈ పథకాన్ని అమలుచేయాలని మహిళలెవరూ కోరలేదు. దీనిని గొప్పగా ప్రకటించుకుని ఇన్ని వందల కోట్లు ఆర్టీసికి కట్టామని చెప్పు కోవడం సిగ్గుచేటు. అర్హులైన పేదవారి అభివృద్ధికి ప్రభుత్వాలు నిర్మాణాత్మకమైన సహాయ సహకారాలు అందించడంలో తప్పులేదు. అయితే ప్రజలను సోమరిపోతులుగా మార్చే ఉచిత పథకాలు ప్రగతిని దెబ్బతీస్తాయి. ఉచిత పథకాల వల్ల అనర్హులు సైతం వాటిని పొందడం ఎలా అని చూస్తున్నారు. తప్పుడు మార్గాలు అవలంబించి తమ పేర్లు పథ కాల్లో ఉండేలా పైరవీలు చేస్తున్నారు. మహిళలందరికీ ఉచిత బస్సు ప్రయాణం పథకం వల్ల ఒరింగేదమి లేదు. ఆ డబ్బులను రోడ్లు బాగు చేయడానికి, బస్ టిక్కెట్ రేట్లను తగ్గించి, సర్వీసులను పెంచడానికి ఉపయోగిస్తే బాగుండేది. చార్జీ చెల్లించి ప్రయాణం చేయలేని వృద్ధులు, వికలాంగులు, విద్యార్థులు, మహిళలకు ఈ సౌకర్యం కల్పిస్తే అభ్యంతరం ఉండదు. కానీ అందరినీ ఒకే గాటన కట్టి అమలు చేయడం సరికాదు. ప్రభుత్వ ఉద్యోగులైన స్త్రీలు, ఆర్థికంగా ఉన్న స్త్రీలు ఈ పథకాన్ని దుర్వినియోగం చేస్తున్నారు. ఒక రకంగా చెప్పాలంటే ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించిన ఉభయ తెలుగు రాష్ట్రాల్లో అనవసర ప్రయాణాలు పెరిగాయి. దేశ ఆర్థిక వ్యవస్థకు ఎంత నష్టం కలిగినా ఫరవాలేదు, మా పార్టీ ఎన్నికల్లో గెలవాలనే దుర్నీతిని రాజకీయ పార్టీలు అనుసరించి, ఉచిత పథకాలను అమలు చేస్తున్నాయి. వృద్ధాప్య పింఛన్లు, వికలాంగుల పింఛన్ల విషయంలో అనేక అవకతవకలు బయటపడు తున్నాయి. వాస్తవిక వయసును తగ్గించి, బోగస్ ఆధార కార్డులు పొంది, వృద్ధాప్య పింఛన్లు పొందుతున్న కేసులు ఎన్నో ఉన్నాయి. అంగవైకల్యం లేకపోయినా, డాక్టర్లను మేనేజ్ చేసి అనేకమంది వికలాంగుల పింఛన్లు పొందుతున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. ఇక రేషన్ కార్డులు, బియ్యం జనాభాను మించి అమలు అవుతున్నాయి. రేషన్ కార్డుల ద్వారా పంపిణీ చేసే బియ్యం మాఫీ యాలకు ఆదాయ వనరుగా మారింది. ఎపిలో పోర్టు నుంచి టన్నులకొద్దీ బియ్యం తరలి నట్లు ప్రభుత్వమే గుర్తించింది. ప్రభుత్వం కిలో బియ్యానికి 42రూపాయలు ఖర్చు చేస్తోంది. రేషన్ బియ్యం తినడానికి ఇష్టపడని ప్రజలు కేజీ 12 రూపాయల వంతున బయట అమ్ముకుంటున్నారు. వేల కోట్ల రూపాయలు ప్రజాధనం ఇలా వృథా అయిపోతోంది. ఈ విషయంలో పత్రికలు గానీ, రాజకీయ నాయకులు గానీ, ప్రభుత్వ అధికారులు గానీ, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు గానీ, జాతీయవాద సంస్థల నాయకులుగానీ చర్చించడం లేదు. ఎక్కడ తమ ఓట్లు పోతాయో అన్న భయం వారిని వెన్నాడుతోంది. అందుకే విపక్షంలో ఉన్నవారు సైతం ఉచిత పథకాలు మరిన్ని అమలుకు పట్టుబడుతున్నారు. ఉచిత పథకాలకు ఖర్చు చేసే ధనాన్ని మౌలిక సదుపాయాల కల్పనకు ఖర్చు చేస్తే రాష్ట్రాలు బాగుపడతాయి. విద్య,వైద్యరంగాలకు ఖర్చు చేయాలి. రోడ్లు అభివృద్ధి చేయాలి. కొతులు, కుక్కులను తరిమేందుకు ఉపయోగించాలి. దోమల నివారణకు ఉపయోగించాలి. చెత్త వేయకుండా నిరోధించాలి. ఇలా దీర్ఘకాలిక ప్రయోజనాలు నెరవేరుతాయి. అప్పుడే రాష్ట్రలు స్వయంశక్తితో ముందుకు సాగుతాయి. ఇందుకోసం ప్రజలే నడుం బిగించాలి.

# ఆర్బీఐ మరోమారు కీలక నిర్ణయం

- రెపోరేటును మరో 25 బేసిస్ పాట్లు తగ్గింపు
- తాజా నిర్ణయంతో తగ్గనున్న రుణాల వడ్డీలు



**ముంబై, డిసెంబర్ 5:** రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మరోసారి శుభవార్త ప్రకటించింది. కీలక వడ్డీ రేట్లను మరో 25 బేసిస్ పాయింట్ల మేర తగ్గిస్తున్నట్టు పేర్కొంది. దీంతో రెపో రేటు 5.25 శాతానికి దిగొచ్చింది. ఈ మేరకు ద్రవ్య పరపతి విధాన సమీక్ష నిర్ణయాలను ఆర్బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా శుక్రవారం వెల్లడించారు. అయితే.. ఈ ఏడాదిలో ఇప్పటికే వడ్డీ రేట్లపై ఆర్బీఐ ట్రిపుల్ బొనాంజా ప్రకటించింది. ఫిబ్రవరి, ఏప్రిల్ నెలల్లో కీలక వడ్డీరేట్లపై 25 బేసిస్ పాయింట్ల మేర తగ్గించింది. ఆ తర్వాత జూన్ నెలలో మరోసారి ఏకంగా 50 పాయింట్ల మేర కోత విధించింది. దీంతో 2025 ఏడాదిలోనే మొత్తం రెపో రేటు 1.25 మేర తగ్గింది. మొత్తంగా ఏడాది ముగింపు దశలో ఈ ఏడాది ఇప్పటికే వడ్డీ రేట్లపై ట్రిపుల్ బొనాంజా ప్రకటించిన ఆర్‌బీఐ.. మరోసారి గుడ్‌న్యూస్ చెప్పింది. దీంతో రెపో రేటు 5.25 శాతానికి దిగొచ్చింది. రూపాయి పతనం కొనసాగుతున్నప్పటికీ ద్రవ్యోల్బణం కనిష్ఠ స్థాయికి పడిపోవడం, వృద్ధిరేటు పెరగడంతో రేట్ల కోత చేపట్టినట్లు మల్హోత్రా వెల్లడించారు. వడ్డీ రేట్లను తగ్గించడంతో గృహ, వాహన రుణ గ్రహీతలకు మరికొంత ఉపశమనం లభించినట్లయ్యింది. జీఎస్‌టీ హేతుబద్ధీకరణతో కొనుగోళ్లు పెరగడంతో ప్రస్తుత ఆర్థిక సంవత్సరం రెండో త్రైమాసికంలో 8.2శాతం వృద్ధి నమోదైంది. దీంతో 2025-26 ఆర్థిక సంవత్సరానికి గానూ వృద్ధి రేటు అంచనాలను 6.8 శాతం నుంచి 7.3 శాతానికి పెంచుతున్నాం. ద్రవ్యోల్బణం కూడా తగ్గుముఖం పట్టింది. అందువల్ల ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి ద్రవ్యోల్బణం అంచనాలను 2.6శాతం నుంచి 2 శాతానికి తగ్గిస్తున్నాం అని ఆర్‌బిఐ గవర్నర్ వివరించారు. రూ.1 లక్ష కోట్ల విలువైన ప్రభుత్వ సెక్యూరిటీస్‌ల విక్రయాల కోసం ఓపెన్ మార్కెట్ ఆపరేషన్స్‌ను నిర్వహించాలని నిర్ణయించాం. విదేశీ మారక నిల్వలు 686 బిలియన్ డాలర్లుగా ఉన్నాయి. రాబోయే 11 నెలల వరకు దిగుమతులకు ఇవి ఉపయోగపడతాయి. తాజాగా రెపో రేటును 25 బేసిస్ పాయింట్ల మేర తగ్గడంతో 5.50 శాతంగా ఉన్న రెపో రేటు 5.25 శాతానికి దిగొచ్చింది. దీంతో వడ్డీ రేట్ల తగ్గింపుతో దేశ వ్యాప్తంగా బ్యాంకులు తమ లోన్ వడ్డీ రేట్లను త్వరలోనే సవరించనున్నాయి. ఫలితంగా.. హోమ్ లోన్, కారు లోన్, పర్సనల్ లోన్‌లపై వడ్డీ రేట్లు తగ్గే అవకాశముంది. ఇది సామాన్యుడికి గొప్ప ఊరట కలిగించే నిర్ణయమని ఆర్థిక నిపుణులు పేర్కొంటున్నారు. ఆర్బీఐ తాజా నిర్ణయంతో హోమ్ లోన్ ఖాతాదారుల చెల్లింపు విధానం ఎలా ఉంటుందో ఓసారి పరిశీలిస్తే.. 8.5 శాతం వడ్డీ రేటుతో 15 ఏళ్లు, 20 ఏళ్లు, 25 ఏళ్ల చొప్పున కట్టేందుకు తీసుకున్న లోన్.. 25 బేసిస్ పాయింట్ల రెపో రేటు తగ్గింపుతో 8.25 శాతం వడ్డీతో కట్టాల్సి ఉంటుంది. రెపో రేటు తగ్గింపుతో ఫ్లోటింగ్ రేట్ లోన్ రుణాలు తీసుకున్న వారు వెంటనే ఈ ప్రయోజనాన్ని పొందుతారు. అనగా 2019 అక్టోబర్ 01 తర్వాత బ్యాంకు నుంచి లోన్ పొందిన కస్టమర్లు. ఈ గృహ రుణాల్లో చాలా వరకూ రెపో రేటుకు అనుసంధానమై ఉంటాయి. కాబట్టి ఆర్బీఐ రెపో రేటును తగ్గించినప్పుడు.. ఆయా బ్యాంకులు వెంటనే వడ్డీ రేట్లను సవరిస్తాయి. దీంతో హోమ్ లోన్ల తగ్గింపులు వెంటనే అమల్లోకి వస్తాయి.

# రంగంలోకి దిగిన కేంద్రం

**ఇండిగో సంక్షోభంపై దర్యాప్తునకు ఆదేశం • సర్వీసుల పునరుద్ధరణకు తక్షణ చర్యలు**



**న్యూఢిల్లీ, డిసెంబర్ 5:** ఇండిగో సంక్షోభంపై విచారణకు కేంద్రం ఆదేశించింది. సంక్షోభం నేపథ్యంలో సమస్యను పరిష్కరించేందుకు వెంటనే కేంద్రం రంగంలోకి దిగింది. నిర్వహణాపరమైన లోపాల కారణంగా దేశీయ విమానయాన సంస్థ ఇండిగో విమాన సర్వీసులకు తీవ్ర ఆటంకం కలుగుతోంది. దాంతో వేలాది మంది ప్రయాణికులు అవస్థలు పడుతుండగా.. ఈ గందరగోళం ఇప్పుడప్పుడే కొలిక్కి వచ్చేలా కనిపించడం లేదు. ఈ నేపథ్యంలో కేంద్రం రంగంలోకి దిగింది. శుక్రవారం ఉన్నతస్థాయి విచారణకు ఆదేశించింది. సేవల్లో అంతరాయానికి గల కారణాలను విచారించనుంది. బాధ్యులను గుర్తించి తగిన చర్యలు తీసుకుంటామని వెల్లడించింది. భవిష్యత్తులో ఇలాంటి అంతరాయాలు చోటుచేసుకోకుండా ఈ విచారణలో భాగంగా అధికారులు సిఫార్సులు చేయనున్నారు. ఇక ప్రస్తుత పరిస్థితులపై పౌరవిమానయాన శాఖ నిరంతరం సమీక్ష జరుపుతోంది. విమాన కార్యకలాపాలను సాధారణ స్థితికి తీసుకువచ్చేందుకు చర్యలు తీసుకుంటోంది. ప్రయాణికులకు ఎప్పటికప్పుడు అప్‌డేట్లు అందించేలా 24/7 అందుబాటులో ఉండేలా కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేసింది. విమానయాన సంస్థలతో సమన్వయం, ప్రస్తుత సమస్యలకు తక్షణ పరిష్కారం చూపే లక్ష్యంతో దీనిని అందుబాటులోకి తెచ్చారు. కంట్రోల్ రూమ్‌కు కాల్ చేయాల్సిన నంబర్లు 011-24610843, 011-24693963, 096503-91859 అని తెలిపింది. ఈ క్రమంలో ఇండిగో సంక్షోభంపై ఉన్నత స్థాయి దర్యాప్తునకు నిర్ణయించినట్టు తెలిపింది. సంక్షోభానికి కారకులైన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని పేర్కొంది. గత నాలుగైదు రోజులుగా ఇండిగో విమాన సర్వీసుల సామూహిక రద్దుతో తలెత్తిన సంక్షోభంపై ఉన్నత స్థాయి దర్యాప్తునకు ప్రభుత్వం నిర్ణయించినట్టు కేంద్ర విమానయాన శాఖ ఒక ప్రకటనలో తెలిపింది. ఇండిగో సర్వీసుల్లో ఎక్కడ పొరపాటు జరిగింది, ఇందుకు బాధ్యులెవరనేది దర్యాప్తులో గుర్తించి, అవరమైన చర్యలు తీసుకుంటామని పేర్కొంది. భవిష్యత్తుల్లో ఇలాంటి అంతరాయాలు తలెత్తకుండా, ప్రయాణికులకు కష్టం కలకుండా చూస్తామని వివరించింది. ప్రయాణికుల భద్రత విషయంలో ఎలాంటి రాజీ లేదని, ముఖ్యంగా సీనియర్ సిటిజన్లు, విద్యార్థులు, పేషెంట్లు, ఇతరులు అవసరాల కోసం ప్రయాణాలు సాగిస్తుంటారని, వారికి ఎలాంటి ఇబ్బంది కలగకుండా చూడాల్సి ఉంటుందని పేర్కొంది. ÷÷-లట్ సర్వీసులు శనివారం నుంచి తిరిగి ప్రారంభమవుతాయని అంచనా వేస్తున్నామని, మూడు రోజుల్లోగా పూర్తిగా పునరుద్ధిస్తామని తెలిపింది.కాగా, నలుగురు సభ్యులతో కూడిన దర్యాప్తు కమిటీని కేంద్రం పౌరవిమానయాన మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేసింది. దేశవ్యాప్తంగా ఇండిగో ఫ్లైట్స్‌కు కలిగిన తీవ్ర అంతరాయం, ఇందుకు దారితీసిన పరిస్థితులపై కమిటీ దర్యాప్తు చేసి నివేదికను 15 రోజుల్లోగా సమర్పించనుంది.



# శ్రీలంకను కుదిపేసిన దిత్వా తుఫాన్

**ఇప్పటి వరకూ 486 మంది మృత్యువాత**

**సుమారు 341 మంది ఆచూకీ గల్లంతు**

**కొలంబో, డిసెంబర్ 5:** దిత్వా తుఫాన్ ద్వీప దేశం శ్రీలంకను భారీగా కుదిపేసింది. తుఫాను బీభత్సానికి కుండపోత వర్షాలు కురిశాయి. దీంతో ఎక్కడికక్కడ వరదలు సంభవించాయి. ఇళ్లు కూలిపోయాయి. కొండచరియలు విరిగిపడ్డాయి. అనేక పట్టణాలు పూర్తిగా నీట మునిగాయి. వేలాది మంది ప్రజలు నిరాశ్రయులయ్యారు. శ్రీలంక విపత్తు నిర్వహణ కేంద్రం వెల్లడించిన వివరాల ప్రకారం.. 20 రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు మౌలిక సదుపాయాలు దెబ్బతిన్నాయి. రోడ్లు, వంతెనలు కొట్టుకుపోవడంతో జనజీవనం స్తంభించింది. దిత్వా తుఫాను బీభత్సానికి భారీగా ఆస్తి ప్రాణ నష్టం సంభవించింది. నవంబర్ 16 నుంచి ఇప్పటి వరకూ 486 మంది ప్రాణాలు కోల్పోయారు. సుమారు 341 మంది ఆచూకీ గల్లంతయింది. ఈ సంక్షోభ సమయంలో భారత దేశం శ్రీలంకకు అండగా నిలుస్తోంది. 'ఆపరేషన్ సాగర్ బంధు' పేరుతో మానవతా సాయాన్ని అందజేస్తోంది. జాతీయ విపత్తు స్పందన దళం , భారత వాయు సేన ప్రజల ప్రాణాలను కాపాడుతున్నాయి.

# 92 ఇండిగో విమానాల రద్దు

- శంషాబాద్ విమానాశ్రయంలో పోర్ట్‌లో ప్రయాణికుల ఆందోళన
- ఇండిగో విమానాల రద్దుతో ప్రయాణికుల ఆగ్రహం
- ఏపీ మంత్రి పార్థసారథి చొరవతో అయ్యప్ప భక్తులకు ప్రత్యేక విమానం





**హైదరాబాద్,డిసెంబర్ 5:** ఇండిగో విమానాల రాకపోకలను నిలిపేయడంతో శంషాబాద్ విమానాశ్రయంలో ప్రయాణికులు ఆందోళన వ్యక్తం చేశారు. మొత్తం 92 విమానాలు రద్దు చేసినట్లు ఆ సంస్థ వెల్లడించింది. ఇందులో శంషాబాద్‌కు రావాల్సినవి 43, ఇక్కడి నుంచి వెళ్లాల్సినవి 49 ఉన్నాయి. ముందుగా బుక్ చేసుకున్న సర్వీసుల రద్దుపై ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. చెక్‌ఇన్ అయిన తర్వాత రద్దు సమాచారం ఇవ్వడంపై నిరసన తెలిపారు. మరోవైపు విశాఖ నుంచి 8 ఇండిగో విమాన సర్వీసులు రద్దు చేశారు. వీటిలో హైదరాబాద్, చెన్నై, బెంగళూరు, అహ్మదాబాద్‌కు వెళ్లాల్సినవి ఉన్నాయి. ఏపీ మంత్రి పార్థసారథి జోక్యంతో శబరిమలకు వెళ్లే అయ్యప్ప భక్తులకు ప్రత్యేక విమాన సదుపాయాన్ని కల్పించారు. అంతకుముందు విజయవాడ వెళ్లేందుకు శంషాబాద్‌లో ఇండిగో విమానం కోసం పార్థసారథి వేచి ఉన్నారు. అయ్యప్ప భక్తులు ప్రయాణించే విమానం ఆలస్యంపై అడిగి తెలుసుకున్నారు. వారి ఆందోళనను గమనించి స్వయంగా కేంద్రమంత్రి రామ్మోహన్‌తో మాట్లాడారు. శబరిమలకు విమాన సర్వీసు ఏర్పాటు చేయించారు. విజయవాడకు వెళ్లాల్సిన విమానం మిస్ కావడంతో మంత్రి పార్థసారథి రోడ్డు మార్గంలో బయలుదేరారు. తమకోసం శ్రమపడి ప్రయాణ సదుపాయం కల్పించిన ఆయనకు అయ్యప్ప భక్తులు ధన్యవాదాలు తెలిపారు. ఇకపోతే దేశీయ విమానయాన సంస్థ ఇండిగో విమానాల రద్దు పరంపర కొనసాగుతున్నది. సిబ్బంది కొరత, సాంకేతిక సమస్యలతో వరుసగా మూడో రోజూ పెద్ద సంఖ్యలో సర్వీసులు నిలిచిపోయాయి. శుక్రవారం మొత్తం 500కుపైగా విమానాలను సంస్థ రద్దు చేసింది. దీంతో ఎయిర్‌పోర్టుల్లో ఇండిగో ప్రయాణికులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. బోర్డింగ్ పక్రియ ముగిసి 12 గంటలవుతున్నా తాము వెళ్లాల్సిన విమానానికి సంబంధించిన ఎలాంటి సమాచారం లేకపోవడంతో ఆందోళనకు దిగుతున్నారు. శంషాబాద్ విమానాశ్రయంలో అయ్యప్ప స్వాముల నిరసనతో తీవ్ర ఉద్రిక్తత చోటుచేసుకున్నది. హైదరాబాద్ నుంచి కొచ్చి వెళ్లాల్సిన విమానం 12 గంటల పాటు ఆలస్యం కావడంతో అయ్యప్పలు ఆందోళనకు దిగారు. ఇండిగో విమానం గురువారం సాయంత్రం హైదరాబాద్ నుంచి కొచ్చి వెళ్లాల్సి ఉంది. ఈ విమానంలో వెళ్లాల్సిన అయ్యప్ప భక్తులు సాయంత్రమే శంషాబాద్ విమానాశ్రయానికి చేరుకున్నారు. అయితే, విమానం శుక్రవారం ఉదయానికి కూడా బయలుదేరకపోవడంతో ఆందోళనకు దిగారు. బోర్డింగ్ గేటుకు అడ్డంగా బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. 12 గంటలుగా తాము విమానాశ్రయంలోనే ఉన్నామని, విమానం గురించి తమకు సమాచారం ఇవ్వడంలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రత్యామ్నాయ ఏర్పాట్లు కూడా చేయలేదని ఆసహనం వ్యక్తం చేశారు. కాగా, ఇండిగో విమానాల రద్దు కారణంగా ప్రయాణీకులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రెండు, మూడు రోజులుగా విమానా సర్వీసులు లేకపోవడంతో ఎయిర్‌పోర్టుల్లో ప్రయాణికులు పడిగాపులు కాస్తున్నారు.



# గ్లోబల్ సమ్మిట్ కు వస్తా..

## హిమాచల్ ప్రదేశ్ సీఎం సుఖ్వీందర్ సింగ్ సుఖు ఆహ్వానించేందుకు స్వయంగా వెళ్లిన మంత్రి అడ్లూరి లక్ష్మణ్

**హిమాచల్ ప్రదేశ్ డిసెంబర్5( సమయం న్యూస్):** తెలంగాణ ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న 'తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్-2025'కు తప్పకుండా హాజరవుతానని హిమాచల్ ప్రదేశ్ ముఖ్యమంత్రి సుఖ్వీందర్ సింగ్ సుఖు హామీ ఇచ్చారు. ఈనెల 8, 9 తేదీల్లో తెలంగాణలో జరగనున్న గ్లోబల్ సమ్మిట్ కు రావాలని ఆహ్వానించేందుకు శుక్రవారం స్వయంగా రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగుల సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ..హిమాచల్ ప్రదేశ్ కు వెళ్లారు. ఈమేరకు సీఎం సుఖ్వీందర్ ను కలిసి ఈ సమ్మిట్ కు హాజరవ్వాలని ఆహ్వానించారు. అనంతరం తెలంగాణలో జరుగుతున్న అభివృద్ధి పనులపై ఇరువురు చర్చించారు. తెలంగాణ డెవలప్మెంట్ అద్భుతమని ఈ సందర్భంగా హిమాచల్ ప్రదేశ్ సీఎం సుఖ్వీందర్ కితాబిచ్చారు. ప్రపంచ దేశాల నుంచి పెట్టుబడులను ఆకర్షించడం, రాష్ట్ర బ్రాండ్‌ను అంతర్జాతీయ స్థాయిలో ప్రమోట్ చేయడంలో భాగంగా ఈ సమ్మిట్ ను రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తోంది. దీనికి సంబంధించిన పనులు కూడా చకచకా పూర్తవుతున్నాయి. తెలంగాణ రైజింగ్-2047 దార్శనిక పత్రాన్ని ఈ సమ్మిట్ లో ఆవిష్కరించనున్నారు. ఈ సదస్సుకు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలోని దాదాపు 3 వేల మంది ప్రముఖులు, పారిశ్రామిక వేత్తలు, టెక్నాలజీ నిపుణులు, వివిధ రాష్ట్రాల ముఖ్యమంత్రులు, కేంద్ర మంత్రులు, దౌత్యవేత్తలు హాజరుకానున్నారు. ఇదిలా ఉండగా ఇప్పటికే ప్రధాని నరేంద్ర మోడీతో పాటు కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ, ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గేలను కూడా సీఎం రేవంత్ రెడ్డి స్వయంగా ఆహ్వానించారు. సదస్సులో భాగంగా క్రీడా నగర ప్రాజెక్టులు, సినీ స్టూడియోలు, పర్యాటక భాగస్వామ్యాలు వంటి వివిధ రంగాల్లో అవగాహన ఒప్పందాలు కూడా కుదిరే అవకాశం ఉంది. తెలంగాణ ప్రభుత్వం ఈ సమ్మిట్‌ను దావోస్ సదస్సు తరహాలో అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తోంది. రాష్ట్ర భవిష్యత్ ప్రణాళికలకు కీలక వేదికగా ఇది మారనుంది.

# ఏఐ ఎక్స్ లెన్స్ సెంటర్ ఏర్పాటుకు ఆస్ట్రేలియాతో కీలక ఒప్పందం



**హైదరాబాద్ డిసెంబర్5( సమయం న్యూస్):** ఆస్ట్రేలియాకు చెందిన డీకిన్ యూనివర్సిటీ భాగస్వామ్యంతో రాష్ట్రంలో కృత్రిమ మేథకు సంబంధించిన సెంటర్ ఆఫ్ ఎక్స్ లెన్స్ ను ఏర్పాటు చేయడానికి తెలంగాణా ప్రభుత్వం శుక్రవారం నాడు కీలక ఒప్పందం చేసుకుంది. దేశంలోనే ఈ తరహా నైపుణ్య శిక్షణ కేంద్రం (సెంటర్ ఆఫ్ ఎక్స్ లెన్స్) మొట్టమొదటిది. ఆస్ట్రేలియా అంతర్జాతీయ విద్యా మంత్రి జూలియన్ హిల్ తో కలిసి సచివాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఐటీ, పరిశ్రమల మంత్రి దుద్దిళ్ల బాబు ఎంఓయు వివరాలను వెల్లడించారు. ఫ్యూచర్ సిటీలో ఏర్పాటు చేయనున్న ఏఐ యూనివర్సిటీలో ఈ సెంటర్ ఆఫ్ ఎక్స్ లెన్స్ ను నెలకొల్పనున్నట్టు శ్రీధర్ బాబు తెలిపారు. డీకిన్ అప్లయిడ్ ఆర్టిఫిషియల్ ఇన్ స్టిట్యూట్ ఈ ఎక్సెలెన్స్ సెంటర్ ను రాష్ట్ర ప్రభుత్వంతో కలిసి నిర్వహిస్తుందని ఆయన వివరించారు. కాలేజిల నుంచి అకడమిక్ గ్రాడ్యుయేట్లను కాకుండా ప్రపంచ స్థాయి నైపుణ్యాలతో కూడిన ప్రతిభావంతులను తయారు చేయాలన్న లక్ష్యంతోనే ఆస్ట్రేలియా ప్రభుత్వంతో ఈ భాగస్వామ్య ఒప్పందం చేసుకున్నట్టు ఆయన చెప్పారు. విదేశీ విశ్వవిద్యాలయాలను రాష్ట్రానికి తీసుకురావడానికి సిఎం రేవంత్ రెడ్డి చేస్తున్న ప్రయత్నాల్లో భాగంగానే ఈ ఒప్పందం జరిగిందని ఆయన వెల్లడించారు. ప్రభుత్వ పాలన, ఆరోగ్యం, విద్య, ఐటీ, లైఫ్ సైన్సెస్, వ్యవసాయం, క్రిటికల్ మినరల్స్, రేర్ ఎర్త్ మెటల్స్ రంగాల్లో పరిశోధన, నైపుణ్య శిక్షణ అందజేయడానికి ఈ సెంటర్ ఎక్స్ లెన్స్ ఉపయోగపడుతుంది. డిజిటల్ ఇండియా భవిష్యత్తుకు తెలంగాణా ముఖ ద్వారం కానుందని శ్రీధర్ బాబు పేర్కొన్నారు. ఎంఓయు కార్యక్రమంలో ప్రభుత్వ ఐటీ సలహాదారు ఐ. సాయిక్రిష్ణ, ఆస్ట్రేలియా ప్రతినిధులు క్యామ్ గ్రీన్, కరేన్ సాండర్ కాక్, నథానియెల్ వెబ్, స్టీవెన్ బిడిల్, హిల్లరీ మెక్ గీచి, స్టీవెన్ కానోలీ, విక్రం సింగ్, ఐటీ శాఖ చీఫ్ స్ట్రాటెజిస్ట్ శ్రీకాంత్ లంకా తదితరులు పాల్గొన్నారు.



ప్రజాపాలన- ప్రజా విజయోత్సవ వారోత్సవ కార్యక్రమంలో పాల్గొనడానికి శుక్రవారం నర్సంపేట లో హెలిప్యాడ్ కు చేరుకున్న రాష్ట్ర ముఖ్యమంత్రి ఏనుముల రేవంత్ రెడ్డి కి పూల మొక్కను అందజేసి శాలివతో సత్కరించి స్వాగతం పలికిన గ్రేటర్ వరంగల్ మేయర్ శ్రీమతి గుండు సుధారాణి.

# ఏపీ సీఎం చంద్రబాబును కలిసి మంత్రి కోమటిరెడ్డి





**అమరావతి డిసెంబర్5( సమయం న్యూస్):** గ్లోబల్ సమ్మిట్ 2025 లో పాల్గొనాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ను తెలంగాణ రాష్ట్ర రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటి రెడ్డి శు క్రవారం ఆహ్వానించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రాజధాని అమరావతిలోని ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయంలో సిఎం ను కలిసిన మంత్రి, తెలంగాణ ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా భారత్ ఫ్యూచర్ సిటీలో ఈనెల 8,9 తేదీల్లో నిర్వహించ తలపెట్టిన రైసింగ్ తెలంగాణ - విజన్ 2047 గ్లోబల్ సమ్మిట్ లో పాల్గొనాలని రాష్ట్ర ప్రభుత్వం తరుపున శాలువాతో సత్కరించి,ఆహ్వాన పత్రిక అందజేశారు.సిఎంతో సుమారు గంటన్నర పాటు సాగిన భేటిలో ఇరు తెలుగు రాష్ట్రాల పలు అంశాలు చర్చించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో దావోస్ సదస్సు మాదిరిగా తెలంగాణలో గ్లోబల్ సదస్సు నిర్వహిస్తున్నామని,3ట్రిలియన్ డాలర్స్ ఎకానమీ లక్ష్యంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రణాళికలను మంత్రి,ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కు వివరించారు.చంద్రబాబు విజన్ 2020 అంశాలు ఈ సందర్భంగా చర్చకు వచ్చాయి. తెలంగాణ ప్రభుత్వం విజన్ 2047 ప్రణాళికతో ముందుకెళ్లడం మంచి పరిణామం అని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా మంత్రిని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు శాలువాతో సత్కరించి,జ్ఞాపికను అందజేశారు.మంత్రి వెంట ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య యాదవ్, నిరంజన్ రెడ్డి తదితరులు ఉన్నారు.

# 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ

- మంత్రి తుమ్మల



**హైదరాబాద్ డిసెంబర్5( సమయం న్యూస్):** తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న Telangana Rising Global Summit 2025" ప్రధాన లక్ష్యం రాష్ట్రాన్ని 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దడం అని వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, హ్యాండ్లూమ్స్ & టెక్స్టైల్స్ శాఖల మంత్రి శ్రీ తుమ్మల నాగేశ్వరరావు గారు తెలిపారు. ప్రస్తుతం రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ సుమారు 200 బిలియన్ డాలర్ల వద్ద ఉందని, వచ్చే రెండు దశాబ్దాల్లో తెలంగాణను 15 రెట్లు పెద్ద ఆర్థిక వ్యవస్థగా మార్చే మహాదృక్పథానికి ఈ గ్లోబల్ సమిట్ ప్రధాన వేదికగా నిలుస్తుందని ఆయన పేర్కొన్నారు. శుక్రవారం సచివాలయంలో గ్లోబల్ సమ్మిట్ ఏర్పాట్లపై జరిగిన సమీక్ష సమావేశంలో మంత్రి తుమ్మల సమ్మిట్ లో ప్రదర్శించాల్సిన AV కంటెంట్‌పై అధికారులకు దిశానిర్దేశం చేశారు. తెలంగాణ వ్యవసాయరంగం యొక్క అభివృద్ధి సామార్థ్యాలు, విదేశీ పెట్టుబడి అవకాశాలు, భవిష్యత్ విజన్ స్పష్టంగా ప్రతిబింబించేలా AVలను రూపొందించాలని అన్నారు. వ్యవసాయ రంగమే రాష్ట్ర ఆర్థిక లక్ష్య సాధనలో అత్యంత కీలక పాత్ర పోషించబోతోందని మంత్రి గారు స్పష్టం చేశారు. గ్రామీణ జనాభాలో 66 శాతం మందికి ఉపాధి అందించే వ్యవసాయం రాష్ట్ర %+ూవాూ%లో 17 శాతం వరకు వాటా కలిగి ఉందని, అందువల్ల తెలంగాణ ఆర్థిక వృద్ధిలో వ్యవసాయ అభివృద్ధి కేంద్రబిందువుగా ఉంటుందని పేర్కొన్నారు. రైతు ఆదాయం పెరగడం, ఉత్పాదకత పెరుగుదల, విలువ ఆధారిత వ్యవసాయం విస్తరణ, ఎగుమతుల పెంపు ఇవన్నీ 3 ట్రిలియన్ ఆర్థిక లక్ష్యాన్ని సాధించడానికి అత్యంత కీలక అంశాలు అని మంత్రి తుమ్మల గారు అధికారులకు వివరించారు. రైతు సంక్షేమం ప్రభుత్వం యొక్క మొదటి ప్రాధాన్యత అని మంత్రి పునరుద్ఘాటించారు. రైతు భరోసా, రుణమాఫీ, పంట నష్టపరిహారం, రైతు బీమా వంటి పథకాలతో రాష్ట్ర ప్రభుత్వం రైతుల జీవనోపాధిని మెరుగుపరచడంతో పాటు భవిష్యత్తు వృద్ధికి బలమైన పునాది వేసిందన్నారు. ఇకపై సాంకేతికత%-%ఆధారిత, డేటా%-%ఆధారిత, మార్కెట్%-%ఆధారిత వ్యవసాయ మోడల్‌ద్వారా రైతులను మరింత సాధికారులను చేయడం ప్రభుత్వం యొక్క సంకల్పమని స్పష్టం చేశారు. "వ్యవసాయ రంగం బలపడితేనే తెలంగాణ ఆర్థిక వ్యవస్థ బలపడుతుంది. రైతు శ్రమే రాష్ట్ర అభివృద్ధికి మూలం. 2047 నాటికి తెలంగాణను 3 ట్రిలియన్ ఆర్థిక వ్యవస్థగా మార్చే మహా లక్ష్యంలో, వ్యవసాయం అత్యంత ముఖ్యమైన ప్రేరణాశక్తి అవుతుంది" అని మంత్రి శ్రీ తుమ్మల నాగేశ్వరరావు గారు పేర్కొన్నారు. ఈ గ్లోబల్ సమిట్ ద్వారా తెలంగాణ, వ్యవసాయం%-%సాంకేతికత%-%పెట్టుబడుల నూతన అధ్యాయాన్ని ప్రారంభించబోతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో వ్యవసాయశాఖ సెక్రటరీ సురేంద్ర మోహన్, డైరెక్టర్ గోపి, అగ్రికల్చర్ యూనివర్సిటీ విసి జానయ్య, హార్టికల్చర్ యూనివర్సిటీ విసి రాజిరెడ్డి, మార్క్ ఫెడ్ ఎండి శ్రీనివాస్ రెడ్డి, %నూూజాూ% ఎండి చంద్రశేఖర్ రెడ్డి మరియు మార్కెటింగ్ డైరెక్టర్ లక్ష్మీబాయి గారు పాల్గొన్నారు.

# ఉస్మానియా యూనివర్సిటీ అభివృద్ధి పనులపై సీఎం సమీక్ష



**హైదరాబాద్ డిసెంబర్5(సమయం న్యూస్):** హాజరైన ప్రభుత్వ సలహాదారు కే కేశవరావు,సిఎం ఓ ప్రత్యేక కార్యదర్శి అజిత్ రెడ్డి, విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి యోగితా రాణా , సాంకేతిక విద్యాశాఖ కమిషనర్ దేవసేన,ఓయూ వీసీ ప్రొఫెసర్ కుమార్,ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కాశీం,ఉన్నతాధికారులు వీసీ,ప్రొఫెసర్లతో కలిసి అధికారులు యూనివర్సిటీ లో పర్యటించాలి.. ఈ నెల 10 న యూనివర్సిటీ ని సందర్శిస్తా..విద్యార్థుల సంఖ్య ఆధారం గా యూనివర్సిటీ లో భవన నిర్మాణాలు ఉండాలి. యూనివర్సిటీ అభివృద్ధి కోసం ఎంత ఖర్చు పెట్టడానికైనా సిద్ధం ఉన్నాం.. భవనాల మరమ్మతు ల కంటే కొత్త భవనాలు నిర్మాణం పైనే దృష్టి పెట్టాలి. యూనివర్సిటీ అభివృద్ధి ప్రణాళిక పైన విద్యార్థుల అభిప్రాయాలు తీసుకోవాలి..విద్యార్థుల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని డిసెంబర్ 31 న పూర్తి ప్రణాళిక ను ప్రకటించాలి..బెస్ట్ యూనివర్సిటీ గా ఉస్మానియా ను తీర్చిదిద్దాలి.. ప్రపంచంతో పోటీపడేలా యూనివర్సిటీ విద్యార్థులను తీర్చిదిద్దాలి..యూనివర్సిటీ అధ్యాపకులను విదేశాలకు పంపి శిక్షణ ఇవ్వాలి.



ప్రజా భవన్‌లో తెలంగాణ రైజింగ్ 2047 విజన్ డాక్యుమెంట్, గ్లోబల్ సమ్మిట్ ఏర్పాట్లపై సమీక్ష సమావేశం నిర్వహించిన ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి గారు ఉప ముఖ్యమంత్రి శ్రీ భట్టి విక్రమార్క మల్లు గారు. తెలంగాణ దీర్ఘకాల భవిష్యత్ లక్ష్యాలు, గ్లోబల్ పోటీ సామర్థ్యాన్ని ప్రతిబింబించేలా విజన్ డాక్యుమెంట్‌ను మరింత సమగ్రంగా, ముందుచూపుతో మెరుగుపరచాలని అధికారులను ఆదేశించారు. విజన్ డాక్యుమెంట్‌ను ప్రజలకు డిజిటల్ రూపంలో అందుబాటులో ఉంచి పారదర్శకతకు, ప్రజల భాగస్వామ్యానికి ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. దావోస్‌లో జరిగే ప్రపంచ ఆర్థిక వేదిక సదస్సులో తెలంగాణ సామర్థ్యాన్ని, అభిలాషను, వ్యూహాత్మక ప్రాధాన్యతను ప్రతిపాదించేలా తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్‌ను రూపుదిద్దాలని స్పష్టం చేశారు. తదనంతరం ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి గారు ఉన్నతాధికారులతో కలిసి ప్రజా భవన్‌లో ఏర్పాటు చేసిన సమ్మిట్ వార్ రూమ్‌ను సందర్శించి, సిద్ధతలు మరియు సమ్మిట్ కార్యకలాపాల పురోగతిని వివరంగా సమీక్షించారు. ఈ సమావేశంలో రెవెన్యూ మంత్రి శ్రీ పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ముఖ్యమంత్రివర్యుల సలహాదారు శ్రీ వేం నరేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# గ్లోబల్ సమ్మిట్‌కు జార్ఖండ్ సిఎంకు ఆహ్వానం

**జార్ఖండ్, డిసెంబర్5( సమయం న్యూస్):** హైదరాబాద్ భారత్ ఫ్యూచర్ సిటీలో ఈనెల 8,9 తేదీల్లో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న తెలంగాణ రైజింగ్ 2047 గ్లోబల్ సమ్మిట్‌కు హాజరు కావాలని జార్ఖండ్ సీఎం హేమంత్ సోరెన్ ను ప్రత్యేకంగా ఆహ్వానించిన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు.జార్ఖండ్ సీఎం నివాసంలో జరిగిన ఈ భేటీలో రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా ముద్రించిన గ్లోబల్ సమ్మిట్ ఆహ్వాన పత్రికను సీఎం శ్రీ హేమంత్ సోరెన్ కు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అందజేశారు. 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వృద్ధి లక్ష్యంగా తెలంగాణ భవిష్యత్తు సంకల్పంతో ముందుకు సాగుతుందని డిప్యూటీ సీఎం వివరించారు.

# కాంగ్రెస్ మోసానికి మరొక బలిదాన ప్రయత్నం సాయి ఈశ్వర చారి



**సమయం న్యూస్ గజ్వేల్ డిసెంబర్ 5 :** తెలం గాణ ప్రజా నీకం ఒక సా రి ఆలోచించాలి ప్రజల సమస్యల పైన ప్రజలకు కావలసిన మౌలిక వసతుల పైన దృష్టి పెట్టకుండా కాలయాపనతో ప్రజలను మభ్యపెడుతూ ఆశలు తేలుస్తూ గతంలో రేవంత్ రెడ్డి కామారెడ్డి డిక్లరేషన్ పేరు చెప్పి బీసీ జనాలకు మాయ చేద్దామని ఆలోచనతో గద్దెనెక్కి ఈంోజు మళ్లీ మభ్యపెట్టే ప్రయత్నం చేసి అది గమనించిన ఈశ్వర సాయి చారి బలిదానానికి సిద్ధపడడం అతని భావోద్వేగానికి నిదర్శనం గాంధీ హాస్పిటల్ లో చావు బతుకుల మధ్య కొట్టుమిట్టాడుతున్న బీసీ బిడ్డ కానీ తెగించి మనం తెలంగాణ సాధించుకున్నాం అదే విధంగా బీసీ రిజర్వేషన్లను కూడా సాధించుకుందాం. అంతేకానీ ఎవరు కూడా అధైర్య పడవద్దు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల మెడలు వంచి ఆరోజు తెలంగాణ రాష్ట్రాన్ని ఏ విధంగా సాధించుకున్నామో అదే విధంగా పోరాటం చేసి మళ్లీ బీసీ ఉద్యమాన్ని కూడా సందర్భోచితంగా రగిలించి మన హక్కులను మనం సాధించుకుందాం. రాజకీయ నాయకుల మెడలు వంచాలంటే రాజ్యాంగం మనకు ఇచ్చిన ఆయుధం ఓటు ఆ ఓటు ద్వారానే నమ్మకద్రోహం చేస్తున్నటువంటి నాయకులకు ఆ పార్టీలను బొందపెడతనే బీసీల ఆత్మగౌరవం నిలబడుతుంది కాబట్టి సందర్భం ఏదైనా అటు కేంద్రంలో ఉన్న బిజెపికి కానీ రాష్ట్రంలో ఉన్న కాంగ్రెస్ గాని ఓటు బ్యాంకు రాజకీయాలు చేసే ఈ పార్టీలను బొంద పెడితే తప్ప బీసీ రిజర్వేషన్ సాధ్యం కాదు అంతేకానీ ఎవరూ కూడా ఆత్మ బలిదానాలు చేసుకోవద్దని మరొకసారి విజ్ఞప్తి చేస్తున్నాం వీలైనంత త్వరగా ఈశ్వర సాయి చారి త్వరగా కోలుకోవాలని దేవుడిని ప్రార్థిస్తున్నాను అని కళ్యాణ్కర్ నర్సింగ రావు విలేకర్ల సమావేశంలో తెలియజేశారు కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్లు ఆర్కే శ్రీనివాస్ బొల్లిపల్లి బాలమణి శ్రీనివాస్ రెడ్డి కళ్యాణ్కర్ స్రవంత్రి శ్రీనివాస్ మామిడి శంకర్ తదితరులు పాల్గొన్నారు

# గ్రామ అభివృద్ధికి కృషి చేస్తా నిత్యం ప్రజలకు సేవ చేసుకుంటా



**సమయం న్యూస్ గజ్వేల్ డిసెంబర్ 5 :** ప్రజలకు అందుబాటులో ఉండి సేవలు అందిస్తామని గజ్వేల్ మండలం దాతర్ పల్లి గ్రామ సర్పంచ్ అభ్యర్థి బాసు దివ్య రాజ్ కుమార్, వార్డు సభ్యులు బారు సంధ్య, బారు నాగలక్ష్మి అరవింద్ అన్నారు. శుక్రవారం ఇంటింటి ప్రచారంలో భాగంగా తమ గెలిపిస్తే ప్రజలకు అందుబాటులో ఉండి వారి సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తామని వారు అన్నారు. మండల పరిషత్ నుండి నిధులు తీసుకొచ్చి అభివృద్ధి చేస్తామని వారు చెప్పారు. దాతర్ పల్లి గ్రామ అభివృద్ధికి బ్యాట్ గుర్తుకు ఓటు వేసి గెలిపించాలన్నారు. అదేవిధంగా ఆరో వార్డు అభ్యర్థి బారు సంధ్య అనిల్ గుర్తు స్కూలుకు ఓట్లు వేయాలని అదేవిధంగా ఎనిమిదో వాడు బారు నాగలక్ష్మి అరవిందు గుర్తు గ్యాస్ గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని వారు కోరారు. అన్ని సామాజిక వర్గాల సమస్యలను క్షుణంగా విని సమస్యలు పరిష్కరిస్తామని వారు హామీ ఇచ్చారు.

# వరి కోయకాళ్ళను కాలుస్తే ముప్పే



-డి9 వాడకం ద్వారా సేంద్రియ ఎరువు తయారీ

-డిఎన్ఆర్ కంపెనీ ప్రతినిధి తలారి అశోక్

**సమయం న్యూస్ గజ్వేల్ డిసెంబర్ 5 :** రైతులు పంట కాలం పూర్తియినా తర్వాత వరి కొయ్యకాళ్ళను కాల్చేస్తున్నారు. దీని ఫలితంగా పంటలకు బస్తాలకొద్ది ఎరువులను వాడిన దిగుబడి రాకపోవడమే కాకుండా పంటలకు అవసర మైనా సూక్ష్మ జీవులు చనిపోతు న్నాయి. పంట వ్యర్థ్యాలను, అవశేషాలను తగులబెట్టినప్పుడు నేల సారవంతాన్ని కోల్పోతు ంది. దీనిని దృష్టిలో ఉంచుకొని డిఎన్ఆర్ అగ్రిటెక్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ వారు డి 9 అనే ఆర్గానిక్ వేస్ట్ డికంపోస్టర్ ను రైతులకు అందుబాటులోకి తెచ్చారు. ఇది పంట వ్యర్థ్యాలను, అవశేషాలను కుళ్ళింపజేసి సేంద్రియ ఎరువుగా మారుస్తుంది. డి 9 వాడటం వల్ల భూసారాన్ని పెంచడమే కాకుండా నేలకు అవసరమైన సూక్ష్మ జీవులను వృద్ధి చెంది పంట కావలసిన ఇతర పోషకాలను అందిస్తుంది అని కంపెనీ ప్రతినిధి తలారి అశోక్ తెలిపారు.

# జడ్చర్ల లో జరిగిన కరాటే పోటీలలో పరిగి గ్లోబల్ స్కూల్ విద్యార్థుల ప్రతిభ





**పరిగి మున్సిపల్(మం) డిసెంబర్,05(సమయం న్యూస్) :** జాతీయస్థాయి కరాటే పోటీలలో గ్లోబల్ స్కూల్ విద్యార్థినిలు బంగారు మరియు వెండి పథకం కైవసం చేసుకున్నారు. కరాటే నేర్చుకోవడం వల్ల ఆత్మస్థైర్యం బలపడుతుందని మరియు తనను తాను రక్షించుకోగలరు కరాటే మాస్టర్ మహమ్మద్ గౌస్ అన్నారు. జాతీయస్థాయిలో ది గ్లోబల్ డిజి గ్లోబల్ స్కూల్ కు చెందిన విద్యార్థులు ప్రథమ ద్వితీయ స్థానాలు కైవసం చేసుకున్నందుకు సంతోషం వ్యక్తం చేశారు. వికారాబాద్ జిల్లా పరిగి ది గ్లోబల్ డిజి స్కూల్లో 4 వ తరగతి చదువుతున్న ఆష్నా సాదియా బేగం జాతీయ స్థాయిలో ప్రథమ స్థానము 3 వ తరగతికి చెందిన ఆఫ్రిన్ రహమత్ కంకల్ జునైరా షేక్ ను అభినందించిన స్కూల్ యాజమాన్యం ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ ఆయేషా మరియు ఉపాధ్యాయులు పాల్గొన్నారు..

# సిఈఐఆర్ పోర్టల్ ద్వారా 106 మొబైల్ ఫోన్లు రికవరీ బాధితులకు అందజేత

- జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ ఐపీఎస్
- ప్రజలెవరు పాత మొబైల్ ఫోన్లను కొనరాదు.
- 106 మొబైల్ ఫోన్లు రికవరీ, వాటి విలువ సుమారు 16 లక్షలు.
- మొబైల్ ఫోన్ పోయిన వెంటనే సిఈఐఆర్ పోర్టల్ లో లేదా దగ్గర్లోని పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయాలి -ఎస్పీ



**నారాయణపేట, డిసెంబర్,05(సమయం న్యూస్) :** నారాయణపేట జిల్లా వ్యాప్తంగా మొబైల్ ఫోన్లు పోగొట్టుకున్న బాధితులకు గత మూడు నెలల్లో సిఈఐఆర్ పోర్టల్ ద్వారా రికవరీ చేసిన 106 మొబైల్ ఫోన్లను శుక్రవారం జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ ఎస్పీ కార్యాలయంలోనీ కాన్ఫరెన్స్ హాల్లో నిర్వహించిన కార్యక్రమంలో బాధితులకు తిరిగి అందజేశారు. రికవరీ చేసిన మొబైల్ ఫోన్ల మొత్తం విలువ సుమారు 16 లక్షల రూపాయలు ఉంటుందని తెలిపారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ...మొబైల్ ఫోన్ పోయిన వెంటనే సిఈఐఆర్ పోర్టల్ లోగానీ, దగ్గరలోని పోలీస్ స్టేషన్ లోగానీ వెంటనే ఫిర్యాదు చేయాలి అని తెలిపారు. మొబైల్ దొంగతనం చేసిన వ్యక్తులపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని అన్నారు. చాలా వరకు దొంగతనమైన మొబైల్ ఫోన్లు నేర కార్యకలాపాలకు దుర్వినియోగం అయ్యే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అనుమానాస్పదంగా పాత/సెకండ్ హ్యాండ్ మొబైల్ ఫోన్లు కొనరాదు అని సూచించారు. తమ వ్యక్తిగత మొబైల్ ఫోన్లను జాగ్రత్తగా ఉంచుకోవాలి అన్నారు. దొంగతనానికి గురైన సెల్ఫోన్లు పట్టుకునే బాధ్యత పోలీసులది అని వాటిని తప్పనిసరిగా పట్టుకోవడం జరుగుతుందని, నేరస్తులను గుర్తించి కేసులు నమోదు చేస్తామని తెలిపారు. జిల్లాలోని ఐటి కోర్ పోలీసులు ఆధునాతన టెక్నాలజీ సాయంతో మొబైల్ ఫోన్ల ట్రేస్ చేసి మొత్తం 106 ఫోన్లు రికవర్ చేయడంలో కీలక పాత్ర పోషించారు. వారి కృషిని ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఎండి రియాజ్ హుల్ హక్, డీఎస్పీలు ఎన్. లింగయ్య, మహేష్, సిఐలు శివశంకర్, రాజేందర్ రెడ్డి, రామ్ లాల్, సైదులు, ఐటి కోర్ ఎస్సై సురేష్, ఇతర ఎస్సైలు, పోలీస్ సిబ్బంది మరియు మొబైల్ స్వీకరించిన బాధితులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ ప్రజా వ్యతిరేక విధానాలు ప్రజలకు వివరించాలి



**సమయం న్యూస్ గజ్వేల్ డిసెంబర్ 5 :** కాంగ్రెస్ ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తూ గ్రామపంచాయతీ ఎన్నికలకు వెళ్లిందని దీనిపై ప్రజలకు వివరించవలసిన అవసరం ఉందని బీజేపీ సిద్దిపేట జిల్లా అధ్యక్షులు బైరి శంకర్ ముదిరాజ్ అన్నారు. శుక్రవారం గజ్వేల్ మండలం దాతర్ పల్లి గ్రామపంచాయతీ సర్పంచ్ అభ్యర్థి బాసు దివ్య రాజ్ కుమార్, ఆరో వార్డు సభ్యులు బారు సంధ్య అనిల్, ఎనిమిదో వార్డు బారు నాగలక్ష్మి అరవింద్ లకు మద్దతుగా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండు సంవత్సరాలు గడిచిన 6 గ్యారంటీలను అమలు చేయని కాంగ్రెస్ పార్టీ మద్దతుదారులకు ఓట్లు వెయ్యకూడదని ఆయన సూచించారు. అదేవిధంగా గత ప్రభుత్వం కేసీఆర్ మూలంగా గ్రామీణ ప్రాంతాలు నష్టపోయినట్లు ఆయన చెప్పారు. అభివృద్ధి నోచుకోని గ్రామాలకు బీ ఆర్ఎస్ నాయకులు ఓట్లు అడిగే నైతిక హక్కు లేదని ఆయన సూచించారు. కేంద్ర ప్రభుత్వం ఇస్తున్న రేషన్ బియ్యం, పింఛన్లు, రైతు సంబంధించిన పథకాలను కాంగ్రెస్ ప్రభుత్వం తామే ఇస్తున్నమని చెప్పుకోవడం సిగ్గుచేటు అన్నారు. కేంద్రం జోక్యం లేనిది ఏ పథకం ప్రజలకు ఇచ్చారో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెప్పాలని ఆయన సవాలు ఇస్తున్నారు. దాతర్ పల్లి గ్రామంలో తమ పార్టీ మద్దతుదారులను గెలిపించితే మెదక్ ఎంపీ రఘునందన్ రావు నిధుల ద్వారా అభివృద్ధి సాధించి పెడతామని ఇది ప్రజలు నమ్మాలని ఆయనే చెప్పారు. ఈ కార్యక్రమంలో గజ్వేల్ మున్సిపల్ మాజీ అధ్యక్షులు గాడి పల్లి భాస్కర్, మాజీ కౌన్సిల్ సభ్యులు సుభాష్ చంద్రబోస్, మండల ఉపాధ్యక్షులు బారు అరవింద్, అధ్యక్షులు అశోక్ గౌడ్, నియోజకవర్గ కమిటీ సభ్యులు సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# సైనిక అమర వీరుల కుటుంబాల కోసం ప్రతి పౌరుడు చేతులు కలపాలి

- జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి



**ఖమ్మం, డిసెంబర్ 5 : ( సమయం న్యూస్ ) :** మన దేశం నేడు శాంతి, భద్రతలతో ముందుకు సాగుతున్నదంటే, అది సైనికుల త్యాగం వల్లే సాధ్యమవుతుందని, సైనిక అమరవీరుల కుటుంబాలను ఆదుకోవడం మనందరి నైతిక బాధ్యత అని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. దేశ రక్షణలో ప్రాణత్యాగం చేసిన సైనికుల కుటుంబాల సంక్షేమం కోసం సేకరించే సాయుధ దళాల పతాక దినోత్సవం నిధికి శుక్రవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో, జిల్లా కలెక్టర్, దేశభక్తి చిహ్నమైన రిబ్బన్ ఫ్లాగ్ ను స్వీకరించి తన వంతు విరాళాన్ని అందజేశారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ దేశ సరిహద్దుల్లో విధులు నిర్వర్తిస్తూ ప్రాణత్యాగం చేస్తున్న సైనికుల కుటుంబాల సంక్షేమం కోసం నిర్వహించే ఫ్లాగ్ డే ఫండ్ సేకరణ కు స్వచ్ఛందంగా ప్రజలు సహకరించాలని అన్నారు. సైనికులు దేశం కోసం ప్రాణాలను అర్పించినప్పుడు, వారి కుటుంబాలు కష్టాల్లో పడకుండా చూడటం ప్రతి పౌరుడి కర్తవ్యమూ కావాలన్నారు. మనం ఇచ్చే చిన్న సహాయం ఒక సైనికుని కుటుంబానికి ఆశగా మారుతుందని, సామర్థ్యాన్ని బట్టి ఎంతైనా ఈ నిధికి అందించాలని కోరారు. సాయుధ దళాల పతాక దినోత్సవం నిధి పూర్తిగా అమరవీరుల కుటుంబాలు, విధి నిర్వహణలో గాయపడ్డ జవాన్లు, వికలాంగులైన రిటైర్డ్ సైనికులు, వృద్ధ సైనికుల సంక్షేమ కార్యక్రమాలకు పారదర్శకంగా వినియోగిం చబడతాయని తెలిపారు. విద్యా, వైద్య సహాయం, పింఛన్లు, పునరావాస చర్యలు మొదలైన కార్యక్రమాల్లో ఈ నిధులు కీలక పాత్ర పోషిస్తాయి అని కలెక్టర్ వివరిం చారు. జిల్లాలోని ప్రభుత్వ శాఖలు, విద్యాసంస్థలు, వ్యాపారులు, ఉద్యోగులు, స్వచ్ఛంద సంస్థలు, సాధారణ ప్రజలు ఫ్లాగ్ డే ఫండ్ కార్యక్రమానికి విస్తృతంగా సహకరించాలని కోరారు. గ్రామ, మండల స్థాయిలో కూడా అధికారులు ప్రజల్లో అవగాహన కల్పించాలని కలెక్టర్ సూచించారు. అమరవీరుల కుటుంబాల కోసం అందించే సహాయం ఎప్పటికీ మరువలేని సేవ అని, ఇది మనం అందించే వారి త్యాగానికి కృతజ్ఞత అని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సైనిక సంక్షేమ అధికారి యం. చంద్రశేఖర్, ఇసిహెచ్ఎస్ ఓఐసి వింగ్ కమాండర్ సురేంద్ర, ఎస్. అనూష, కళావాసు, వీరబాబు, సాయికుమార్ మాజీ సైనిక సంక్షేమ సంఘ అద్యక్షులు సుభాని, కృష్ణమూర్తి, మాజీ సైనికులు గోపాల రావు, ఎస్ యం అరుణ్, హనుమంత రావు, అనిల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# ఐటీడీఏ పరిధిలోని పాఠశాలల్లో డైట్ అమలుకు ఐటీడీఏ పల్స్ యాప్

**ఉట్నూర్ డిసెంబర్05( సమయం న్యూస్) :** ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని ఐ.టి.డి.ఎ పరిధిలో గల నాలుగు జిల్లాలు ఆదిలాబాదు, నిర్మల్, మంచిర్యాల మరియు ఆసిఫాబాద్ లోని గిరిజన పాఠశాలల్లో/ హాస్టల్ అమలు చేయడానికి ITDA Pulse App ని లాంచ్ చేయడం జరిగింది. ఈ ITDA Pulse App ద్వార HM/HWO లు ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం భోజనం, సాయంత్రం స్నాక్స్ మరియు రాత్రి భోజనం ఫోటోలు అప్లోడ్ చేయడం జరుగుతుంది. ఇప్పటి వరకు HM/HWO లు ఈ App ని మంచిగా ఉపయోగించి ఫొటోస్ అప్లోడ్ చేస్తున్నారు. ఈ ITDA Pulse App ద్వార పెట్టిటటువంటి ఫోటోలు నిత్యం పర్యవేక్షించడం జరుగు తుంది. ఈ లో ఏ వైన సమస్యలు ఉన్నచో ఎప్పటికప్పుడు పరిష్కరించడం జరుగుతుంది మరియు ఆహారంలో నాణ్యత, పరిశుభ్రతను నిర్ధారించడానికి. లు ఫోటోలను అప్లోడ్ చేసిన తర్వాత రోజువారీగా %ూూ% పేషి స్వయంగా పర్యవేక్షిస్తుంది. %" ద్వారా అప్లోడ్ చేసిన ఆహార పదార్థాలను వాటి నాణ్యతను పర్యవేక్షిస్తాయి. వచ్చే విద్యా సంవత్సరం నుండి పూర్తిస్థాయిలో అమలు చేయడం జరుగుతుంది.



# లాన్ టెన్నిస్ కోర్టును ప్రారంభించిన జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్, ఎస్పీ డాక్టర్ వినీత్ ఐపీఎస్



**నారాయణపేట, డిసెంబర్,05(సమయం న్యూస్) :** నారాయణపేట జిల్లా పోలీస్ పరేడ్ మైదానంలో ఆధునిక సదుపాయాలతో నిర్మించిన కొత్త లాన్ టెన్నిస్ కోర్టును జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్,ఎస్పీ డాక్టర్ వినీత్ లు సంయుక్తంగా శుక్రవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పోలీస్ అధికారులు, సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ...పోలీస్ సిబ్బందికి పని ఒత్తిడి ఎక్కువగా ఉండే నేపథ్యంలో శారీరకంగా, మానసికంగా ఆరోగ్యంగా ఉండేందుకు క్రీడలు ఎంతగానో ఉపయోగపడతాయని, ఈ లాన్ టెన్నిస్ కోర్టు వంటి సౌకర్యాలు పోలీసులు మాత్రమే కాదు, వారి కుటుంబ సభ్యులకు, యువతకు కూడా ఎంతో మేలు చేకూరుస్తాయని తెలిపారు. సమగ్ర ఆరోగ్యం కోసం క్రీడలు భాగస్వామ్యం కావడం ఎంతో ప్రోత్సాహకరమని అన్నారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ మాట్లాడుతూ...జిల్లా పోలీస్ సిబ్బంది ఫిట్‌నెస్‌ను మెరుగుపరచడం లక్ష్యంగా పరేడ్ గ్రౌండ్‌లో పలు ఆధునిక సౌకర్యాలు అభివృద్ధి చేస్తున్నామని, వాటిలో భాగంగా లాన్ టెన్నిస్ కోర్టును ఏర్పాటు చేయడం జరిగింది అని తెలిపారు. ఫోర్స్ ఆరోగ్యకరమైన, ఉద్వేగరహిత వాతావరణంలో పని చేస్తే ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించగలరని చెప్పారు. ఎస్పీ పోలీసులు మాత్రమే కాకుండా యువత క్రీడల వైపు మరింత ఆకర్షితులవ్వాలని, క్రీడల ద్వారా క్రమశిక్షణ, టీమ్‌వర్క్, సానుకూల ఆలోచనా ధోరణి పెంపొందుతాయని వివరించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్, ట్రైనీ కలెక్టర్ ప్రణయ్ కుమార్, అదనపు ఎస్పీ ఎండీ రియాజ్ హుల్ హక్, డిఎస్పీ లు నల్లపు లింగయ్య , మహేష్,సీఐలు శివ శంకర్,రాజేందర్ రెడ్డి , సైదులు, నరసింహ, ఎస్సైల వెంకటేశ్వర్లు, కోర్టు క్యూరేటర్ హెడ్ కానిస్టేబుల్ బాలరాజు, అమ్రేష్, పాటు అన్ని శాఖల పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు. కార్యక్రమం అనంతరం అధికారులు కోర్టును సందర్శించి టెన్నిస్ ఆడుతూ సిబ్బందికి ప్రోత్సాహం కల్పించారు.

# ఘనంగా సాయుధ దళాల పతాక దినోత్సవ వేడుకలు

- జిల్లా కలెక్టర్ రాజర్షి షా.



**ఆదిలాబాద్ డిసెంబర్05( సమయం న్యూస్) :** విద్యార్థి దశ నుండే దేశ భక్తి, సేవాభావం అలవర్చుకోవాలని జిల్లా కలెక్టర్ రాజర్షి షా అన్నారు. సాయుధ దళాల పతాక దినోత్సవ వేడుకల్లో బాగంగా శుక్రవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొని క్యాడెట్లకు కలెక్టర్ తన వంతు విరాళాలన్నీ అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, విద్యార్థి దశ నుండే దేశ భక్తి, సేవాభావం అలవర్చుకోవాలని, దేశ రక్షణకు అంకితమైన సైనికుల కుటుంబాల సహాయార్థం ఎన్.సి.సి. క్యాడేట్స్ ఎక్కువ మొత్తంలో విరాళాలు సేకరించాలని సూచించారు. శత్రు దేశాల నుండి రక్షణ కల్పిస్తున్న మన సైనికులకు ఎంత విరాళాలు అందజేసిన తక్కువేనని, ప్రజలందరూ ఈ కార్యక్రమంలో పాల్గొని భాగస్వాములు కావాలనీ పిలుపునిచ్చారు. 5 ఎన్.సి.సి. క్యాడేట్ జట్లు పట్టణంలోని ప్రధాన కూడళ్లలో, ప్రభుత్వ కార్యాలయాలు, అనుభంద సంస్థలు, దుకాణాలు, బస్టాండ్, రైల్వే స్టేషన్ లలో పౌరుల చొక్కాలకు స్టిక్కర్లు అతికించి విరాళాలు సేకరించి సైనిక సంక్షేమ సహాయ నిధి ఖాతాలో జమచేయడం జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా క్యాడెట్ లను కలెక్టర్ అభినందించారు. ఉదార దాతలు తరువాత రోజులలో సైతం డి.డి. లేదా చెక్కు ద్వారా "డైరెక్టర్, సైనిక వెల్ఫేర్, హైదరాబాద్-82," గారి పేరున జమచేయవచ్చని తెలిపారు. 80%+(౦) సెక్షన్ 1961 ఆదాయ చట్టం ప్రకా రం సహాయ నిధి మొత్తానికి పన్ను మినహాయింపు ఉందనీ ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రాంతీయ సైనిక సంక్షేమాధికారి బి. స్రవంతి (ఇంచార్జ్), మాజీ సైనికులు శంకర్ దాస్, దేవన్న, అశోక్, ఎస్.సి.సి. క్యాడేట్స్, అధికారులు, పాల్గొన్నారు.

# ఎన్నికల సమర్థవంతంగా నిర్వహించాలి

- జిల్లా కలెక్టర్
- మొదటి దశ లో ఏకగ్రీవ స్థానాలు, ఉప సర్పంచ్ ఎన్నికల ఫలితాల ప్రకటన
- ఏకగ్రీవ సర్పంచ్ , దశలవారీగా వార్డుల వారీగా
- ప్రత్యేక పర్యవేక్షణ సెల్ నుండి నివేదికల స్వీకరణ
- నామినేషన్ల పై ఇప్పటివరకు అందిన ఫిర్యాదులు , తీసుకున్న చర్యల నివేదికలు
- MCC ఫిర్యాదులు , పరిష్కారము



**కామారెడ్డి డిసెంబర్5( సమయం న్యూస్) :** బ్యాలెట్ పత్రాలు, సర్వీస్ ఓటర్లు, ఓటరు సౌకర్యాల కేంద్రం పలు ఎజెండా అంశాల పై జిల్లాలో జరుగుతున్న స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణ పై సమగ్ర సమీక్ష జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ మినీ సమావేశ మందిరంలో సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.

ఈ సమావేశంలో మొదటి దశలో ఏకగ్రీవ సర్పంచ్, ఉప సర్పంచ్ స్థానాలు, వార్డుల వివరాలను, ప్రత్యేక పర్యవేక్షణ సెల్ నుండి అందిన నివేదికలను సమీక్షించి, ఇప్పటివరకు నామినేషన్ల పై వచ్చిన ఫిర్యాదులు, వాటిపై తీసుకున్న చర్యల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఎన్నికల నియమావళి ఉల్లంఘనలకు సంబంధించిన ఫిర్యాదులు 7 వచ్చాయని, అలాగే బ్యాలెట్ పత్రాలు, సర్వీస్ ఓటర్లు, ఓటరు సౌకర్యాల కేంద్రాల ఏర్పాట్లు ప్రతీ మండలంలో ఎంపిడిఓ కార్యాలయం లో ఏర్పాట్లు చేయాలని, ఎన్నికల విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులు, ఉపాధ్యాయులు, తదితరులు తమ ఓటు హక్కు వినియోగించుకునేందుకు విడతల వారీగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని తెలిపారు ఈ సందర్భంగా ఎన్నికల పారదర్శకత, నిబంధనల అమలు, సమయానుసార చర్యలు తీసుకోవడం వంటి అంశాల పై కలెక్టర్ కీలక సూచనలు చేశారుఈ సమీక్షలో అదనపు కలెక్టర్లు విక్టర్, మదన్ మోహన్, సీఈవో చందర్, వీణ, మురళీ, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు .జిల్లా పౌర సంబంధాల అధికారిణి కామారెడ్డి జిల్లా చే జారీ చేయనైనది.

# భద్రఇల్లందు క్రాస్ రోడ్ వద్ద ఏర్పాటు చేసిన స్టాటిక్ సర్వేలేయన్స్ చెక్ పోస్టును సందర్శించిన జిల్లా ఎస్పీ రోహిత్ రాజు



**ఎల్లందు డిసెంబర్5( సమయం న్యూస్) :** పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల నియమావళి ప్రకారం జరుగుతున్న నామినేషన్ల ప్రక్రియను జిల్లా ఎస్పీ రోహిత్ రాజు పరిశీలించారు. రేగళ్ల గ్రామంలోని పంచాయతీ కార్యాలయం నందు ఏర్పాటు చేసిన నామినేషన్ కేంద్రాన్ని శుక్రవారం ఎస్పీ సందర్శించారు. అక్కడ విధులలో ఉన్న పోలీస్ అధికారులు,ఎన్నికల అధికారులను నామినేషన్ ప్రక్రియ సరళిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఇల్లందు క్రాస్ రోడ్డు వద్ద వాహన తనిఖీలు చేపడుతున్న స్టాటిక్ సర్వేలేయన్స్ చెక్పోస్టును సందర్శించారు. అక్కడ వాహన తనిఖీల వివరాల రిజిస్టర్ ను ఎస్పీ తనిఖీ చేశారు. ఓటర్లను ప్రలోభ పెట్టే విధంగా నగదు,మద్యం,మరే ఇతర వస్తువులను అక్రమ రవాణాకు ప్రయత్నించే వారిపై ఎన్నికల నియమావళి ప్రకారం కేసులు నమోదు చేయాలని అధికారులకు సూచించారు. ప్రతీ వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేసి,అట్టి వాహనాల వివరాలను కచ్చితంగా నమోదు చేయాలని సూచించారు. జిల్లా వ్యాప్తంగా ఏర్పాటు చేసిన అన్ని చెక్పోస్టుల వద్ద నిత్యం వాహన తనిఖీలు చేపట్టడం జరుగుతుందని ఈ సందర్భంగా ఎస్పీ తెలిపారు. ఈ కార్యక్రమంలో చుంచుపల్లి సిఐ వెంకటేశ్వర్లు,లక్ష్మీదేవిపల్లి ఎస్సై రమణా రెడ్డి,తదితరులు పాల్గొన్నారు

# పకడ్బందీగా ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి చేయాలి

- సాధారణ ఎన్నికల పరిశీలకులు ఖర్తడే కాళీచరణ్ సుదామా రావు



**ఖమ్మం, డిసెంబర్ 5: ( సమయం న్యూస్ ):** పంచాయతీ ఎన్నికలు పగడ్బందీగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని సాధారణ ఎన్నికల పరిశీలకులు ఖర్తడే కాళీ చరణ్ సుదామా రావు అన్నారు. సాధారణ ఎన్నికల పరిశీలకులు, రఘునాథపాలెం మండల ఎంపీడీవో కార్యాలయాన్ని, పోలింగ్ కేంద్రాలను శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సాధారణ ఎన్నికల పరిశీలకులు ఖర్తడే కాళీచరణ్ సుదామా రావు మాట్లాడుతూ ఎన్నికల కమీషన్ మార్గదర్శకాల ప్రకారం పోలింగ్ నిర్వహణకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు. రిటర్నింగ్ అధికారులు సైలెన్స్ పీరియడ్ లో పాటించాల్సిన నిబంధనలపై రాజకీయ పార్టీల ప్రతినిధులకు, అభ్యర్థులకు సమాచారం అందించాలని, స్థానికేతరులు వెళ్లేలా చూడాలని అన్నారు. పోలింగ్ నిర్వహణకు డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్ కేంద్రాలను కట్టుదిట్టంగా ఏర్పాటు చేయాలని, విధులు నిర్వహించే పోలింగ్ సిబ్బందికి అవసరమైన ఏర్పాట్లు కల్పించాలని అన్నారు. పోలింగ్ రోజు పోలింగ్ సిబ్బంది సకాలంలో పోలింగ్ కేంద్రాలకు చేరుకోవాలని, పోలింగ్ సజావుగా జరిగే విధంగా విధులు నిర్వహించాలని, వల్నరబుల్ పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని అన్నారు. పోలింగ్ కేంద్రాలలో వెబ్ కాస్టింగ్ నిర్వహించాలని అన్నారు. ఈ పర్యటనలో పరిశీలకుల వెంట రఘునాధపాలెం మండల తహసీల్దార్ శ్వేత, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# ఉంగరం గుర్తుకు ఓటు వేయండి.. అభివృద్ధిని స్వాగతించండి.

- మంతూర్ గ్రామ సర్పంచ్ అభ్యర్థి పర్వేజ్ అహ్మద్.



**రాయపోల్,,డిసెంబర్ 5 :** రాయపోల్ మండలం మంతూర్ గ్రామ ప్రజలు ఉంగరం గుర్తుకు ఓటు వెయ్యండి...గ్రామ అభివృద్ధిని స్వాగతించండి అంటూ సర్పంచ్ అభ్యర్థి పర్వేజ్ అహ్మద్ అన్నారు. శుక్రవారం ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంతూర్ గ్రామం లో ఎలాంటి సమస్య ఎదురైనా ప్రజలకు అందుబాటులో ఉంటూ ఆపద,సంపద లో అందరికీ అందుబాటులో ఉంటానన్నారు. గతంలో సర్పంచ్ గా పోటీ చేసి ఓడిపోయినప్పటికీ ప్రజల మధ్యనే ఉంటూ కులమత బేధాలు లేకుండా అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించానన్నారు. ప్రజల మధ్యలోనే ఉంటూ ప్రజల సమస్యలు ఎప్పటికప్పుడు పరిష్కరిస్తానన్నారు. గతంలో మా నాన్న అలీముద్దీన్ సర్పంచ్ గా మంతూర్ గ్రామానికి ఎంతో సేవ చేశారన్నారు. పోయిన సంవత్సరం మహంకాళమ్మ గుడికి రూ.లక్ష విరాళం అందజేశానన్నారు. మహంకాళమ్మ గుడి పునర్నిర్మాణం కోసం తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని అలాగే మండల కో ఆప్షన్ సభ్యులుగా ప్రజలకు సేవ చేస్తూ ప్రజల ఆదరాభిమానాలు పొందానని,ప్రజల మద్దతు తనకే ఉన్నదని విశ్వాసం వ్యక్తం చేశారు. తనను గెలిపిస్తే గ్రామాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి చేసి చూపిస్తామన్నారు. ఈ నెల 11 న జరిగే సర్పంచ్ ఎన్నికల్లో ఉంగరం గుర్తుకు ఓటు వేసి బారి మెజారిటీతో గెలిపించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. సర్పంచ్ గా గెలుపొందిన వెంటనే మహంకాళి అమ్మ గుడి పునర్నిర్మాణ పనులు చేస్తానని హామీ ఇస్తున్నానన్నారు.

# మొదటి విడత ఎన్నికల విధులు నిర్వహించే అధికారుల తొలి దశ ర్యాండమైజేషన్ పూర్తి.

- జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ పర్యవేక్షణలో పకడ్బందీగా సాగిన ర్యాండమైజేషన్ ప్రక్రియ.



**నిర్మల్ డిసెంబర్5( సమయం న్యూస్) :** కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో శుక్రవారం ర్యాండమైజేషన్ ప్రక్రియ పూర్తి చేశారు. మొదటి విడతలో గ్రామ పంచాయతీ ఎన్నికల విధులు నిర్వహించే అధికారులకు తొలి దశ ర్యాండమైజేషన్ మండలాల వారిగా నిర్వహించారు. ఈ ర్యాండమైజేషన్ ప్రక్రియలో జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ పాల్గొన్నారు. ర్యాండమైజేషన్ ప్రక్రియ అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాల్లో ఎన్నికల విధులు నిర్వహించేందుకు సరిపడినంత మంది పిఓ, ఓపిఓ లను నియమించనున్నారు. ఎన్నికల నిర్వహణకు సిబ్బంది అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. అవసరానికి 20 శాతం అదనంగా అధికారులను నియమించుకున్నట్లు పేర్కొన్నారు. దీనిద్వారా ఎన్నికల నిర్వహణలో అధికారుల కొరత తలెత్తకుండా ఉంటుందని అన్నారు.

ఈ ర్యాండమైజేషన్ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్, డిపిఓ శ్రీనివాస్, డిఈఓ భోజన్న, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# కడుపునొప్పి భరించలేక యువతి ఆత్మహత్య.



**రాయపోల్, డిసెంబర్ 5:** కడుపునొప్పి భరించలేక యువతి పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్న సంఘటన రాయపోల్ పోలీస్ స్టేషన్ పరిధిలో శుక్రవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం రాయపోలు మండలం రాంసాగర్ గ్రామానికి చెందిన బొమ్మని నవనీత(25). గతవారం రోజులుగా కడుపునొప్పితో బాధపడుతూ ఉండగా, బుధవారం కడుపునొప్పితీవ్రం గా రావడంతో ఆ నొప్పిని భరించలేక మనస్థాపానికి గురై ఏదో గుర్తుతెలియని గడ్డి మందు తాగింది. ఈ విషయం మర్నాడు శుక్రవారం తల్లిదండ్రులకు తెలుపగా వెంటనే గజ్వేల్ లోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం హైదరాబాదులోని యశోద ఆసుపత్రికి తరలించి అక్కడి నుండి తిరిగి ఆర్ వి ఎం లక్ష్మక్క పల్లి ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందింది. మృతురాలు తల్లి పుల్ల లక్ష్మి రాయపోల్ పోలీసులకు ఫిర్యాదు చేయగా ఏఎస్ఐ కృష్ణంరాజు కేసు నమోదు చేసి స్థానిక ఎమ్మార్వో కృష్ణమోహన్ సమక్షంలో శవ పరీక్ష నిర్వహించారు.

## గ్రామ పంచాయతీ ఎన్నికల దృష్ట్యా అక్రమ మద్యం అమ్మకాలను నిఘా పెట్టండి



**మహబూబ్ నగర్ డిసెంబర్5( సమయం న్యూస్):** అదనపు కలెక్టర్ రెవెన్యూ మధుసూదన్ నాయక్ జిల్లా ప్రొహిబిషన్ మరియు ఎక్సైజ్ అధికారి సుధాకర్ మరియు అడిషనల్ ఎక్సైజ్ సూపర్డెంట్ నరసింహారెడ్డి మరియు మండల స్థాయి సిఐలు ఎస్సై లతో కలిసి తన ఛాంబర్ లో మీటింగ్ తీసుకోవడం జరిగింది టి మీటింగ్లో జిల్లాలోని అన్ని బెల్ట్ షాపుల ను మూసి వేసే విధంగా తగు చర్యలు తీసుకోవాలని. ఏ ఫోర్ షాపులలో ఎక్కువ మొత్తంలో ఐ ఎం ఎల్ మరియు బీర్ అమ్మకుండా పర్యవేక్షణ చేయాలని అనుమతించబడిన పరిమాణానికి మించి బల్క్ లీటర్లను విక్రయించవద్దని అన్ని %ఖ%4 దుకాణాలకు నోటీసులు జారీ చేయాలని ఎక్సైజ్ అధికారులకు ఆదేశించడం జరిగింది అలాగే ఎన్నికల సందర్భంగా సిబ్బంది అందరూ గ్రామస్థాయిలో విస్తృతంగా పర్యటించి తగు జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పడం జరిగింది ప్రతిరోజు ఎన్ని కేసులు నమోదయినవి పూర్తి వివరాలు జిల్లా ఎన్నికల అధికారి సెల్ కు అందించే విధంగా తగు చర్యలు తీసుకోవాలని ఈ సమావేశంలో నిర్ణయించడం జరిగింది.

## రెండవ విడత గ్రామ పంచాయతీ ఎన్నికలకు అన్ని ఏర్పాట్లు చేయాలి .

- జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి



**మహబూబ్ నగర్ డిసెంబర్5( సమయం న్యూస్) :** శుక్రవారంమిడ్జిల్ మండలం ఎం పి.డి.ఓ కార్యాలయం లో తహసీల్దార్,ఎం.పి.డి.ఓ,పంచాయతీ కార్యదర్శులతో ఎన్నికల ఏర్పాట్లపై చర్చించి సూచనలు చేశారు.స్ట్రాంగ్ రూమ్ ను , బ్యాలెట్ బాక్స్ లను పరిశీలించారు.

పోలింగ్ మెటీరియల్ డిస్ట్రిబ్యూషన్ సెంటర్ ఎం.పి.డి. ఓ కార్యాలయ ఆవరణ లో ఏర్పాటు చేయనున్న దృష్ట్యా పోలింగ్ మెటీరియల్ పంపిణీ కౌంటర్ లు ఏర్పాటు,వెహికల్ పార్కింగ్,బోజన ఏర్పాట్లను మ్యాప్ ద్వారా కలెక్టర్ కు ఎం.పి.డి. ఓ వివరించారు.కలెక్టర్ తో పాటు తహశీల్దార్ పులి రాజు, ఎం.పి.డి. ఓ గీతాంజలి తదితరులు ఉన్నారు

## నేడు ఎల్ హెచ్ పి ఎస్ కార్యాలయంలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ వర్ధంతి

- రాష్ట్ర అధ్యక్షుడు బానోతు బద్రు నాయక్



**ఖమ్మం , డిసెంబర్ 5 : ( సమయం న్యూస్ )** భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్ అంబేద్కర్ వర్ధంతిసభ శనివారం ఖమ్మం నగరంలోని ఎల్ హెచ్ పి ఎస్ ( లంబాడి హక్కుల పోరాట సమితి ) జిల్లా కార్యాలయంలో నిర్వహించనున్నట్లు శుక్రవారం ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బానోతు బద్రు నాయక్ఒక ప్రకటనలో తెలిపారు. వివిధ కుల, ప్రజా సంఘాల నాయకులు , బహుజన సంఘాల నాయకులు,మానవ హక్కుల కార్యకర్తలు , సామాజికవేతలు కార్యక్రమంలో పాల్గొని , భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి , నివాళులు అర్పిస్తారని పేర్కొన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో భారత రాజ్యాంగ పరిరక్షణ గురించి ప్రతిజ్ఞలు చేస్తారని తెలిపారు. ఈ సందర్భంగా నే రాజ్యాంగ పరిరక్షణతో పాటు ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామిక వ్యవస్థగా మన దేశం పేరుగాంచిన నేపథ్యంలో ప్రస్తుత పరిణామాలు మన ప్రజాస్వామ్యాన్ని పరిహాసించే ,తూట్లుహొడిచే విధంగా జరుగుతున్న నిత్య సంఘటనలపై ఒక ఆలోచన చేస్తారని తన ప్రకటనలో బానోతు బద్రు నాయక్ తెలి పా రు.

## ఉద్యాన మరియు పట్టు పరిశ్రమ శాఖ సంచాలకులు యాస్మీన్ బాషా శుక్రవారం వికారాబాద్ జిల్లాలో క్షేత్ర పర్యటన.

- ఈ పర్యటనలో భాగంగా, వికారాబాద్ మండలంలోని ఆలంపల్లి,
- నారాయణపూర్, పూలమద్ది గ్రామాలను సందర్శించారు.



**వికారాబాద్ మండలం, డిసెంబర్,05(సమయం న్యూస్) :** ఆలంపల్లి గ్రామం: 12.5 ఎకరాలలో ఆయిల్ పామ్ పంట సాగిస్తున్న రైతు మేకల చంద్రశేఖర్ రెడ్డి పంట పొలాన్ని సందర్శించారు.పంట సస్యరక్షణ మరియు నిర్వహణపై రైతుకి సూచనలు మరియు సలహాలు ఇచ్చారు.నారాయణపూర్ గ్రామం: పసుపు, క్యారెట్, మరియు పందిరి పద్ధతిలో సాగు చేస్తున్న రైతు మోహన్ రెడ్డి పంట పొలాన్ని సందర్శించి, పంట సాగు పద్ధతులు, మద్దతు వివరాలు అడిగి తెలుసుకున్నారు.నారాయణపూర్ గ్రామం లోని ప్రైవేట్ కూరగాయ నర్సరీను సందర్శించి, రైతులకు నాణ్యమైన కూరగాయ నారును సరఫరా చేయాలని సూచించారు.పూలమద్ది గ్రామం: బంద్ ఆలి సాగు చేస్తున్న బంతి పూలతోట మరియు డ్రాగన్ ఫ్రూట్, చామగడ్డ పంటలు సాగిస్తున్న నరసింహ రెడ్డి పంట పొలాలను పరిశీలించారు. పంట రక్షణపై రైతులకు సూచనలు మరియు సలహాలు ఇచ్చారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఉద్యాన మరియు పట్టు పరిశ్రమ శాఖ అధికారి ఎం.ఏ సత్తార్, ఉద్యోగి శ్రీమతి యమునా, HEO ఆంజనేయులు మరియు Ecopalm కంపెనీ ప్రతినిధులు కూడా పాల్గొన్నారు.

# నామినేషన్ పక్రియాను పలు మండలాల్లో పరిశీలించిన జిల్లా కలెక్టర్ హైమావతి.

**సిద్దిపేట డిసెంబర్5( సమయం న్యూస్). :** 2వ సాధారణ గ్రామ పంచాయతీ ఎన్నికలు - 2025 ప్రక్రియలో భాగంగా శుక్రవారం జిల్లా ఎన్నికల అధికారి జిల్లా కలెక్టర్ కె హైమావతి పలు పర్యటనలు..మద్దూరు మండలంలోని మద్దూరు, రేబర్తి గ్రామాలు..దుల్మిట్ట మండలంలోనీ బైరాన్ పల్లి, దుల్మిట్ట, కొండాపూర్ గ్రామాలు మరియు అక్కన్న పెట మండలంలో రామవరం గ్రామపంచాయతిల లో నామినేషన్ ప్రక్రియను జిల్లా ఎన్నికల అధికారి క్షేత్రస్థాయి-ంలో పరిశీలించారు.మద్దూరు క్లస్టర్ లో మద్దూరు, గాగిల్లాపూర్, నర్సాయి పల్లి. రేబర్తి క్లస్టర్ లో రేబర్తి, వంగపల్లి, వల్లాం పట్ల. బైరాన్ పల్లి క్లస్టర్ లో బైరాన్ పల్లి, బెక్కల్, తోర్నాల.దుల్మిట్ట క్లస్టర్ లో దుల్మిట్ట, జాలపల్లి, లింగాపూర్. కొండాపూర్ క్లస్టర్ లో కొండాపూర్, కోటిగల్, దుబ్బతండ, హనుమ తండా, రెడ్నాయక్ తండా.రామవరం క్లస్టర్ లో రామవరం, పోతారం జె, కపూర్ నాయక్ తండా, నందరం, సేవాలాల్ మహరాజ్ తండాగ్రామాల నామినేషన్ స్వీకరిస్తునట్లు అధికారులు కలెక్టర్ కి తెలిపారు.జిల్లా ఎన్నికల అధికారి మాట్లాడు తూ... స్టేట్ ఎలక్షన్ కమిషన్ నియమావళి అనుసరిస్తూ జిల్లాలో 3 విడత నామినేషన్ ప్రక్రియ 9 మండలాల్లో ఈ రోజు ఆఖరు కావున ఆయా క్లస్టర్ లలో ఎక్కువ నామినేషన్ దాఖలు చేయడానికి వచ్చే అవకాశం ఉన్నందున అధికారులు తగిన ఏర్పాట్లు చేసుకోవాలని తెలిపారు. నామినేషన్లు ఆఖరు



రోజు కావున ఆయా క్లస్టర్ ల వద్ద అభ్యర్థుల తాకిడి ఎక్కువగా ఉన్నందున సాయంత్రం 5 వరకు అభ్యర్థులకు సీరియల్ ప్రకారం టోకెన్ లు లైన్ లో ఉంచాలని, 5 తర్వాత ఎవ్వరిని అనుమతించకూడదని పంచాయతీ సెక్రటరీలను ఆదేశించారు. అర్ ఓ, ఏఅర్ఓ రిజర్వ్ సిబ్బంది తో రెండు లేదా మూడు కౌంటర్ లు పెట్టీ నామినేషన్లు తీసుకోవాలని ఆదేశించారు. క్లస్టర్ లో 100 మీటర్ల చుట్టు గుంపులు గుంపులుగా పబ్లిక్ ఉన్నందున ఆగ్రహం వ్యక్తం చేశారు. నామిని అభ్యర్థితో పాటు ఇద్దరిని మాత్రమే లోపలికి అనుమతించాలని చుట్టూ 100 మీటర్ల మేర ఎలాంటి వాహనాల పార్కింగ్ 144 సెక్షన్ పగడ్బందిగా బందోబస్తు నిర్వహించాలని పోలీస్ అధికారులను ఆదేశించారు. నామిని అభ్యర్థులు ర్యాలీగా ఎక్కువ మందితో క్లస్టర్ కి వస్తె మెడల్ కోడ్ కండక్ట్ ఉల్లంగల కింద అభ్యర్థిపై చట్ట పరమైన చర్యలు తీసుకోవాలని కమిషనర్ ఆఫ్ పోలీస్ ను ఫోన్ ద్వారా ఆదేశించారు.

# అధికారులు గ్రామ పంచాయతీ ఎన్నికలను పారదర్శకంగా, భాద్యతగా నిర్వహించాలి

- జిల్లా ఎన్నికల సాధారణ పరిశీలకులు రవి నాయక్.

**సూర్యాపేట డిసెంబర్5( సమయం న్యూస్)? :** గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లలో భాగంగా పోలింగ్ సిబ్బంది కి ర్యాండమైజేషన్ ప్రక్రియను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ తో కలిసి సాధారణ పరిశీలకులు రవి నాయక్ నిర్వహించారు.

కలెక్టరెట్ లోని విసి హాల్ లో ఎన్నికల సంఘం నిబంధనల మేరకు గురువారం ర్యాండమైజేషన్ జరిపించారు. మొదటి విడత ఎన్నికలు జరిగే ఆత్మకూరు ఎస్, సూర్యాపేట, జాజిరెడ్డిగూడెం, నాగారం, నూతనకల్, మద్దిరాల, తిరుమలగిరి, తుంగతుర్తి మండలాల్లో లోని ఆయా గ్రామ పంచాయతీల సర్పంచ్, వార్డు స్థానాలకు ఎన్నికల పోలింగ్ విధులు నిర్వర్తించే ప్రిసైడింగ్ అధికారులు, ఓ.పీ.ఓలను ర్యాండమైజేషన్ ద్వారా కేటాయించారు. స్థానికత, విధులు నిర్వర్తిస్తున్న మండలం తదితర అంశాలను పరిగణనలోకి తీసుకుని, సిబ్బందికి పోలింగ్ విధులను కేటాయించారు. జిల్లాలో మొదటి విడత లో 159



గ్రామ పంచాయతీల సర్పంచ్, 1442 వార్డు స్థానాలకు ఎన్నికల నిర్వహణ కోసం 20 శాతం రిజర్వ్ సిబ్బంది కలుపుకుని ప్రిసైడింగ్ అధికారులు 1683, ఓ.పీ.ఓలు 2260 పోలింగ్ కోసం ర్యాండమైజేషన్ జరిపారు. ఈ ర్యాండమైజేషన్ ప్రక్రియలో అదనపు కలెక్టర్ కే. సీతారామారావు, జడ్పీ సి ఈ ఓ వి వి అప్పారావు,డీపీఓ యాదగిరి, డి ఎల్ పి ఓ నారాయణ రెడ్డి, అధికారులు, తదితరులు పాల్గొన్నారు

# క్రీడలు వ్యక్తిత్వాన్ని మెరుగుపరుస్తాయి,

- గెలుపు-ఓటములను సమానంగా స్వీకరించాలి
- జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ ఐపీఎస్

**నారాయణపేట,మున్సిపల్(మం)డిసెంబర్,05(సమయం న్యూస్) :** నారాయణపేట జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఫ్రెండ్లీ మెగా క్రికెట్ టోర్నమెంట్ ఉత్సాహభరితంగా ముగిసింది. ఫైనల్ మ్యాచ్ అనంతరం విజేత మక్తల్ జట్టుకు,రన్నర్ టీమ్ మరికల్ జట్టుకు క్యాష్ ప్రైజ్ తో పాటు కప్‌లను జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ అందజేశారు.ఈ టోర్నమెంట్లో మొత్తం జిల్లా పరిధిలోని 12 పోలీస్ స్టేషన్లో పరిధిలోని 24 యువకుల టీంలు మరియు రెవెన్యూ, మీడియా, డాక్టర్స్, పోలీస్ టీమ్స్ పాల్గొన్నడం జరిగింది.ఈ సందర్భంగా ఎస్పీమాట్లాడుతూ... క్రీడలు మనిషిలో క్రమశిక్షణ, ఓర్పు, సహనం, నాయకత్వ లక్షణాలు పెంపొందిస్తాయని తెలిపారు. క్రీడల్లో గెలుపు-ఓటములు సహజమని, ముఖ్యంగా ఫలితాన్ని ఎలా స్వీకరిస్తామన్నదే ముఖ్యమని చెప్పారు.గెలుపు%-%ఓటములను సమానంగా అంగీకరించే స్పోర్ట్స్ మెన్‌షిప్ ప్రతి క్రీడాకారుడిలో అవసరమని పేర్కొన్నారు.అలాగే పోలీసు సిబ్బంది, యువత క్రీడల్లో చురుకుగా పాల్గొనడం ద్వారా శారీరక-మానసిక ఆరోగ్యం మెరుగుపడి, ఒత్తిడి తగ్గి, స్నేహభావం పెరుగుతుందని తెలిపారు. యువత క్రీడల వైపు దృష్టి సారించాలని, శాంతి భద్రతల పరిరక్షణలో పోలీసులు యువతను భాగస్వామ్యులను చేసుకుం టూ పనిచేస్తున్నామని ఎస్పీ తెలిపారు."ప్రతి యువకుడు యూనిఫాం లేని పోలీస్అని గుర్తించుకోవాలని, సమాజ శ్రేయస్సు కొరకు యువత పాటుపడాలని



సూచించారు.భవిష్యత్తులో ప్రతి సంవత్సరం నవంబర్ నెలలో ఈ క్రికెట్ టోర్నమెంట్ తప్పకుండా నిర్వహించాలని పోలీసు అధికారులకు ఎస్పీ ఆదేశాలు జారీ చేశారు.విజేతలకు ప్రథమ బహుమతి ₹10,000/- %-%సునందా హాస్పిటల్స్ డాక్టర్ ప్రసాద్ శెట్టి స్పాన్సర్ చేశారు.రన్నర్స్‌కు ₹5,000/- మరియు షీల్డ్ %-% కిడ్స్ హాస్పిటల్ డా. మధుసూదన్ రెడ్డి స్పాన్సర్ చేశారు.టోర్నీ మొత్తంలో ప్రతి రోజు క్రీడాకారులకు భోజనం అందించిన లయన్స్ క్లబ్ టీమ్ మెంబర్సుకు మరియు స్పాన్సర్స్ చేసిన డాక్టర్స్ నీ ఎస్పీ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

మ్యాచ్ వివరాలు...మొదట బ్యాటింగ్ చేసిన మరికల్ టీమ్ %-% 10 ఓవర్లలో 84/7 చేశారు.మక్తల్ టీమ్ %-% 8.2 ఓవర్లలో 85 రన్స్ చేసి విజయం సాధించారు.బెస్ట్ బ్యాట్స్‌మన్: హనుమంతు కృష్ణ మండలం.బెస్ట్ బౌలర్: సురేష్ (మరికల్)మాన్ ఆఫ్ ది సిరీస్: సురేష్ (మరికల్) విజయవంతంగా నిర్వహించిన ఆర్గనైజింగ్ టీమ్‌ను అభినందించారు.మొత్తం 24 టీమ్సు మీడియా, రెవెన్యూ, పోలీసు, డాక్టర్స్ సహా పెద్ద ఎత్తున పాల్గొన్నాయి.ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఎండీ రియాజ్ హుల్ హక్, డీఎస్పీ లు నల్లపు లింగయ్య, మహేష్, డాక్టర్స్ ప్రసాద్ శెట్టి, మధుసూదన్ రెడ్డి,సీఐ లు శివశంకర్, రామ్ లాల్, రాజేందర్ రెడ్డి, సైదులు, ఎస్సైలు, %రాజు% రమణ, వివిధ మండలంలోని క్రీడాకారులు పాల్గొన్నారు.

## భీంగల్ కేజీబీవీలో యుద్ధ ప్రాతిపదికన నీటి సమస్యకు పరిష్కారం

**నిజామాబాద్, డిసెంబర్ 05 ( సమయం న్యూస్) :** భీంగల్ మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో నీటి కొరతను పరిష్కరించేందుకు యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకున్నామని జిల్లా విద్యా శాఖ అధికారి పి.అశోక్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కేజీ బీ వీ పాఠశాలలో సరిపడా నీటి వసతి అందుబాటులో లేక విద్యార్థినులు ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయం తెలిసిన వెంటనే జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు తక్షణ చర్యలు చేపట్టామని అన్నారు. కస్తూర్బా పాఠశాలలో పై అంతస్తు వరకు నీరు చేరేలా పైప్ లైన్ నిర్మాణం, మరమ్మతు పనులను జరిపించడంతో పాటు, నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేలా కొత్తగా బోరుబావి తవ్వించడం జరిగిందన్నారు. కాగా, కేజీబీవీలో నెలకొన్న నీటి సమస్య పరిష్కారం విషయమై సకాలంలో స్పందించని పాఠశాల స్పెషల్ ఆఫీసర్ కు వివరణ కోరుతూ, మెమో జారీ చేశామని డీ.ఈ.ఓ తెలిపారు.

# వలస కూలీల పిల్లలను గుర్తించండి

- ప్రతి ఒక్కరిని బడిలో చేర్పించాలి
- వారి చదువుకు అన్ని విధాలా చర్యలు
- ఇటుక బట్టీల యజమానులు సహకరించాలి
- జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి




**కరీంనగర్ డిసెంబర్5( సమయం న్యూస్). :** జిల్లావ్యాప్తంగా వలస కూలీలు, కార్మికుల పిల్లలను గుర్తించి వారిని ప్రత్యేక పాఠశాలల్లో చేర్పించాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో మండల విద్యాధికారులు, ఇటుక బట్టీలు, పరిశ్రమల యజమానులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ సాధారణంగా వలస కూలీలు ఎక్కువగా పనిచేసే చోటే వర్క్ సైట్ స్కూళ్లు ప్రారంభిస్తారని తెలిపారు. కానీ పిల్లలకు పాఠశాల వాతావరణం ఉండాలనే ఉద్దేశంతో వారి కుటుంబాలకు సమీపంగా ఉన్న పాఠశాలల్లో ప్రత్యేక తరగతిలో బోధిస్తున్నామని అన్నారు. ఇటుక బట్టీలు, పరిశ్రమల్లో పనిచేస్తున్న కార్మికుల పిల్లలను గుర్తించి ఈ బడిలో చేర్పించాలని ఆదేశించారు. వారికి పోషకాహారం, దుస్తులు, పుస్తకాలు అందిస్తామని తెలిపారు. ఇటుక బట్టీల యజమానులు వారి సాయంగా పిల్లలకి రవాణా సౌకర్యం కల్పించాలని కోరారు. గత ఏడాది సుమారు 500 మంది వలస కూలీల పిల్లలను ఈ పాఠశాలల్లో చేర్పించి విద్య అందించిన విషయాన్ని గుర్తు చేశారు. ఈ ఏడాది మరింత శ్రద్ధతో ప్రత్యేక పాఠశాలలపై దృష్టి పెట్టాలని అన్నారు. ప్రత్యేక పాఠశాలల్లో చేరిన వలస కార్మికుల పిల్లలకి ఇంగ్లీషులో బోధించాలని సూచించారు. భవిష్యత్తులో వారికి చదువు పట్ల శ్రద్ధ పెరిగి ఎక్కడికి వెళ్ళినా చదువుకునే ఉత్సాహం ఉండేలా తీర్చిదిద్దాలని సూచించారు. బడి బయట ఉన్న పిల్లలను కూడా గుర్తించి బడిలో చేర్పించాలని అన్నారు. ఇప్పటికే 185 మంది పిల్లలను గుర్తించినట్లు విద్యాధికారులు తెలిపారు.

### పదవ తరగతి విద్యార్థులపై దృష్టి పెట్టాలి

పదవ తరగతి చదువుతున్న విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించి నూరు శాతం ఫలితాలు వచ్చేలా చూడాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి మండల విద్యాధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశం మందిరంలో మండల విద్యాధికారులతో నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి పదవ తరగతి విద్యార్థి పై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని అన్నారు. ప్రత్యేక అధికారులు పదో తరగతి విద్యార్థులకు నిర్వహిస్తున్న స్పెషల్ క్లాస్ లను పర్యవేక్షించాలని ఆదేశించారు. ఎప్పటికప్పుడు స్లిప్ టెస్టులు నిర్వహిస్తూ బోర్డు పరీక్షలకు సిద్ధం చేయాలన్నారు. మండల విద్యాధికారులు వారానికి రెండు సార్లు ఎస్సీ, ఎస్టీ, బీసీ సంక్షేమ వసతి గృహాలను సందర్శించాలని ఆదేశించారు. విద్యాశాఖ ఆధ్వర్యంలోని పూర్వ ప్రాథమిక పాఠశాలల్లో కనీసం 20 మంది పిల్లల నమోదు తప్పనిసరిగా ఉండాలని అన్నారు. అన్ని పాఠశాలలకు మధ్యాహ్న భోజనం వండేందుకు గ్యాస్ కనెక్షన్లు ఇచ్చామని వాటిని విధిగా ఉపయోగించాలని పేర్కొన్నారు. స్నేహిత ఫిర్యాదుల పెట్టెలను ప్రతి పాఠశాలలో తప్పక నిర్వహించాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా విద్యాధికారి మొండయ్య, విద్యాశాఖ క్వాలిటీ కోఆర్డినేటర్ అశోక్ రెడ్డి, మండల విద్యాధికారులు పాల్గొన్నారు.

# సాయుధ దళాల పతాక దినోత్సవ ర్యాలీని ప్రారంభించిన కలెక్టర్

**నిజామాబాద్, డిసెంబర్ 05( సమయం న్యూస్).:** సాయుధ దళాల పతాక దినోత్సవ కార్యక్రమాన్ని పురస్కరించుకుని ప్రాంతీయ సైనిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం నుండి చేపట్టిన ర్యాలీని కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి జెండా ఊపి ప్రారంభించారు. మాజీ సైనికులు, సైనికులు, వారి కుటుంబాల సంక్షేమం కోసం ఉద్దేశించిన సహాయ నిధికి విరాళం అందజేశారు. ఈ సందర్భంగా ఎన్.సీ.సీ క్యాడెట్లు, ఆర్మీ అధికారులు, సిబ్బంది జిల్లా పాలనాధికారికి సంప్రదాయబద్ధంగా స్వాగతం పలికి, గౌరవ వందనం సమర్పించారు. అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్ కుమార్ లతో పాటు కలెక్టరేట్ లోని వివిధ శాఖల అధికారులు, ఉద్యోగులు సైనిక సంక్షేమ నిధికి తమవంతుగా విరాళాలు అందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, దేశ రక్షణ కోసం సాయుధ దళాలకు చెందిన సైనికులు తమ ప్రాణాలను లెక్క చేయకుండా కుటుంబ సభ్యులకు దూరంగా ఉంటూ, రేయింబవళ్లు శ్రమిస్తున్నారని అన్నారు. వారి కృషి వల్లే మనమంతా ప్రశాంత వాతావరణంలో దైనందిన జీవనాలు వెళ్లదీస్తున్నామని అన్నారు. సైనికుల త్యాగాలను ప్రతి పౌరుడు గుర్తిస్తూ, వారి పట్ల, వారి సేవల పట్ల గౌరవభావంతో మెలగాలని, సాయుధ దళాలకు మద్దతుగా నిలువాలని పిలుపునిచ్చారు. వారి గౌరవార్థం




ప్రతి ఏటా జరిపే సాయుధ దళాల పతాక దినోత్సవ ర్యాలీ కార్యక్రమాన్ని వచ్చే ఏడాది నుంచి మరింత అట్టహాసంగా నిర్వహించాలని, అన్ని వర్గాల వారిని భాగస్వాములు చేయాలని కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రాంతీయ సైనిక సంక్షేమ శాఖ అధికారి రవీందర్, మాజీ సైనికుల సంక్షేమ సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

# మహిళా-శిశు అభ్యున్నతికి కేంద్ర పథకాల అమలు అత్యంత కీలకం

- రాష్ట్రంలో మహిళల సాధికారత, బాలల సంక్షేమం, పోషణ మరియు మహిళల రక్షణ సేవల అమలుపై
- కేంద్రం తీసుకున్న చర్యల గురించి వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య ప్రశ్నించారు
- ఎంపీ డా.కడియం కావ్య




**న్యూ డిల్లీ డిసెంబర్5( సమయం న్యూస్) :** మహిళల సాధికారత, బాలల సంక్షేమం, పోషణ, మహిళల రక్షణ సేవల అమలు రాష్ట్ర పురోగతికి కీలకమని వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య అన్నారు. ఈ అంశాలపై లోక్‌సభలో వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య అడిగిన ప్రశ్నకు కేంద్ర మహిళా మరియు శిశు అభివృద్ధి శాఖ సహాయ మంత్రి సావిత్రి ఠాకూర్ సమాధానం ఇచ్చారు. బేటీ బచావో బేటీ పడావో , మహిళా శక్తి కేంద్రం, అంగ న్వాడీ-పోషణ 2.0, వన్ స్టాప్ సెంటర్లు, 181 హెల్ప్‌లైన్ వంటి కార్యక్రమాల అమలును శాఖ నిశితంగా పర్యవేక్షిస్తున్నట్లు మంత్రి తెలిపారు. పథకం వల్ల బాలికల విద్య, రక్షణ, నైపుణ్యాభివృద్ధిలో గణనీయ పురోగతి కనిపిస్తోందని చెప్పారు. తెలంగాణలోని అన్ని జిల్లాల్లో ఈ పథకం అమలులో ఉందని పేర్కొన్నారు. 2022లో నిలిపివేసిన మహిళా శక్తి పథకానికి బదులుగా 'మిషన్ శక్తి' అమలు చేస్తున్నట్లు తెలిపారు. ఇందులో మహిళల భద్రత, రక్షణ, సాధికారతపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు చెప్పారు. వరంగల్ జిల్లా మహిళా అభివృద్ధి కేంద్రం అవగాహన కార్యక్రమాలు, పథకాల ప్రచారంలో కీలక పాత్ర పోషిస్తోందని వివరించారు. అంగన్‌వాడీ%-%పోషణ 2.0 ద్వారా పిల్లల పోషణ, ప్రీ-స్కూల్ విద్య, మౌలిక సదుపాయాల పురోభివృద్ధి జరుగుతుందని తెలిపారు. తెలంగాణలో 35,769 అంగన్‌వాడీ సెంటర్లు శిశువుల ఎదుగుదల పర్యవేక్షణ పరికరాలతో సిద్ధంగా ఉండడం వల్ల పోషకాహార లోపాలను సకాలంలో గుర్తించి చర్యలు తీసుకోవడం సాధ్యమవుతోందని చెప్పారు. మీల్స్, టేక్ హోమ్ రేషన్ ద్వారా గర్భిణీలు, బాలింతలు, చిన్నపిల్లలు, వయోజన బాలికలకు జీవచక్ర విధానంలో పోషకాహారం అందుతున్నట్లు వివరించారు. మహిళలపై హింస నివారణలో వన్ స్టాప్ సెంటర్ల ( పాత్ర ముఖ్యమని మంత్రి తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 36 లు 2015 నుంచి 77,858 మహిళలకు వైద్య, చట్టపర, మానసిక సహాయం వంటి సేవలు అందించాయని చెప్పారు. 181 మహిళా హెల్ప్‌లైన్ 112తో అనుసంధానమై 76,444 కేసుల్లో స్పందించినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎంపీ డాక్టర్ కడియం కావ్య మాట్లాడుతూ, ఈ పథకాలు వరంగల్ సహా గ్రామీణ ప్రాంతాల్లో మరింత వేగంగా అమలు కావాలని కోరారు. గ్రామీణ ప్రాంతాల్లో పోషకాహార లోపం తగ్గడం, లింగ వివక్ష తగ్గించే దిశగా ఇవి మరింత ప్రభావవంతంగా పనిచేయాలని ఎంపీ డాక్టర్ కడియం కావ్య స్పష్టం చేశారు.

# విద్యార్థులు కలలు కనాలి, వాటి సాకారానికి నిరంతరం కృషి చేయాలని

- జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ

**భూపాల పల్లి డిసెంబర్5( సమయం న్యూస్). :** విద్యాశాఖ ఆధ్వర్యంలో స్థానిక శాంతి నికేతన్ పాఠశాలలో శుక్రవారం నిర్వహించిన 53వ విద్యా, వైజ్ఞానిక సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించిన అనంతరం కలెక్టర్ విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. విద్యార్థులు విద్యార్థి దశ నుండే శాస్త్రీయ దృక్పథాన్ని అలవర్చుకోవాలన్నారు. కేవలం పుస్తక జ్ఞానానికే పరిమితం కాకుండా, సమాజానికి ఉపయోగపడే ఎన్నో నూతన ఆవిష్కరణలు మీ నుండి రావాలని ఆకాంక్షించారు. ఆకాశంలో ఎగిరే పక్షులను చూసే రైట్ సోదరులు విమానాన్ని తయారు చేశారని, ప్రకృతిని, పరిసరాలను గమనించడం ద్వారా అద్భుతాలు సృష్టించవచ్చని విద్యార్థులకు గుర్తుచేశారు. మానవ జీవితంలో సైన్స్ ఎంతో కీలకమని, అది మన జీవన ప్రమాణాలను మెరుగుపరు-స్తుందని తెలిపారు. విద్యార్థులు తమ కలలను నిజం చేసుకునే దిశగా అడుగులు వేయాలని సూచించారు. ప్రతి సంవత్సరం రాష్ట్ర విద్యా పరిశోధన శిక్షణ సంస్థ ఆదేశానుసారం జిల్లాలో విద్యా వైజ్ఞానిక ప్రదర్శన మరియు



ఇన్స్పైర్ మేళాను నిర్వహించుకుంటున్నామని, దీనికి అనుగుణంగా డిసెంబరు 5, 6 తేదీలలో జిల్లా స్థాయి సైన్స్ ఫెయిర్ మరియు ఇన్స్పైర్ మేళాను నిర్వహించుకుంటున్నామని పేర్కొన్నారు. ఈ సైన్స్ ఫెయిర్ లో 147 సైన్స్ ఫెయిర్ ప్రాజెక్టులు , 77 ఇన్స్పైర్ ప్రాజెక్టులు ప్రదర్శించడం జరిగిందని విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమం విద్యార్థుల్లో సైంటిఫిక్ టెంపర్ ను , సైంటిఫిక్ యాటిట్యూడ్ ను పెంపొందించడానికి, భావిశాస్త్రవేత్త లుగా ఎదగడానికి దోవతపడుతుందని వివరించారు. ఈ కార్యక్రమం విజయవంతంగా నిర్వహించుటకు ఉపాధ్యాయుని ఉపాధ్యాయులచే 13 సైన్స్ ఫెయిర్ నిర్వహణ కమిటీలను ఏర్పాటు చేయడం జరిగిందని, ఈ కార్యక్రమంలో ప్రదర్శించిన ఎగ్జిబిట్లను సందర్శించుటకు జిల్లాలోని వివిధ పాఠశాలల విద్యార్థిని, విద్యార్థులను అవకాశం కల్పించడం జరిగిందని తెలిపారు. అనంతరం విద్యార్థులు ఏర్పాటు చేసిన వివిధ రకాల విద్యా వైజ్ఞానిక స్టాళ్లు పరిశీలించి అభినందించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, డిఈఓ రాజేందర్, ఎంపిడిఓ తరుణి ప్రసాద్, జిల్లా సైన్స్ అధికారి స్వామి, ఉపాధ్యాయ సంఘాల నాయకులు, విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# మెదక్ పట్టణంలో అసంఘటిత కార్మికుల్స్ గణాంక శాఖ సర్వే.

- కరీంనగర్ బృందం మెదక్ పట్టణంలో సర్వే నిర్వహించారు .



**మెదక్ డిసెంబర్5( సమయం న్యూస్) :** సర్వే ముఖ్య ఉద్దేశం వ్యవసాయతర రంగంలోని చిన్న వ్యాపారాల ఆర్థిక పరిస్థితిని వాటి పనితీరును తెలుసుకోవడం ,అసంఘటిత సేవారంగం అసంఘటిత భవన రంగ నిర్మాణాలపై అయ్యే ఖర్చులు ఆదాయము వేయాలపై సర్వే నిర్వహించడం జరిగింది ఈ కార్యక్రమంలో కరీంనగర్ గణాంక శాఖ కార్యాలయం అధికారులు గుర్రం శ్రీనివాస్ గౌడ్, ఆరే లక్ష్మీనారాయణ ముత్తినేని శ్రీకాంత్ మెదక్ మున్సిపల్ మేనేజర్ భవాని గారు మరియు వార్డ్ ఆఫీసర్స్ అంకిత , ఉదయ్ రాథోడ్ మెప్మా సెక్షన్ సిబ్బంది ఆర్పీలు స్వాతి , మీనా మరియు మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు

# హైదరాబాద్ లో స్వయం సహాయక సంఘాల మహిళలకు శిక్షణ.



**సిద్దిపేట డిసెంబర్5( సమయం న్యూస్) :** స్వయం సహాయక సంఘా సభ్యులు Event Management పై National Institute of Tourism and Hospitality Management(NITHM) హైద్రాబాద్ లో 5 రోజులు పాటు శిక్షణ తీసుకోవడం జరిగింది. సిద్దిపేట జిల్లా నుండి 6 గురు స్వయం సహాయక సభ్యులు బి. బాలలక్ష్మి, ఎ. మంజుల, జి. శ్వేతా కళ, ఎం భూలక్ష్మి, జె. శిరీష, లావణ్య ఈవెంట్ మేనేజ్మెంట్ సంబంధించి పలు రకాల యూనిట్లకు శిక్షణ తీసుకోవడం జరిగింది. ఈ యూనిట్ లలో శిక్షణ పొందిన మహిళలు వారి ఉపాధి నిమిత్తం బారసాలా నుండి మొదలుకొని వివాహం ల వరకు అన్ని శుభకర్యాలకు చేస్తారు. శిక్షణ పొందిన మహిళలకు National Institute of Tourism and Hospitality Management(NITHM) హైద్రాబాద్ వారు అందించిన సర్టిఫికెట్లను శుక్రవారం సమీకృత జిల్లా కార్యాలయ సముదాయంలో కాన్ఫరెన్స్ హాల్లో జిల్లా కలెక్టర్ కె. హైమావతి చేతుల మీదుగా శిక్షణ పొందిన మహిళలకు సర్టిఫికెట్లు అందజేశారు. మీరు చిన్న చిన్న ఈవెంట్లు చేసుకొని పెద్ద ఈవెంట్ చేసే స్థాయికి ఎదగాలని మహిళలకు సూచించారు. ఈ కార్యక్రమంలో డిఆర్డిఏ పిడి జయదేవ్ ఆర్య, అడిషనల్ డిఆర్డిఏ సుధీర్, డిపిఎం సాగర్ తదితరులు పాల్గొన్నారు.

# మండలాల్లో నామినేషన్ స్వీకరణ కేంద్రాలను తనిఖీ

- చేసిన ఎన్నికల సాదారణ పరిశీలకులు భారతి లక్పతి నాయక్



**కుల్చారం డిసెంబర్5( సమయం న్యూస్). :** శుక్రవారము కూల్చారం మండల కేంద్రంలో ఉన్న ఎంపీడీవో కార్యాలయంలో ఏన్నికల నామినేషన్ ల ప్రక్రియ ను పరిశీలించారు.

ఎన్నికలను పురస్కరించుకుని గ్రామ పంచాయతీలో నిర్వహిస్తున్న నామినేషన్ల స్వికరణ కేంద్రాలను పరిశీలించారు. సర్పంచ్, వార్డు స్థానాల ఎన్నిక కోసం జారీ చేసిన నోటిఫికేషన్ వివరాలను క్షుణ్ణంగా పరిశీలించారు. ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా ఎన్నికల ప్రక్రియను సజావుగా నిర్వహించాలని సూచించారు. నామినేషన్ సెంటర్ వద్ద హెల్ప్ డెస్క్ ను పరిశీలించారు. అవసరమైన వారికి హెల్ప్ డెస్క్ ద్వార సహాయ సహకారాలు అందించాలని సూచించారు. రాష్ట్ర ఎన్నికల సంఘం నియమ, నిబంధనలకు అనుగుణంగా విధులు నిర్వహించాలని, విధుల పట్ల పూర్తి అవగాహన కలిగి ఉండాలని, ఎన్నికల ప్రవర్తన నియమావళి తప్పకుండా అమలయ్యేలా చూడాలని, నిర్ణీత గడువు లోపల నామినేషన్ లు స్వీకరించేందుకు టోకెన్లు జారీ చేయాలని అధికారులకు సూచించారు. ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులకు ఖర్చుల వివరాలపై పూర్తి అవగాహన కలిపించాలన్నారు.

వ్యయ పరిమితిని పక్కాగా లెక్కించేలా తగిన ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు కొత్త బ్యాంకు అకౌంట్ ద్వారానే ఎన్నికల లావాదేవీలు నిర్వహించాల్సి ఉంటుందని సూచించారు. ఆమె వెంట సంబంధిత అధికారులు , తదితరులు ఉన్నారు.

# నిబంధనల ప్రకారం పంచాయతీ ఎన్నికలు సజావుగా జరిగేలా చర్యలు..

● జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష

● పంచాయతీ ఎన్నికల నిర్వహణపై రిటర్నింగ్ అధికారులతో సమావేశం నిర్వహించిన జిల్లా కలెక్టర్



**పెద్దపల్లి, డిసెంబర్-05:( సమయం న్యూస్) :** నిబంధనల ప్రకారం పంచాయతీ ఎన్నికలు సజావుగా జరిగేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సూచించారు.

సోమవారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సమీకృత జిల్లా కలెక్టరేట్ నందు పంచాయతీ ఎన్నికల నిర్వహణపై రిటర్నింగ్ అధికారులతో సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ, డిసెంబర్ 6న పిఓ, ఎపిఓ లకు శిక్షణ అందిస్తున్నామని, అదే సమయంలో ఫారం 14 అందించిన ప్రతి ఒక్కరికి పోస్టల్ బ్యాలెట్ సౌకర్యం కల్పించి ఓటు హక్కు వినియోగించుకునేలా చూడాలని, పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకున్న ఓటర్ వివరాలు ఓటరు జాబితాలో మార్క్ చేయాలని అన్నారు.పోలింగ్ కేంద్రాలకు ఆలాట్ చేసిన పోలింగ్ అధికారులందరూ విధులకు హాజరయ్యే విధంగా పర్యవేక్షించాలని అన్నారు. ప్రతి పోలింగ్ కేంద్రం పరిధిలో అవసరమైన సామాగ్రి పంపిణీ చేసామో లేదో చెక్ చేయాలని అన్నారు. ప్రతి పోలింగ్ కేంద్రాన్ని ముందు పరిశీలించి అవసరమైన ఏర్పాటులో చేసుకోవాలని అన్నారు.పోలింగ్ నాడు ఉదయమే సిబ్బంది పోలింగ్ స్టేషన్ వద్ద చేరుకునేలా చూడాలని అన్నారు. పోలింగ్ కేంద్రాల వద్దే స్ట్రాంగ్ రూమ్ ఏర్పాటు చేసి కౌంటింగ్ కు చర్యలు చేపట్టాలని అన్నారు. కౌంటింగ్ ప్రక్రియ నిదానంగా జాగ్రత్తగా చేయాలని తొందర పడాల్సిన అవసరం లేదని అన్నారు. జిల్లాలోని మొదటి విడత పోలింగ్ నందు 4 సర్పంచ్ స్థానాలు, 210 వార్డులు ఏకగ్రీవంగా ఎన్నిక కావడం జరిగిందని, 95 గ్రామ పంచాయతీలు, 670 వార్డు లకు డిసెంబర్ 11న పోలింగ్ నిర్వహించాల్సి ఉంటుందని కలెక్టర్ తెలిపారు. పంచాయతీ ఎన్నికలు జరిగిన రోజే ఉపసర్పంచ్ ప్రక్రియ ముగిసే విధంగా చర్యలు తీసుకోవాలని, 50 శాతం కంటే ఎక్కువ వార్డు సభ్యులు అందుబాటులో ఉండేలా ముందస్తుగానే వారికి సమాచారం అందించాలని అన్నారు. ఈ సమావేశంలో జడ్పీ సీఈవో నరేందర్, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# ఓయూ పోలీస్ స్టేషన్ అభివృద్ధి-భద్రతా చర్యలకు డిప్యూటీ మేయర్ శ్రీలత శోభన్ రెడ్డి హామీ.



**హైదరాబాద్, డిసెంబర్ 5 (సమయం న్యూస్)** ఉస్మానియా యూనివర్సిటీ పోలీస్ స్టేషన్ సర్కిల్ ఇన్స్పెక్టర్ శ్రీ అప్పలనాయుడు గారు ఈరోజు గ్రేటర్ హైదరాబాద్ నగర డిప్యూటీ మేయర్ శ్రీమతి మోతే శ్రీలత శోభన్ రెడ్డి గారిని, అలాగే టిటియుసి రాష్ట్ర అధ్యక్షులు శ్రీ మోతే శోభన్ రెడ్డి గారిని వారి క్యాంప్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి వివిధ సమస్యలను వివరించారు.ఈ సందర్భంగా సీఐ అప్పలనాయుడు గారు ఓయూ పోలీస్ స్టేషన్ పరిధిలో అత్యవసరంగా చేపట్టాల్సిన పలు మరమ్మతులు, అభివృద్ధి పనుల గురించి వివరించారు. రోడ్ల దుస్థితి, వీధి దీపాల సమస్యలు, చెట్ల కమ్మలు, శుభ్రత లోపాలు, పహరిగూడ ప్రాంతంలో నీటి సమస్యలు తదితర సమస్యల వలన ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్న విషయాన్ని తెలియజేశారు. ఇందుకు సంబంధించి వినతి పత్రాన్ని డిప్యూటీ మేయర్ గారికి అందజేశారు.దనంగా, ఓయూ పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రజలు అందిస్తున్న ఫిర్యాదుల స్వభావం, వాటి పరిష్కారంపై ఉన్న లోపాలను కూడా డిప్యూటీ మేయర్ గారికి వివరించారు. ప్రజల న్యాయసంబంధ సమస్యలు వేగంగా పరిష్కారమయ్యేలా చర్యలు తీసుకోవాలని అప్పలనాయుడు గారు కోరగా, డిప్యూటీ మేయర్ గారు వాటి వివరాలను తెలుసుకుని తగిన సూచనలు చేశారు.అలాగే, పోలీస్ స్టేషన్ పరిధిలో భద్రతను మరింత బలోపేతం చేసేందుకు కొన్ని అదనపు సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని అప్పలనాయుడు గారు కోరారు. దీనిపై వెంటనే స్పందించిన డిప్యూటీ మేయర్ శ్రీమతి మోతే శ్రీలత శోభన్ రెడ్డి గారు, ఓయూ పీఎస్ పరిధిలోని అన్ని ముఖ్య ఏరియాలను కవర్ చేసే విధంగా కొత్త సీసీ కెమెరాల అమరిక కోసం ప్రత్యేక బడ్జెట్ కేటాయించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.డిప్యూటీ మేయర్ గారి చొరవతో ఓయూ పోలీస్ స్టేషన్ మరియు పరిసర ప్రాంతాల్లో అభివృద్ధి, భద్రత, ప్రజాసేవా వ్యవస్థలు మెరుగుపడతాయని అధికారులు ఆశాభావం వ్యక్తం చేశారు.

# కలెక్టరేట్ సబ్ స్టేషన్ లో అదనపు 5 మేఘ పవర్ ట్రాన్స్ఫార్మర్ ని ప్రారంభించిన జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్



**జనగాం డిసెంబర్5( సమయం న్యూస్) :** జనగామ టౌన్ 2 సెక్షన్ పరిధిలో గల కలెక్టరేట్ సబ్ స్టేషన్ లో నూతనంగా ఏర్పాటు చేసిన అదనపు 5 పవర్ ట్రాన్స్ఫార్మర్ ని శుక్రవారం జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ ప్రారంభించారు. గతంలో కలెక్టరేట్ సబ్ స్టేషన్ లో ఒకటే 5% పవర్ ట్రాన్స్ఫార్మర్ ఉండగా సుమారు 80 లక్షల రూపాయలు వ్యయంతో లోడ్ షేరింగ్ వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ అందించటం కోసం అదనపు పవన్ ట్రాన్స్ఫార్మర్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సూపర్ఇంటెండింగ్ ఇంజనీర్ సంపత్ రెడ్డి , ఆపరేషన్ డిఇ లక్ష్మీ నారాయణ రెడ్డి , డి ఈ టెక్నికల్ గణేష్ , ఏడిఈ వేణుగోపాల్ , ఏడిఈ టిఆర్ఇ శ్రీధర్ , టౌన్ వన్ ఏఈ శ్రీమతి సౌమ్య, చంద్రమోహన్ సిబ్బంది పాల్గొన్నారు.

# విజయవంతంగా జరిగిన మెగా జాబ్ మేళా కార్యక్రమం.

● జిల్లా ఉపాధి కల్పనాధికారి ఎం. రాజశేఖర్

● 81మంది నిరుద్యోగ యువతకు నియామక పత్రాలు

● మెగా జాబ్ మేళాలో పాల్గొన్న 16 ప్రైవేట్ కంపెనీ ప్రతినిధులు



**పెద్దపల్లి, డిసెంబర్-05( సమయం న్యూస్).:** టాస్క్ రీజినల్ సెంటర్ ఆధ్వర్యంలో నిర్వహించిన మెగా జాబ్ మేళా కార్యక్రమం విజయవంతంగా జరిగిందని జిల్లా ఉపాధి అధికారి ఎం. రాజశేఖర్ తెలిపారు.సమీకృత జిల్లా కలెక్టరేట్ నందు శుక్రవారం పెద్దపల్లి రీజనల్ టాస్క్ సెంటర్ ఆధ్వర్యంలో నిర్వహించిన మెగా జాబ్ మేళా భారీ స్పందన వచ్చిందని జిల్లా ఉపాధి కల్పన అధికారి తెలిపారు.ఈ సందర్భంగా లిజిల్లా ఉపాధి అధికారి మాట్లాడుతూ,లినిరుద్యోగ యువతకు వివిధ ఉపాధి అవకాశాలు కల్పించాలనే లక్ష్యంతో పెద్దపల్లి జిల్లా యంత్రాంగం ప్రత్యేక కార్యాచరణ అమలు చేస్తుందని, అందులో భాగంగా నిర్వహించిన మెగా జాబ్ మేళా కార్యక్రమం విజయవంతంగా జరిగిందని తెలిపారు. మెగా జాబ్ మేళా కార్యక్రమానికి 16 ప్రైవేట్ కంపెనీల ప్రతినిధులు హాజరై ప్రత్యేకత ఏర్పాటు చేసారని, ముందస్తుగానే ప్రభుత్వ ప్రైవేటు ఇంజనీరింగ్ డిగ్రీ వివిధ వృత్తి నైపుణ్యం కళాశాలలకు జాబ్ మేళా నిర్వహణపై సమాచారం అందించడంతో మొత్తం 931 మంది నిరుద్యోగ యువతీ, యువకులు, గ్రాడ్యుయేషన్ చివరి సంవత్సరం చదువుతున్న విద్యార్థులు మెగా జాబ్ మేళా కు హాజరై అయ్యారని తెలిపారు.వివిధ కంపెనీలు , నిరుద్యోగ యువతీ, యువకుల నైపుణ్యాలు విద్యా అర్హతలను పరిశీలించి 81మందికి సెలెక్ట్ చేస్తూ ఉపాధి అవకాశాలు కల్పించడం జరిగిందని తెలిపారు. పెద్దపల్లి రీజినల్ టాస్క్ సెంటర్ లో వివిధ కోర్సులు పూర్తి చేసిన అభ్యర్థులకు ప్రైవేట్ కంపెనీలలో మంచి ప్యాకేజీ లతో ఉపాధి అవకాశాలు లభిస్తున్నాయని, నిరుద్యోగ యువత తమ నైపుణ్యాలను పెంపొందించుకోవాలని కోరారు. పెద్దపల్లి రీజినల్ టాస్క్ సెంటర్ లో డిగ్రీ ఉత్తీర్ణత సాధించిన నిరుద్యోగ యువతీ, యువకులకు వివిధ కోర్సులలో శిక్షణ ఉచితంగా అందించి ఉద్యోగ అవకాశాలు కూడా ఇప్పించడం జరుగుతుందని, ఆసక్తి గల అభ్యర్థులు రీజనల్ టాస్క్ సెంటర్ ను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఉపాధి అధికారి అధికారి సూచించారు.వివిధ కంపెనీల నందు నూతనంగా ఉద్యోగాలకు ఎంపికైన యువతీ యువకులకు కలెక్టరేట్ పరిపాలన అధికారి బి. ప్రకాష్ ఉద్యోగ నియామక పత్రాలు అందించారు . కార్యక్రమంలో జిల్లా ఉపాధి కల్పనాధికారి రాజశేఖర్, రీజినల్ టాస్క్ సెంటర్ ఇంచార్జి కౌసల్య, సంబంధిత అధికారులు ,తదితరులు పాల్గొన్నారు.

# కే.వి.కే గడ్డిపల్లిలో ప్రపంచ మృత్తిక దినోత్సవ సందర్భంగా పక్కృతి వ్యవసాయంపై కిసాన్ మేళా




**సూర్యాపేట డిసెంబర్5( సమయం న్యూస్) :** కృషి విజ్ఞాన కేంద్రం గడ్డిపల్లి లో శుక్రవారం నాడు నిర్వహించిన ప్రపంచ మృత్తిక దినోత్సవ కార్యక్రమంలో భాగంగా ప్రకృతి వ్యవసాయంపై కిసాన్ మేళాను ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి సూర్యాపేట జిల్లా వ్యవసాయ అధికారి శ్రీ. జి శ్రీధర్ రెడ్డి గారు ముఖ్య అతిథిగా పాల్గొన్నారని కే.వి.కే సీనియర్ సైంటిస్ట్ అండ్ హెడ్ ఇన్చార్జ్ శ్రీ డి. నరేశ్ తెలిపారు. ఈ కార్యక్రమాన్ని మొదటగా వ్యవసాయ ప్రదర్శనను శ్రీ.జి. శ్రీధర్ రెడ్డి గారు రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు తర్వాత ప్రదర్శనలో ఏర్పాటు చేసిన డెమోస్ అని చూసి రైతులకు ఉపయోగపడే ప్రకృతి వ్యవసాయాన్ని తిలకించారు.వారు మాట్లాడుతూ నేలను (మట్టి) పరిరక్షించుకోవాల్సిన ఆవశ్యకతపై ప్రపంచవ్యాప్తంగా ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు అన్నారు,ఆరోగ్యకరమైన నేలలు ఆరోగ్యకరమైన నగరాలకు పునాది, భవిష్యత్ నాంది అన్నారు. రైతులు సేంద్రియ ఎరువులు జీవ సంబంధ పురుగు మందులు పచ్చిరొట్ట, జీవన ఎరువులు ఉపయోగించాలి. సమగ్ర వ్యవసాయ పద్ధతులను పాటించి నేల కోతను అరికట్టాలి. నీటి వినియోగాన్ని సమర్థవంతంగా చేపట్టాలి. భూసార పరీక్షల ఫలితాల ఆధారంగా ఎరువులు వాడాలి. నేలను కప్పి ఉంచే పద్ధతిని అనుసరించాలి. పంట మార్పిడి, అంతర పంటలు, సాగు విధానాల కొనసాగింపుతో నేత కోతను అరికట్టవచ్చు అనిరసాయనక ఎరువుల వాడకాన్ని తగ్గించి సేంద్రియ ఎరువులు వాడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కే.వి.కే సీనియర్ సైంటిస్ట్ అండ్ హెడ్ ఇన్చార్జ్ శ్రీ డి. నరేశ్ మాట్లాడుతూ రైతులు కేవలం ఒకే రకమైన పంటలు వేసుకోకుండా సమగ్ర వ్యవసాయ విధానాలను పాటిస్తూ అధిక దిగుబడులను సాధించవచ్చని తెలిపారు. నేల సారవంతం తగ్గడానికి గల కారణాలు, నేల ఆరోగ్య పరిరక్షణకు పాటించవలసిన పద్ధతుల గురించి తెలిపారు. అలాగే సమగ్ర పోషక యాజమాన్య పద్ధతులు అవలంబిస్తూ నేల ఆరోగ్యన్ని కాపాడుకోవాలి సూచించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వారితో నేల పరిరక్షణకై ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో భాగంగా రైతులకు భూసార ఆరోగ్య పత్రాలను పంపిణీ చేయడం జరిగింది. అలాగే సేంద్రియ వ్యవసాయం చేసే రైతులకు సన్మానం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి జి. శ్రీధర్ రెడ్డి, కే.వి.కే శాస్త్రవేత్తలు డీ.నరేష్, సి.హేచ్. నరేష్, ఎ.కిరణ్, పి. అక్షిత్ సాయి, యన్ సుగంధి, నూతనకల్ మండల వ్యవసాయ అధికారి కే . మల్లారెడ్డి, కంప్యూటర్ ప్రోగ్రామర్ ఏ. నరేశ్, సూపర్డెంట్ ఉపేందర్, స్టెనో ఎం.సైదులు ఇఫ్కో జిల్లా మేనేజర్ ఏ. వెంకటేశ్, రైతులు మరియు వ్యవసాయ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# నామినేషన్‌ల ఉపసంహరణ, ఏకగ్రీవ ఎన్నికల ఫలితాలు పోస్టల్ బ్యాలెట్ల జారీ,వినియోగంపై శిక్షణ



**నారాయణ పేట డిసెంబర్5( సమయం న్యూస్) :** నారాయణ పేట జిల్లాలో రెండో విడత ఎన్నికలు జరిగే నారాయణపేట,దామరగిద్ద, ధన్వాడ, మరికల్ మండలాలలోని గ్రామపంచాయతీ ఎన్నికల నామినేషన్ల ఉపసంహరణ, ఏకగ్రీవ ఎన్నికల ఫలితాలు, పోస్టల్ బ్యాలెట్ పేపర్లు, పోస్టల్ బ్యాలెట్ జారీ, వినియోగం పై శుక్రవారం సాయంత్రం జిల్లా కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో పోస్టల్ బ్యాలెట్ నోడల్ అధికారులు, స్టేజ్-1 స్టేజ్ 2 రిటర్నింగ్ అధికారులు , జోనల్ అధికారులతో శిక్షణ నిర్వహించారు.శిక్షణ సందర్భంగా స్థానిక సంస్థల జిల్లా అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వర్ మాట్లాడుతూ...

ఎన్నికల నిర్వహణలో ఏ చిన్న పొరపాటు కూడా తీవ్రమైన సమస్యలకు దారితీసే అవకాశం ఉన్నందున, నామినేషన్ల ఉపసంహరణ, ఏకగ్రీవ ఎన్నికల ఫలితాల వెల్లడి, బ్యాలెట్ పేపర్ల పంపిణీ, పోస్టల్ బ్యాలెట్‌ల జారీ, వినియోగం అత్యంత శ్రద్ధతో, పారదర్శకంగా నిర్వహించాలని ఆయన తెలిపారు. రెండో విడత ఎన్నికల నామినేషన్ల ఉపసంహరణ ప్రక్రియను శనివారం మధ్యాహ్నం 3 గంటల లోపు పూర్తి చేయాలని ఆదేశించారు. ఇప్పటికే సింగిల్ నామినేషన్ దాఖలైన వార్డుల, గ్రామ పంచాయతీల ఫలితాలను జిల్లా ఎన్నికల అధికారి/జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ ఎన్ వో సీ ఇచ్చిన తర్వాత ప్రకటించాలని, అలాగే నామినేషన్లు ఉప సంహరణ తర్వాత కూడా ఒకే సర్పంచి అభ్యర్థి బరిలో ఉంటే నామినేషన్లు ఉపసంహరించుకున్న అభ్యర్థులు ఎలాంటి అంగ,ధన బలం ప్రలోభాలు తమపై లేవని ఆయా అభ్యర్థులతో డిక్లరేషన్ తీసుకుని ఎన్నికల నియమ నిబంధనలను అనుసరించి ఏకగ్రీవం చేయాలని, అందుకు కూడా నోడల్, కమిటి మెంబర్లు, జిల్లా ఎన్నికల అధికారి అనుమతి ఇచ్చిన తర్వాతే ప్రకటించాల్సి ఉంటుందని అదనపు కలెక్టర్ తెలిపారు. నామినేషన్ ల ఉపసంహరణ తర్వాత పోటీలో ఉన్న అభ్యర్థుల జాబితా, గుర్తుల కేటాయింపు ప్రక్రియను వెంటనే పూర్తి చేసి తహశీల్దార్ల కు సమాచారం ఇవ్వాలని చెప్పారు. ఒకవేళ సర్పంచి, వార్డుల అభ్యర్థుల స్థానాలు ఏకగ్రీవం అయితే ఉప సర్పంచి ఎన్నిక కూడా చేయాల్సి ఉంటుందన్నారు. పోటీలో ఉన్న అభ్యర్థుల జాబితా ప్రకటన తర్వాత జిల్లా కేంద్రం నుంచి పోలింగ్ కు అవసరమైన బ్యాలెట్ బాక్సులు, బ్యాలెట్ పేపర్లను ఆయా మండలాల ఎంపీడీవో లు మండల కేంద్రాలకు తీసుకు వస్తారని ఆయన తెలిపారు. ఇక పోస్టల్ బ్యాలెట్ జారీ, వినియోగం గురించి తెలుపుతూ.. రక్షణ దళాల్లో పనిచేస్తున్న సర్వీస్ ఓటర్ల పోస్టల్ బ్యాలెట్లు తప్పనిసరిగా పంపాలని ఆదేశించారు. అయితే, సర్వీస్ ఓటర్ల జాబితాను ముందుగా సంపాదించి, గ్రామపంచాయతీ వారీగా, వార్డు వారీగా వర్గీకరించాలని నోడల్ అధికారులకు ఆయన సూచించారు. వారి ప్రస్తుత పని స్థలం చిరునామాలను సేకరించి సంబంధిత స్టేజ్-1 కి పంపాలని ఆదేశించారు. ఎన్నికల డ్యూటీలో ఉన్న ఉద్యోగులు మరియు ప్రీవెంటివ్ డిటెన్షన్ ఓటర్లకు పోస్టల్ బ్యాలెట్లు జారీ చేయాలంటే 14 ద్వారా ముందస్తు నమోదు తప్పనిసరి ఆయన స్పష్టం చేశారు. ఈ 14 సమర్పించిన వారికే పోస్టల్ బ్యాలెట్లు ఇవ్వాలని అధికారులకు సూచించారు.ఎన్నికల డ్యూటీలో ఉన్న ఉద్యోగులు సులభంగా ఓటు వేయడానికి ప్రతి మండలంలో ఫెసిలిటేషన్ సెంటర్లు ఏర్పాటు చేయనున్నట్లు ఆయన వెల్లడించారు. పోస్టల్ బ్యాలెట్‌ల జారీ ప్రక్రియలో ఎలాంటి తప్పిదాలు చోటుచేసుకోకుండా జాగ్రత్తగా పనిచేయాలని, ఏమైనా సందేహాలు ఉంటే ఎన్నికల హ్యాండ్‌బుక్‌ను పూర్తిగా చదివి అనుసరించాలని పునర్ఘాటించారు. ప్రత్యక్షంగా ఓటు వేయలేని వారి ఓటు హక్కును రక్షించే ఈ కీలక ప్రక్రియను ఎటువంటి పొరపాట్లు చేయకుండా నిర్వహించడం ప్రతి అధికారికి బాధ్యత అని ఆయన స్పష్టం చేశారు. బరిలో నిలిచిన అభ్యర్థుల కు గుర్తుల కేటాయింపులో తెలుగు అక్షర మాల (ఆల్ఫాబెటికల్)ను ఆధారంగా కేటాయించాలని, ఈ ప్రక్రియలో ఎలాంటి చిన్న పొరపాటు కూడా జరగకుండా అధికారులు నిశితంగా పర్యవేక్షణ చేయాలని అదనపు కలెక్టర్ ఆదేశించారు.ఈ కార్యక్రమంలో ఎన్నికల వ్యయ పరిశీలకులు విజయ్ కుమార్, ట్రైనీ కలెక్టర్ ప్రణయ్ కుమార్, డిఆర్డిఓ మొగులప్ప, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి జాన్ సుధాకర్, జిల్లా పంచాయతీ అధికారి సుధాకర్ రెడ్డి, తహసీల్దార్లు, స్టేజ్ 1,2రిటర్నింగ్ అధికారులు, ఇతర ఎలక్షన్ అధికారులు పాల్గొన్నారు.

# ఫైనల్ మ్యాచ్‌కు పెద్ద మార్పులు!

- ప్రసిద్ధ్ కృష్ణకు ఉద్వాసన పలికే చాన్స్
- నితీష్ కుమార్ రెడ్డికి అవకాశం!!
- నేడు దక్షిణాఫ్రికాతో భారత్ మూడో వన్డే



**విశాఖపట్నం:** భారత్– దక్షిణాఫ్రికా మధ్య వన్డే సిరీస్ ఇప్పుడు కీలక దశకు చేరుకుంది. విశాఖపట్నంలో జరిగే మూడో, చివరి వన్డే రెండు జట్లకు 'డూ ఆర్ డై' మ్యాచ్ అవుతుంది. మొదటి మ్యాచ్‌లో విజయం సాధించిన తర్వాత, భారత్ రెండో వన్డేలో ఘోరంగా దెబ్బతింది. దక్షిణాఫ్రికా 359 పరుగుల భారీ లక్ష్యాన్ని సులభంగా ఛేదించింది. కాబట్టి, ఇప్పుడు కెఎల్ రాహుల్ కెప్టెన్సీలోని జట్టుపై ఒత్తిడి రెట్టింపు అయింది. రెండో వన్డేలో భారత బౌలర్లు పూర్తిగా విఫలమయ్యారు. ముఖ్యంగా ఫాస్ట్ బౌలర్ ప్రసిద్ధ్ కృష్ణ. 8.2 ఓవర్లలో 85 పరుగులు సమర్పించుకున్నాడు. ఒక్క వికెట్ కూడా తీయలేదు. అతని ప్రదర్శన మొత్తం సిరీస్‌లో సాధారణంగా ఉంది. నిరంతరం పరుగులు ఇవ్వడం, ఎటువంటి ప్రభావాన్ని చూపించలేకపోవడంతో, సెలెక్టర్లు, టీమ్ మేనేజ్‌మెంట్ ఇప్పుడు మార్పులకు మాత్రమే అవకాశం ఉంది. నిర్ణయాత్మక మ్యాచ్‌లో ప్రసిద్ధ్ కృష్ణను జట్టు నుంచి ఉద్వాసన పలకాలని భావిస్తున్నారు. నివేదికల ప్రకారం, అతని స్థానంలో యువ ఆల్ రౌండర్ నితీష్ కుమార్ రెడ్డిని ప్లేయింగ్ 11లో చేర్చవచ్చు. నితీష్ రెడ్డి దేశవాళీ క్రికెట్‌లో అద్భుతమైన ఫామ్‌లో ఉన్నాడు. డెత్ ఓవర్లలో వేగంగా పరుగులు చేయడంతో పాటు వికెట్లు తీసే సామర్థ్యాన్ని కూడా కలిగి ఉన్నాడు. విశాఖపట్నం పిచ్ బ్యాటింగ్‌కు సహకరిస్తుంది. కాబట్టి, జట్టుకు బ్యాటింగ్‌లో లోతును అందించగల ,బౌలింగ్‌లో ఆరో ఆప్షన్‌గా సహాయపడే ఆల్ రౌండర్ అవసరం. గత రెండు మ్యాచ్‌లలో టీమ్ ఇండియా చివరి ఓవర్లలో పరుగులు సాధించడంలో ఇబ్బంది పడింది. అటువంటి పరిస్థితిలో, నితీష్ రెడ్డిని చేర్చడం భారత బ్యాటింగ్‌కు బలాన్ని చేకూరుస్తుంది. జట్టు సమతుల్యతను కూడా మెరుగుపరుస్తుంది.ప్రసిద్ధ్ కృష్ణను తొలగిస్తే, బౌలింగ్ యూనిట్ ఈ విధంగా ఉండవచ్చు, అర్ష్‌దీప్ సింగ్, హర్షిత్ రాణా, కుల్దీప్ యాదవ్, రవీంద్ర జడేజా, వాషింగ్టన్ సుందర్, నితీష్ రెడ్డి ఆరో బౌలర్‌గా ఉంటారు. ఈ కలయిక జట్టుకు బ్యాటింగ్, బౌలింగ్ విభాగాలలో స్థిరత్వాన్ని అందిస్తుంది. ఆఖరి వన్డేలోనూ టీమిండియా తుది జట్టులో మార్పులు చేసే అవకాశం లేదు. శ్రేయస్ అయ్యర్ గైర్హాజరీలో వచ్చిన అవకాశాన్ని రుతురాజ్ గైక్వాడ్ అందుకున్నాడు. అద్భుత సెంచరీతో ఆకట్టుకున్నాడు. దాంతో రిషభ్ పంత్, తిలక్ వర్మ, ధ్రువ్ జురెల్ బెంచ్‌కే పరిమితం కావాల్సిన పరిస్థితి ఏర్పడింది. మరోవైపు శుభ్‌మన్ గిల్ గైర్హాజరీలో వచ్చిన అవకాశాలను యశస్వి జైస్వాల్ అందిపుచ్చుకోలేకపోయాడు.వరుసగా రెండు మ్యాచ్‌ల్లో విఫలమయ్యాడు. అయితే మూడో వన్డేలో అతనికి ఆఖరి అవకాశం దక్కనుంది. ఒకవేళ జైస్వాల్‌ను తప్పించాలనుకుంటే రుతురాజ్ గైక్వాడ్‌ను ఓపెనర్‌గా ఆడించాల్సి ఉంటుంది. ఆ సాహసం గంభీర్ చేయకపోవచ్చు. ఇప్పటికే బ్యాటింగ్ ఆర్డర్‌లో చేసిన ప్రయోగాలపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. తొలి రెండు వన్డేల్లో సుందర్ అంచనాలను అందుకోలేకపోయాడు. కేఎల్ రాహుల్ సూపర్ ఫామ్‌లో ఉండగా.. రవీంద్ర జడేజా ఫినిషర్ పాత్ర పోషించాల్సి ఉంది. స్పెషలిస్ట్ స్పిన్నర్‌గా కుల్దీప్ యాదవ్ సత్తా చాటాలి. రెండో వన్డేలో విఫలమైన భారత పేసర్లు అర్ష్‌దీప్ సింగ్, హర్షిత్ రాణా , ప్రసిధ్ కృష్ణ మెరుగ్గా బౌలింగ్ చేయాలి. ఫీల్డింగ్ కూడా మెరుగుపడాలి. అప్పుడే భారత్‌కు విజయం సాధ్యమవుతుంది. బెంచ్ ప్లేయర్లు ధ్రువ్ జురెల్, రిషభ్ పంత్, తిలక్ వర్మలకు నిరాశే ఎదురవ్వనుంది.

ఇక విశాఖపట్నంలో వన్డే ఫార్మాట్‌లో భారత జట్టు రికార్డు అద్భుతంగా ఉంది. టీమ్ ఇండియా ఈ మైదానంలో ఇప్పటివరకు 10 మ్యాచ్‌లు ఆడింది. ఇందులో 7 మ్యాచ్‌లలో భారత జట్టు విజయం సాధించగా, రెండు మ్యాచ్‌ల్లో ఓడిపోయింది. ఒక మ్యాచ్‌లో ఫలితం రాలేదు. స్టేడియం పిచ్ బ్యాటింగ్‌కు అనుకూలంగా ఉంటుంది. ఈ పిచ్‌లో అత్యధిక స్కోర్లు భారత్ జట్టువే. డిసెంబర్ 18, 2019న భారత్ వెస్టిండీస్‌పై 5 వికెట్ల నష్టానికి 387 పరుగులు చేసింది. అదేవిధంగా, ఏప్రిల్ 5, 2005న పాకిస్థాన్‌తో జరిగిన మ్యాచ్‌లో భారత జట్టు 9 వికెట్ల నష్టానికి 356 పరుగులు చేసింది. రెండు మ్యాచ్‌ల్లోనూ భారత జట్టు విజయం సాధించింది. అత్యల్ప స్కోరు రికార్డు న్యూజిలాండ్‌పై ఉంది. అక్టోబర్ 29, 2016న భారత్‌తో జరిగిన మ్యాచ్‌లో న్యూజిలాండ్ 79 పరుగులకు ఆలౌట్ అయింది. రెండో అత్యల్ప స్కోరు భారత్‌ది. మార్చి 19, 2023న ఆస్ట్రేలియాతో జరిగిన మ్యాచ్‌లో భారత జట్టు 117 పరుగులకు ఆలౌట్ అయింది. పరుగుల తేడాతో అతిపెద్ద విజయాన్ని భారత్ 2016లో న్యూజిలాండ్‌పై నమోదు చేసింది. భారత జట్టు 190 పరుగుల తేడాతో గెలిచింది. వికెట్ల తేడాతో అతిపెద్ద విజయం ఆస్ట్రేలియా పేరున ఉంది. ఆస్ట్రేలియా 2023లో భారత్‌ను 10 వికెట్ల తేడాతో ఓడించింది.

### తుది జట్టు(అంచనా)

రోహిత్ శర్మ, యశస్వి జైస్వాల్, విరాట్ కోహ్లీ, రుతురాజ్ గైక్వాడ్, వాషింగ్టన్ సుందర్/నితీష్ కుమార్ రెడ్డి/, కేఎల్ రాహుల్(కెప్టెన్), రవీంద్ర జడేజా, కుల్దీప్ యాదవ్, ప్రసిధ్ కృష్ణ, అర్ష్‌దీప్ సింగ్, హర్షిత్ రాణా.

**ధ్రువ్ జురెల్, రిషభ్ పంత్, నితీష్ కుమార్ రెడ్డి, తిలక్ వర్మ**



## ఐసీసీ అవార్డుకు భారత మహిళా క్రికెటర్ నామినేట్

భారత మహిళా క్రికెటర్ షెఫాలీ వర్మ నవంబర్‌కు సంబంధించి ఐసీసీ ప్లేయర్ ఆఫ్ ది అవార్డు రేసులో నిలిచింది. అవార్డుకు షెఫాలీ నామినేట్ అయినట్టు ఐసీసీ శుక్రవారం వెల్లడించింది. నవంబర్‌లో భారత జట్టు తొలిసారిగా ఐసీసీ వరల్డ్ కప్ గెలవడంలో షెఫాలీ కీలక పాత్ర పోషించింది. ప్రాతిక రావల్ గాయపడటంతో ఆమె స్థానంలో వచ్చిన ఆమె ఆస్ట్రేలియాతో జరిగిన సెమీస్‌లో ఆకట్టుకోలేకపోయింది. కానీ, సౌతాఫ్రికాతో ఫైనల్‌లో ఆమె అదరగొట్టింది. 78 బంతుల్లో 87 పరుగులు చేసి భారత్ టైటిల్ సాధించడంలో ముఖ్య పాత్ర పోషించడమే కాకుండా ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్‌గా నిలిచింది. షెఫాలీతోపాటు ఆమెతోపాటు యూఏఈకి చెందిన ఇషా ఓజా, థాయిలాండ్‌కు చెందిన తిపాట్చా పుట్టావోంగ్ కూడా అవార్డుకు పోటీపడుతున్నారు. ఇప్పటివరకు భారత్ తరఫున హర్మన్‌ప్రీత్ కౌర్, దీప్తి శర్మ, స్మృతి మంధాన మంత్లీ అవార్డులు గెలిచారు.



## ఐపీఎల్ అనేది పెద్ద టోర్నమెంట్

### నేను బ్యాటింగ్ మాత్రమే చేస్తే సరిపోదు

### కేకేఆర్ మాజీ ఆల్‌రౌండర్ ఆండ్రీ రస్సెల్

**కోల్‌కతా:** కోల్‌కతా నైట్‌రైడర్స్ మాజీ ఆల్‌రౌండర్ ఆండ్రీ రస్సెల్ తాను ఐపీఎల్‌కు గుడ్‌బై చెప్పడం వెనుకున్న కారణాన్ని రివీల్ చేశాడు. 37 ఏళ్ల రస్సెల్ ఇటీవలే ఐపీఎల్‌కు రిటైర్మెంట్ ప్రకటించాడు. 2026 సీజన్‌కు సంబంధించిన వేలంలో తన పేరును ఉంచకూడదని నిర్ణయించుకున్నట్లు చెప్పాడు. దీంతో కేకేఆర్ ఫ్యాన్స్ షాక్‌కు గురయ్యారు. ఆల్‌రౌండర్ రస్సెల్ అలా సడెన్‌గా ఎందుకు రిటైర్మెంట్ ఇచ్చాడో తెలియక ఆందోళన చెందారు. అయితే తాన రిటైర్మెంట్‌కు అసలు కారణాన్ని రస్సెల్ స్వయంగా చెప్పేశాడు. రస్సెల్ రీసెంట్‌గా ఓ ప్రముఖ స్పోర్ట్స్ వెబ్‌సైట్‌కు ఇంటర్వ్యూ ఇచ్చాడు. 'ఐపీఎల్ అనేది పెద్ద టోర్నమెంట్. ఈ టోర్నీలో మ్యాచ్‌లు ఎక్కువగా ఉంటాయి. చాలా ప్రయాణం చేయాల్సి ఉంటుంది కూడా. ప్రాక్టీస్, జిమ్, వర్క్‌లోడ్ ఇలా అన్నింటినీ బ్యాలెన్స్ చేసుకోవడం చాలా కష్టం. ఒక ఆల్‌రౌండర్‌గా నాకు అది మరింత ఛాలెంజింగ్‌గా ఉంటుంది. నేను బ్యాటింగ్ మాత్రమే చేస్తే సరిపోదు' 'ఒక్కో మ్యాచ్‌లో కనీసం 2 ఓవర్లు బౌలింగ్ కూడా చేయాలి. నేను చక్కగా బౌలింగ్ చేయగలిగాను అనుకున్నప్పుడే, బ్యాటింగ్‌లో కూడా రాణించగలను. అంతేగానీ కేవలం ఇంపాక్ట్ ప్లేయర్‌గా బరిలోకి దిగి సిక్స్‌లు బాదేస్తే సరిపోతుంది అని నేను అనుకోను. బ్యాటింగ్, బౌలింగ్ రెండూ సమర్థంగా చేసినప్పుడే నేను ఆటను ఆస్వాదించగలను' రస్సెల్ వివరించాడు. అయితే ఐపీఎల్?లో ఆటకు గుడ్ బై చెప్పిన రస్సెల్ కోల్‌కతా నైట్‌రైడర్స్ జట్టుతో మాత్రం ఇంకా రిలేషన్ కొనసాగించనున్నాడు. ప్లేయర్‌గా గుడ్ బై చెప్పిన రస్సెల్ వచ్చే సీజన్ నుంచి కేకేఆర్ కోచింగ్ స్టాఫ్‌లో జాయిన్ కానున్నాడు. 'పవర్ఫుల్ కోచింగ్' అంటూ తాను రిటైర్మెంట్ పోస్టుకు రాసుకొచ్చాడు.కాగా, ఐపీఎల్ కెరీర్‌లో రస్సెల్ మొత్తం 139 మ్యాచ్‌ల్లో 174.18 స్ట్రైక్ రేట్?తో 2651 పరుగులు చేశాడు. ఇందులో 12 హాఫ్ సెంచరీలు ఉన్నాయి. 88లి అతడి అత్యధిక వ్యక్తిగత స్కోర్. అటు బౌలింగ్‌లోనూ రస్సెల్ రాణించాడు. ఐపీఎల్‌లో 123 వికెట్లు నేలకూల్చాడు. 2026 ఐపీఎల్ మినీ వేలానికి ముందు కేకేఆర్ రస్సెల్‌ను రిలీజ్ చేసింది. దీంతో వచ్చే సీజన్‌లో అతడు ఏ జట్టుకు ఆడాతాడో అని ఆసక్తి నెలకొన్న వేళ రస్సెల్ ఐపీఎల్ నుంచి తప్పుకుంటున్నట్లు ప్రకటించేశాడు.

## రెండో టెస్ట్‌లో ఆస్ట్రేలియా భారీ ఆధిక్యం

**బ్రిస్బేన్:** ప్రతిష్టాత్మక యాషెస్ సిరీస్‌లో భాగంగా ఇంగ్లండ్‌తో జరుగుతున్న రెండో టెస్ట్‌లో ఆస్ట్రేలియా భారీ ఆధిక్యం దిశగా సాగుతోంది. బ్రిస్బేన్ వేదికగా జరుగుతున్న ఈ మ్యాచ్‌లో ఆసీస్ బ్యాటర్లు అద్భుత ప్రదర్శన కనబర్చారు. దాంతో రెండో రోజు ఆట ముగిసే సమయానికి ఆసీస్ 73 ఓవర్లలో 6 వికెట్లకు 378 పరుగులు చేసింది. జేక్ వెదరాల్డ్(78 బంతుల్లో 12 ఫోర్లు, సిక్స్‌తో 72), మార్నస్ లబుషేన్(78 బంతుల్లో 9 ఫోర్లు, సిక్స్‌తో 65), స్టీవ్ స్మిత్(85 బంతుల్లో 5 ఫోర్లు, 2 సిక్స్‌లతో 61) హాఫ్ సెంచరీలతో రాణించాడు.ట్రావిస్ హెడ్(43 బంతుల్లో 3 ఫోర్లు, సిక్స్‌తో 33), కామెరూన్ గ్రీన్(57 బంతుల్లో 7 ఫోర్లతో 45) మరోసారి దూకుడుగా ఆడాడు. అలెక్స్ క్యారీ(45 బంతుల్లో 5 ఫోర్లతో 46 బ్యాటింగ్)తో పాటు మైఖేల్ నేజర్(15 బ్యాటింగ్) క్రీజులో ఉన్నారు. ఇంగ్లండ్ బౌలర్లలో బ్రైడన్ కార్స్(3/113) మూడు వికెట్లు తీయగా.. బెన్ స్టోక్స్(2/93) రెండు వికెట్లు పడగొట్టాడు.జోఫ్రా ఆర్చర్ ఒక వికెట్ తీసాడు. ప్రస్తుతం ఆసీస్ 44 పరుగుల ఆధిక్యంలో ఉంది. వన్డే తరహా బ్యాటింగ్‌తో ఆసీస్ దూకుడుగా ఆడింది. 5.17 రన్‌రేట్‌తో వేగంగా పరుగులు రాబట్టింది. మూడో రోజు ఆటలో తొలి సెషన్ మొత్తం ఆడినా ఆసీస్ ఆధిక్యం 150 పరుగులకు చేరుతుంది. అప్పుడు మ్యాచ్‌పై పట్టు చిక్కుతుంది. తొలి టెస్ట్‌లో ఆసీస్ విజయం సాధించిన సంగతి తెలిసిందే. అంతకుముందు 325/9 ఓవర్‌నైట్ స్కోర్‌తో రెండో రోజు ఆటను కొనసాగించిన ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్‌లో 334 పరుగులు చేసింది. ఓవర్‌నైట్ స్కోర్‌కు 9 పరుగులు మాత్రమే జోడించింది. జోఫ్రా ఆర్చర్‌ను బ్రెండన్ డగ్గెట్ ఔట్ చేయడంతో ఇంగ్లండ్ ఇన్నింగ్స్ ముగిసింది. జోరూట్(206 బంతుల్లో 15 ఫోర్లు, సిక్స్‌తో 138 నాటౌట్) అజేయ శతకంతో రాణించగా.. జాక్ క్రాలీ(76) హాఫ్ సెంచరీతో సత్తా చాటాడు. ఆసీస్ బౌలర్లలో మిచెల్ స్టార్క్(6/75) ఆరు వికెట్లు తీయగా.. మైఖేల్ నేజర్, స్కాట్ బోలాండ్, బ్రెండన్ డగ్గెట్ తలో వికెట్




## రిచా ఘోష్ ఆన్ డ్యూటీ

### డీఎస్పీగా బాధ్యతల స్వీకరణ

### బేసిక్ పే ప్లస్ బోనస్

**వెస్ట్ బెంగాల్:** మహిళల వన్డే ప్రపంచకప్ విజేత, రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (ఆర్‌సీబీ) విధ్వంసకర వికెట్ కీపర్ రిచా ఘోష్‌ను వెస్ట్ బెంగాల్ ప్రభుత్వం.. సిలిగురి అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్(ఏసీపీ)గా నియమించింది. డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ (DSP) హోదాలో ఆమె ఈ బాధ్యతలు చేపట్టింది. వెస్ట్ బెంగాల్ డీజీపీ(డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్) శ్రీ రాజీవ్ కుమార్(ఐపీఎస్) చేతుల మీదుగా రిచా ఘోష్ బాధ్యతలు స్వీకరించింది. పోలీస్ డ్రెస్‌లో రిచా ఘోష్ డీజీపీని కలవగా.. ఈ ఫొటోలను ఎక్స్ వేదికగా వెస్ట్ బెంగాల్ పోలీస్ విభాగం పంచుకుంది. ప్రస్తుతం ఈ ఫొటోలు నెట్టింట వైరల్‌గా మారాయి. లేడీ సింగం రిచా ఘోష్ అని ఫ్యాన్స్ ఆమెపై ప్రశంసల జల్లు కురిపిస్తున్నారు. క్రికెటర్ నుంచి పోలీస్ అధికారిగా నియామకమైన రిచా ఘోష్ జీవిత ప్రయాణానికి సంబంధించిన వీడియోను కూడా వెస్ట్ బెంగాల్ పోలీసులు సోషల్ మీడియా వేదికగా పంచుకున్నారు. మహిళల వన్డే ప్రపంచకప్ 2025లో భారత జట్టు విజేతగా నిలవడంలో 22 ఏళ్ల రిచా ఘోష్ కీలక పాత్ర పోషించిన సంగతి తెలిసిందే. దాంతో వెస్ట్ బెంగాల్ ప్రభుత్వం తమ రాష్ట్ర ప్లేయర్ అయిన రిచా ఘోష్‌కు డీఎస్పీ ఉద్యోగంతో పాటు రూ.34 లక్షల క్యాష్ ప్రైజ్ అందజేసింది. అంతేకాకుండా బంగా బిభూషణ్ అనే బిరుదును ప్రకటించింది. రిచా ఘోష్ స్వస్థలమైన సిలిగురిలోని చందమణి టీ ఎస్టేట్ ప్రాంతంలో ఆమె పేరు మీద కొత్త క్రికెట్ స్టేడియం కూడా నిర్మిస్తామని ప్రకటించింది.పవర్ హిట్టర్ అయిన రిచా ఘోష్ 16 ఏళ్ల వయసులోనే అంతర్జాతీయ క్రికెట్‌లోకి అరంగేట్రం చేసింది. మఖ్యంగా ప్రపంచకప్ ఫైనల్లో దూకుడుగా ఆడి భారత్‌కు భారీ లక్ష్యాన్ని అందించింది. 8 మ్యాచ్‌లు ఆడిన రిచా ఘోష్ 39.16 సగటు 133.52 స్ట్రైక్‌రేట్‌తో 235 పరుగులు చేసింది. భారత బ్యాటర్లలో రిచా ఘోష్‌దే అత్యుత్తమ స్ట్రైక్‌రేట్. ఈ టోర్నీలో మొత్తం 12 సిక్స్‌లు బాదిన రిచా ఘోష్.. ఒక ఎడిషన్‌లో అత్యధిక సిక్స్‌లు బాదిన భారత ప్లేయర్‌గా నిలిచింది. వుమెన్స్ ప్రీమియర్ లీగ్‌లో ఆర్‌సీబీకి రిచా ఘోష్ ప్రాతినిధ్యం వహిస్తోంది.








## తేరే ఇష్క్ మే తెలుగు ట్రైలర్ విడుదల

కోలీవుడ్ స్టార్ ధనుష్, బాలీవుడ్ హీరోయిన్ కృతి సనన్ జంటగా నటించిన రొమాంటిక్ డ్రామా 'తేరే ఇష్క్ మే'. ఈ చిత్రం నవంబర్ 28న ప్రేక్షకుల ముందుకు వచ్చి బాక్సాఫీస్ వద్ద సూపర్ హిట్ అందుకుంది. అయితే ఇదే సినిమాను తెలుగులో అమరకావ్యం పేరుతో విడుదల చేయబోతున్నారు. ఈ సందర్భంగా మూవీ నుంచి తెలుగు ట్రైలర్‌ను విడుదల చేసింది చిత్రబృందం. ఈ సినిమాకు ఆనంద్ ఎల్ రాయ్ దర్శకత్వం వహించగా.. ఏఆర్ రెహమాన్ సంగీతం అందించారు. ఆనంద్ ఎల్ రాయ్, ధనుష్ కాంబినేషన్‌లో 'రాంఝణా', 'అత్రంగి రే' తర్వాత మూడో చిత్రంగా ఈ సినిమా తెరకెక్కింది.




# పుష్ప-2 విడుదలకు ఏడాది

### ఎమోషనల్ పోస్ట్ చేసిన అల్లు అర్జున్

### విమల్ థియేటర్‌లో పుష్ప-2 టిక్కెట్ల రగడ

ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ కథానాయకుడిగా సుకుమార్ దర్శకత్వంలో వచ్చిన బ్లాక్ బస్టర్ చిత్రం 'పుష్ప: ది రూల్' గతేడాది ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ చిత్రం బ్లాక్ బస్టర్‌ను అందుకోవడమే కాకుండా రూ.1800 కోట్లకు పైగా వసూళ్లను రాబట్టింది. ఈ చిత్రం విడుదలై నేటికి ఏడాది పూర్తి చేసుకున్న సందర్భంగా మూవీని గుర్తుచేసుకుంటూ అల్లు అర్జున్ సోషల్ మీడియా వేదికగా ఎమోషనల్ పోస్ట్ పెట్టారు. 'పుష్ప' ఫ్రాంచైజీ తన జీవితంలో ఒక మరువలేని ప్రయాణంగా మిగిలిందని అల్లు అర్జున్ పేర్కొన్నారు. 'పుష్ప' మా జీవితంలో ఐదేళ్ల పాటు సాగిన మరువలేని ప్రయాణంగా నిలిచింది. ఈ చిత్రానికి ప్రేక్షకుల నుంచి లభించిన అపారమైన ప్రేమ, శక్తి, మా కళను మరింత లోతుగా అధ్యయనం చేయడానికి అవసరమైన ధైర్యాన్ని అందించింది. ఈ చిత్రాన్ని ఒక అద్భుతంగా మార్చినందుకు ఈ దేశంలోని ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రతి ఒక్కరికీ మేము ఎల్లప్పుడూ కృతజ్ఞులమై ఉంటాము. నా కళాకారులందరితో, సాంకేతిక నిపుణులతో, మొత్తం యూనిట్‌తో, నిర్మాతలు, పంపిణీదారులు మరియు ముఖ్యంగా మా కెప్టెన్ సుకుమార్ గారితో కలిసి ఈ ప్రయాణంలో నడవడం నాకు దక్కిన గొప్ప గౌరవం. ఈ ప్రయాణంలో భాగమైన మీ ప్రతి ఒక్కరికీ నేను ధన్యవాదాలు తెలియజేస్తున్నాను. మరోసారి, హృదయం నిండా కృతజ్ఞతతో ధన్యవాదాలు అంటూ అల్లు అర్జున్ రాసుకొచ్చాడు. ఇదిలావుంటే బాలానగర్ విమల్ థియేటర్‌లో పుష్ప 2 టికెట్ల రగడ కొనసాగింది. పుష్ప 2 రిలీజ్‌కు ఏడాది పూర్తయిన సందర్భంగా విమల్ థియేటర్‌లో పుష్ప 2 సినిమా వేశారు. ఈ నేపథ్యంలో పలువురు అభిమానులకు టికెట్స్ అందలేదు దీంతో ఫ్యాన్స్ ఆగ్రహానికి గురయ్యారు. టికెట్స్ లేకపోవడంతో ఆగ్రహంతో రెండు వర్గాలకు చెందిన ఫ్యాన్స్ పొట్టుపొట్టు కొట్టుకున్నారు. ఈ ఘర్షణకు సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.

## సైక్ సిద్దార్థ నుంచి సాంగ్ విడుదల

శ్రీనందు హీరోగా నటిస్తూ.. స్వయంగా నిర్మిస్తోన్న చిత్రం 'సైక్ సిద్దార్థ' వరుణ్ రెడ్డి దర్శకత్వంలో రూపొందుతోంది. యామిని భాస్కర్ కథానాయిక. డిసెంబర్ 12న ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలో తాజాగా ఇందులోని లవ్‌సాంగ్‌ను విడుదల చేశారు. 'ధుమ్ తకుమ్..' అంటూ సాగే ఈ పాటకు కాశర్ల శ్యామ్ లిరిక్స్ రాయగా.. జెస్సీ గిఫ్ట్ ఆలపించారు.







## అవతార్-3లో వారణాసి స్పెషల్ వీడియో

'వారణాసి' సినిమాను దర్శకధీరుడు రాజమౌళి భారీ స్థాయిలో తెరకెక్కించనున్న విషయం తెలిసిందే. వీరిద్దరి కాంబినేషన్‌లో సినిమా వస్తుందని తెలిసినప్పటినుంచే ప్రపంచవ్యాప్తంగా ఆసక్తి ఏర్పడింది. తాజాగా దీనికి సంబంధించిన ఓ ఆసక్తికర విషయం హాలీవుడ్‌లోనూ వైరల్ అవుతోంది. అవతార్ 3 సినిమాలోను 'వారణాసి' సర్‌ప్రైజ్ ఉండనున్నట్లు హాలీవుడ్ మీడియా పేర్కొంది. దీంతో ఈ న్యూస్ సోషల్ మీడియాలో షేర్ అవుతోంది.'అవతార్' డైరెక్టర్ జేమ్స్ కామెరూన్ అంటే రాజమౌళికి ఎంత అభిమానమో తెలిసిన విషయమే. సందర్భం వచ్చినప్పుడల్లా జక్కన్న ఆయన గురించి చెబుతూనే ఉంటారు. ఇప్పుడు జేమ్స్ కామెరూన్ దర్శకత్వం వహించిన 'అవతార్ 3' సినిమాలో రాజమౌళి 'వారణాసి' సర్‌ప్రైజ్ ప్లాన్ చేసినట్లు వార్తలు వస్తున్నాయి. డిసెంబర్ 19న 'అవతార్ 3' ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. ఈ సినిమాలోనే 'వారణాసి'కి సంబంధించిన ప్రత్యేక వీడియోను ప్రదర్శించే ఆలోచన చేస్తున్నట్లు హాలీవుడ్ మీడియా పేర్కొంది. ప్రస్తుతం 'వారణాసి' సినిమా షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. ఇందులో మహేశ్ రుద్ర పాత్రలో నటిస్తున్నారు. విలన్ పాత్ర కుంభగా పృథ్వీరాజ్ సుకుమారన్ కనిపించనున్నారు. ప్రియాంకా చోప్రా.. మందాకినిగా సందడి చేయనున్నారు. ఇప్పటికే విడుదలైన వీరి లుక్స్‌కూ విశేష స్పందన దక్కింది.

# జపాన్‌లో బాహుబలి ప్రత్యేక ప్రదర్శన

### కార్యక్రమంలో పాల్గొన్న ప్రభాస్



పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ మరోసారి తన క్రేజ్‌ను విదేశాల్లో నిరూపించాడు. జపాన్‌లో జరిగిన 'బాహుబలి: ది ఎపిక్' ప్రత్యేక ప్రదర్శనకు హాజరైన ప్రభాస్, అక్కడ అభిమానులతో కాసేపు ముచ్చటించారు. ఈ సందర్భంగా తీసిన ఫోటోలు సోషల్ మీడియాలో ఇప్పుడు దుమ్ము రేపుతున్నాయి. ఈ ఫోటోలలో ప్రభాస్ కనిపించిన కొత్త లుక్ ప్రత్యేక ఆకర్షణగా మారింది. ఇప్పటివరకు చూడని స్టైలిష్ అవతారంలో కనిపించిన డార్లింగ్, జపాన్ అభిమానులను మాత్రమే కాదు, ఇండియన్ సినీ లవర్స్‌ని కూడా షాక్‌కి గురి చేశారు. ప్రభాస్ తాజా లుక్ చూసిన అభిమానులు.. ఈ లుక్ స్పిరిట్‌ది అయి ఉంటుందేమో అని అంటున్నారు. జపాన్ ఫ్యాన్స్‌తో ప్రభాస్ ఆప్యాయంగా మాట్లాడిన వీడియోలు, ఫోటోలు జపనీస్ సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌ల్లో తెగ వైరల్ అవుతున్నాయి. దీంతో మరోసారి 'బాహుబలి' మేనియా కనిపిస్తోంది. ఇటీవల బాహుబలి ది ఎపిక్ చిత్రం ఇండియాలో విడుదలై మంచి టాక్ అందుకుది. బాహుబలి రెండు పార్ట్‌లని ఒక పార్ట్‌గా చేసి బాహుబలి ది ఎపిక్ పేరుతో విడుదల చేశారు. ఇక ఇదిలా ఉంటే ప్రభాస్ ప్రస్తుతం రెండు భారీ పాన్-ఇండియా ప్రాజెక్టుల్లో బిజీగా ఉన్న విషయం తెలిసిందే. హను రాఘవపూడి దర్శకత్వంలో ఫౌజీ అనే చిత్రం చేస్తున్నాడు. ఈ సినిమా షూటింగ్ చాలా కాలం క్రితమే ప్రారంభమైంది. ఆర్మీ నేపథ్యంతో తెరకెక్కుతున్న ఈ చిత్రం కోసం ప్రభాస్ కొత్త లుక్ ట్రై చేస్తున్నాడనే ప్రచారం వినిపిస్తోంది.మరోవైపు సందీప్ రెడ్డి వంగా దర్శకత్వంలో స్పిరిట్ అనే చిత్రం చేస్తున్నాడు. ఈ మూవీ షూటింగ్ ఇటీవలే మొదలైంది. సందీప్ వంగా సినిమా కోసం ప్రభాస్ మరింత రగ్గడ్, ఇ÷-టెనెన్స్ లుక్‌లో కనిపిస్తున్నాడా? అంటూ అభిమానులు అనుమానిస్తున్నారు.ప్రభాస్ కొత్త ఫోటోలు షేర్ అయిన కొన్ని గంటల్లోనే వేలాది లైక్స్, రీట్వీట్లతో రచ్చ చేస్తున్నాయి. ప్రపంచవ్యాప్తంగా ఉన్న డార్లింగ్ అభిమానులు ఈ లుక్‌ను చూసి మైమరిచిపోతున్నారు.

# ఆర్థిక లావాదేవీలపై అనవసర వార్తల తగదు

### త్వరలోనే అఖండ-2 విడుదల ఉంటుదన్న దగ్గుబాటి

నందమూరి బాలకృష్ణ, బోయపాటి శ్రీను కాంబినేషన్‌లో భారీ అంచనాల మధ్య రూపొందిన తాజా చిత్రం 'అఖండ 2' విడుదల వాయిదా పడటం టాలీవుడ్‌లో చర్చనీయాంశమైంది. వాస్తవానికి ఈ చిత్రం డిసెంబర్ 5న విడుదల కావాల్సి ఉండగా.. కొన్ని ఆర్థికపరమైన ఇబ్బందుల కారణంగా వాయిదా పడిన విషయం తెలిసిందే. ఈ వివాదంపై తాజాగా టాలీవుడ్ అగ్ర నిర్మాత, డిస్ట్రిబ్యూటర్ అయిన సురేష్ బాబు స్పందించారు. 'అఖండ 2' వాయిదాకు గల అసలు కారణాలను బయటపెట్టకుండా అనవసరపు ఊహాగానాలకు తెరదించారు. సైక్ సిద్దార్థ సినిమా కార్యక్రమంలో పాల్గొన్న సురేష్ బాబు 'అఖండ 2' ఇష్యూ గురించి ప్రస్తావిస్తూ.. నేను కూడా ఆ సమస్య గురించి మాట్లాడాటానికే వెళ్లాను. త్వరలోనే 'అఖండ 2' సమస్య పరిష్కారమవుతుంది. అఖండ 2 కి సంబంధించి అన్నీ ఆర్థికపరమైన ఇబ్బందులే అవి బయటకు వెల్లడించకూడదు అని అన్నారు. అలాగే సినిమాకు సంబంధించిన ఆర్థిక వ్యవహారాల గురించి ఎవరి ఇష్టం వచ్చినట్లు వాళ్లు రాస్తున్నారు. ఇది దురదృష్టకరం. ప్రతిఒక్కరూ 'అఖండ 2' రిలీజ్ కాకపోవడానికి ఏవేవో కారణాలు చెబుతున్నారు. అన్ని కోట్లు చెల్లించాలట అని రాస్తున్నారు. అవి అన్నీ అనవసరపు ప్రస్తావనలు అని సురేష్ బాబు స్పష్టం చేశారు. ఆడియన్స్ సినిమా ఎప్పుడు రిలీజ్ అవుతుందా అని ఎదురు చూస్తున్నారు. త్వరలోనే ఈ సమస్య పరిష్కారమై సినిమా విడుదలవుతుంది. అని ఆయన ధీమా వ్యక్తం చేశారు.





Printed, Published by **Mohammed Murthuza.** Printed at Vivek Art Printers APHP SHOP NO.12, OSMANIA UNVERSITY ROAD,HYDERABAD. PUBLISHED ROOM NO.10, Ground Flour, Budha Bhavan, M.G.Road, Secunderabad -03. Ali Publication, Hyderabad. www.samayam.net Mobile No. **98660 19778, 89789 60131**